
అభ్యుదయ


జూన్ 1979

ఒక రూపాయి

సాహిత్యమూర్తుల అస్తమయం



చెలం



అబ్బూరి

అభ్యుదయ

సంచిక 6 సంపుటి 3 జూన్ 1979 సం॥ చందా రూ -10

విషయసూచిక

స్త్రీ స్వేచ్ఛను కోరుకున్న చలం కన్నకలలు
తీరం చేరకముందే విరిగి పడిన అలలు

ఆధునిక సాహిత్యంలో చలం సృష్టించినంత సంచలనాన్ని మరే రచయితా సృష్టించలేదు ఆయనంత వివాదాస్పదమైన వ్యక్తి కూడా మరొకరులేరు. స్త్రీల సమస్యలను అంతబలంగా, శక్తివంతమైన తెలుగు వచనంలో సృష్టించిన రచయితా మరొకరులేరు.

స్త్రీ జాతికి జరుగుతున్న అన్యాయాన్ని ప్రతిఘటించడానికి వాడి కలాన్ని చేతబట్టి ఉప్పెనలా లేచిన చలం అన్యాయాన్ని పరిష్కరించడానికి సరైన శాస్త్రీయ పద్ధతులను ఉపయోగించాలన్న ఆలోచనా, సరియైన తాత్త్విక పునాదీ లేకపోవడం వల్ల మళ్ళీ అంతేవేగంతో రమణాశ్రమంలో తలదాచుకొన్నాడు. తెలుగుదేశాన్ని జాగృతం చేయదలచుకున్న చలమే తెలుగుదేశం పట్ల, తెలుగుప్రజలపట్ల ద్వేషాన్ని, కసిని పెంచుకున్నాడు.

ఆయన వ్యక్తిత్వంలోని ద్వంద్వ వైఖరి ఆయన రచనల్లోనే కనిపిస్తుంది. చలం తనమీద తాను వ్యక్తీకరించిన భావాలను, చలంమీద ప్రసిద్ధ రచయితల అంచనాలను ఉల్లేఖిస్తున్నాం.

శైలి

'నా కథలద్వారా నేను కొట్టే దెబ్బలకి ఎవరూ ఎదురుపలకక, దిమ్మ తిరిగి పడుకుంది తెలుగు పాఠక ప్రపంచం. కాని దానిరొద నాకు వినపడుతోనే వుంది. పాఠకలోకంనుంచి అవ్యాజమైన బాధాశవమే నాకెంతో ప్రోత్సాహాన్నిచ్చేది. త్వరలోనే ఆ పాఠకులు నాచుట్టూ చేరుతున్నారు. నా శైలి గొప్పదని, దాన్ని ప్రతివారు అనుకరించాలని చూశారు. ఈ నాటికీ అది ఎవరి శక్యం కాలేదు. కాని సాహసించి నాతో సహవాసంచేసే యువకులు నేను రాసిన శృంగారపు, నా విప్లవ భావాలకి వాటి ఆచరణకి తట్టుకోలేక, వెక్కిరించి భయపెట్టే వారిధాటికి తాళలేక. బావురుమంటో భయపడి నన్ను వొదిలిపోయేవారు. నేను రాసిన వాటినన్నిటికి గొప్ప admiration యిచ్చాడు రామ్మూర్తి. అతనివెనక డోలుకొట్టేవాడు ప్రకాశం. ఎవరు ఏమూల నా రచనల్ని ప్రచురింప పూనినా, ధైర్యంచేసి వేస్తామన్న,కవులు, రచయితలు, యాత్ర కింద బయలుదేరి దూరస్థలాలకి సొంత ఖర్చులమీద పోయి, వాదించి, ప్రార్థించి, బెదిరించి పత్రికలవాళ్ళ నోళ్ళు నొక్కేసేవారు.

—(చలం ఆత్మకథ - పేజి 121-122)

బిడ్డల శిక్షణ

'నా కెందుకు పుట్టింది ? బిడ్డల శిక్షణ రాయాలని. కారణంలేదు. పిల్లలు పడే బాధని భరించలేని నాలోని స్వభావం నాలోంచే, నా పుటకలోంచే పుట్టింది ఆ బాధ.

ప్రేమగల తల్లి పిల్లని చీమకుడితే నన్నా కుట్టింది కాదు పాడుచీమ, అనే తల్లి చింతబరిక తీసుకొని ఆ పిల్లనేబాత్తోవుంటే ఆ పిల్ల 'నేను ఎన్నటికి చెయ్యను. అమ్మా ! కొట్టకే ఇంక ఎన్నటికీ చెయ్యనే, నీ కాళ్ళు పట్టుకుంటానే' అని బాధతో అరిచే పిల్లని 'నోరు ముయ్యి, నోరు ముయ్యి' అంటూనే బాదుతోవుంటే మానవుడే కాదు ఆకాశం, వాయువు, దిక్కులు నవ్వుతో, ఆకుల్ని గడ్డిమొక్కల్ని ప్రేమతో తాకే సూర్యుడు ఎట్లా నిర్వికారంగా చూడగలుగుతున్నారో !'

—(ఆత్మకథ – పేజి 176)

రాజకీయాలు

'దేశంలో జరిగే విప్లవ రాజకీయ సంగ్రామాలవల్ల నామనస్సు పరిపరివిధాల ఆలోచించడం ప్రారంభించింది. మొదట గాంధీగారి సిద్ధాంతాలు, తర్వాత కమ్యూనిస్టు సిద్ధాంతాలు. నా పుస్తకాలమీద వొచ్చే విమర్శలు నన్ను గట్టిగా కలవర పెడుతున్నాయి. వీటన్నిటిలో గూడా ఈశ్వరుడు, స్త్రీ అనే రెండు సమస్యలు నన్ను ఎడతెరిపిలేకుండా తల్లకిందులు చేస్తోనే వున్నాయి.'

—(ఆత్మకథ – పేజి 188)

స్త్రీ

'అనాదిగా స్త్రీని–సంఘం భర్తరూపంలో, సంఘరూపంలో, తల్లిదండ్రుల రూపంలో పురుషుడికి వొప్పజెప్పింది. గుమ్మం దాటిందంటే స్త్రీకి యింక దిక్కులేదు. అట్లాంటి స్త్రీకి దిక్కుచూపించావా, నీ హృదయం యిచ్చావా, జాలిపడ్డావా క్షమించదు లోకం. అనే ఈ మనుషులకి చలంమీద ద్వేషం.'

—(ఆత్మకథ – పేజి 261)

తెలుగుదేశంపై ద్వేషం

'ఆ గాలిలోనో, నా జాతకంలోనో ద్వేషం, ద్వేషం అని రాసిపెట్టి వుంది. 'హమ్మ' చివరికి ఈ తెలుగుదేశం వొదిలిపోతున్నం. ఇంక వొదిలివెళ్ళాక ఇంక

ఎన్నడూ నేను బతికివుండగా గాని, బతికి చచ్చిన ఆత్మగాని ఈ తెలుగు దేశం వేపు రాదు అని నిశ్చయించుకున్నాను. అట్లానే దైవకృపవల్ల ఇంతవరకు మళ్ళీ ఆదుమ్ము తొక్కే అవసరం నాకు కలుగలేదు.—(ఆత్మకథ – పేజి 303-304)

x x x

... ఇంక తెలుగుదేశంతో సంబంధం ఉండకూడదని— నా కొయితాలు, ఉత్తరాలు, పుస్తకాలు అన్నీ తగలేశాను, ఎవరన్నా ఉత్తరాలు రాసినా జవాబు కూడా రాయకూడదనుకున్నాను. అంత విసిగెత్తించారు నన్ను'

—(ఆత్మకథ - పేజి 329)

x x x

ఆత్మకథ–అయోమయం

"ఆత్మకథలంటే నా కసహ్యం. నా ఆత్మకథ రాయడమంటే తను లోకానికి ముఖ్యమైన మనిషయినట్టు, తానేదో ప్రజలకి తీరని ఉపకారం చేసినట్టు, తన సంగతి చెప్పుకోకపోతే లోకానికి తన గొప్ప తెలియనట్టు, తెలియకపోతే లోకాని కేదో నష్టమైనట్టు అనుకుంటున్నాడన్నమాట రాసినవాడు.

ఎందుకు పుట్టానా? పుట్టినవాణ్ణి చప్పున చావక ఎందుకింతకాలం తన sorroundings ని ఇంత కల్మషం చేశామా అనుకొనే నా వంటివాడు తన కథను సిగ్గులేకుండా చెప్పుకొంటున్నాడంటే ఏ మాత్రం క్షమింపదగిన విషయం కాదు. అయినా ఆ పని జరుగుతుందంటే, ఏదీ మన చేతుల్లో లేదన్నమాట." (ఆత్మకథ)

కమ్యూనిజం

"ఇంత రాస్తున్నానేగాని, కమ్యూనిజం వంటి గొప్ప మార్పువచ్చి వరద మల్లే ఈ చెత్తనంతా వూడ్చేసిందాకా ఈ మనుషులు ఎట్లానూ కదలరు. ఎన్ని ఇట్లాంటి వ్యాసాలు రాసినా ఏ యుద్ధాలో, ఉద్యమాలో కమ్యూనిజంలోకి కదిలించవలసిందే ఇట్లాంటి రాతలన్నీ అట్లాంటి గొప్ప మార్పులు రావడానికి సోపానాలు. కమ్యూనిజం వచ్చి ఈ గృహాలనే గుళ్ళని విధ్వంసంచేసి... ఈ పూరగాయల గూళ్ళనీ దేవుడి గదుల్నీ, వంటిళ్ళనీ కూలదోసి "కామన్ మెసస్‌నీ" పిల్లలకి గొప్ప ఆట మందిరాలనీ, విద్యాలయాల్నీ స్థాపించిందాకా-ఒకర్నొకరు హింసించుకోవడం మానతారా?" ("స్త్రీ")

స్వేచ్ఛ

"ఉత్త స్వేచ్ఛవల్ల ఏం ప్రయోజనం.... ఆ స్వేచ్ఛవల్ల సుఖమూ శాంతీ ఆత్మవైశాల్యమూ కలగందే..." ("స్త్రీ")

గుణదోష పూరితం

"ఏ ఇతర తెలుగు రచయితకూ లేని ప్రత్యేకత గుడిపాటి వెంకటచలం గారిలో ఒకటి కనిపిస్తుంది. ఆయన రచనలను గురించి రెండే అభిప్రాయాలు— అంత ఉత్తమ రచన లేదనీ, అంత హేయమైన రచన లేదనీ. "బాగానే ఉంది",

"షుమారుగా ఉంది", "ఓ మాదిరిగా ఉంది–", "ఉంది!–" అన్న ముక్కలు ఆయన రచన గురించి వినపడవు. కాని నిజం ఆలోచిస్తే ఇతరుల రచనలవలనే ఆయన రచనకూడా గుణదోషపూరితమైనదే."

—కొడవటిగంటి కుటుంబరావు.
("సాహిత్య ప్రయోజనం" పేజి 16)

"ముఖ్యంగా వెంకటచలంగారి రచనకు ఆపాదించబడుతున్న దోషమేమంటే ఆయన రచననిండా బూతులుంటవని... మరొక దోషమేమిటంటే ఆయన కథలలోని పాత్రలు నీతి బాహ్యంగా ప్రవర్తిస్తవని, అందుచేత రచన యావత్తూ నీతిబాహ్యంగా ఉన్నదని.

"నీతి, న్యాయ, ధర్మసిద్ధంతాలు చెయ్యటం సాహిత్య కళ యొక్క ఉద్దేశం కాదు. అవి తెలుసుకోవటానికి నీతి శాస్త్రమూ. న్యాయశాస్త్రమూ, ధర్మశాస్త్రమూ ఉంటై."

"కొందరు ఈ కాలపు యువకులు పట్టే తప్పేమంటే ఆయన కథల్లో కొన్ని సంఘటనలు అసహజంగా ఉంటవని. ఈ మాట అనేవారు సామాన్యంగా కథకు ప్రాముఖ్యత యిచ్చి, శిల్పమూ, శైలీ రచయిత యొక్క అభిప్రాయమూ మొదలైనవి గ్రహించలేనివారు." ("సాహిత్య ప్రయోజనం" పేజి 18)

అరాజకత్వం

"చలంగారు ముఖ్యంగా స్త్రీలు మన సమాజంలో అనుభవించుతున్న కష్ట నిష్ఠూరాలను వాస్తవికంగా చిత్రించుతారు. సజీవమైన వ్యావహారిక భాష వాడుతారు. వీరి కథలకు, నవలలకు అన్నిటికి దాదాపు యితివృత్తం స్త్రీ పురుష సంబంధాలు, పూర్వశృంఖలాలను బద్దలుచేసి స్త్రీ తిరుగుబాటు చేయడమే అనేక రూపాలలో చలంగారు చిత్రించారు. కాని వీరేశలింగంగారివలె నిర్మాణాత్మకమైన మార్గాన్ని చూపలేకపోయారు. "బానిసగా ఉండొద్దు? తిరుగుబాటు చెయ్! ఇంట్లోంచి లేచిపో అని ధైర్యంగా బోధించారు. కాని యింట్లో నుంచి లేచి బజారునపడిన సోదరికి నేటి సమాజంలో గతి ఏమిటి? పెట్టుబడిదారీ నాగరికతలో తక్కిన అన్నివస్తువుల మాదిరిగానే అమ్ముడు కావడమేకదా! తద్వారా ఆమె యింకోరకపు బానిసత్వంలోకి దిగజారిపోవడమేగదా! ఈ విషమావస్థనుండి తప్పించుకొనే మార్గాన్ని చలం రచనలు ఏ మాత్రం సూచించవు. అదే వాటిలోని అరాజకత్వం. భాష, రచనా నైపుణ్యం, శిల్పం దృష్టితోచూస్తే చలంగారి రచనలు తెలుగు సాహిత్యంలో కథలను ఒక క్రొత్త స్థాయికి తీసుకుపోయాయి. —"చంద్రం"

(అభ్యుదయ Oct 1948.)

నిత్య విజ్ఞానాన్వేషి అబ్బూరి

వయసుపైన బడుతున్న కొద్దీ చాలా మందిలో శరీర బలంతో పాటు ఉత్సాహం గూడా సన్నగిల్లుతూ ఉంటుంది. విజ్ఞానార్జనపైకూడ అపేక్ష తరుగుతుంది. కాని అబ్బూరి రామకృష్ణరావు విషయంలో ఈ సూత్రం తప్పని రుజువైంది. వార్ధక్యం వచ్చినా ఆయనలో బౌద్ధికంగా మార్పు కనిపించలేదు. చమత్కార సంభాషణలోను, జ్ఞాపక శక్తిలోను, విద్యావ్యసనంలోను ఆయనలో మార్పు రాలేదు. ఎనిమిది పదులు పై బడ్డ తర్వాత గూడ వందల వేల పద్యాలు, శ్లోకాలు ఆయన ధారణలో ఉండేవి.

అన్య భాషా సాహితీ పరులతో ఆయనకు ఆత్మీయ సంబంధాలుండేవి. బందరులో చదువుకునే రోజుల్లో భోగరాజు పట్టాభి సీతా రామయ్య, చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి ప్రభావం ఆయనమీదుండేది. ఆ తరువాత మైసూరులో సంస్కృత కళాశాలలో చదివే రోజుల్లో కట్టమంచి రామలింగా రెడ్డి, రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మతో స్నేహం కుదిరింది. 1917-1919 మధ్య శాంతినికేతన్‌లో రవీంద్ర నాథ ఠాగూర్, అరవింద ఘోష్‌ల ప్రభావం సోకింది. 1919 నుంచి నాలుగైదేళ్ళు దుగ్గిరాల గోపాల కృష్ణయ్య గారి శిష్యులుగా స్వాతంత్రోద్యమంలో పాల్గొన్నారు.

1936 లో ప్రేంచంద్, సజ్జాద్ జహీర్, హిరేన్ ముఖర్జీలతోపాటు అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం స్థాపించారు. అ సంఘం నడిపిన 'ఇండియన్ లిటరేచర్' పత్రిక సంపాదక వర్గంలో ఒకరుగా ఉండేవారు. 1939 ప్రాంతంలో ఎం. యన్. రాయ్, తర్కతీర్థ లక్ష్మణశాస్త్రి జోషి, సచ్చిదానంద వాత్స్యాయన్లతో కలిసి ఇండియన్ రినైసాన్స్ అసోసియేషన్ స్థాపించారు.

ఆంధ్ర దేశంలోని తొలికమ్యూనిస్టులలో అబ్బూరి ఒకరు. విశాఖపట్టణం రేవు కార్మికుల కోసం ఆయన రాత్రి పాఠశాల నిర్వహించేవారు.

అబ్బూరి కవితా రచన అయిదో ఫారం చదువుతుండగానే మొదలైంది. 1903 లో 'జలాంజలి' రచించారు. అది 1914 లో ప్రచురితం అయింది. అప్పటి నుంచి ఆయన అడపా దడపా రాస్తూనే ఉండేవారు. మల్లికాంబ, ఊహా గానం, నదీ సుందరి మొదలైనవి పుస్తక రూపంలో విడిగాను; ఎర్రగన్నేరు, మందార శిశువు మొదలైనవి 'వైతాళికులు' 'మహోదయం' 'వెన్నెలకుప్పలు' వంటి సంకలన గ్రంథాల్లోనూ ప్రచురితమైనాయి.

రాయప్రోలు, కట్టమంచి వంటి తొలితరం భావ కవులతోబాటే అబ్బూరి కూడా ఆధునిక కవితా ధోరణులను ఆంధ్ర దేశంలో వ్యాపింప జేశారు.

అయితే తక్కిన వారి భాషాదృష్టి, భావ దృష్టి పెద్ద మార్పులు చెందలేదు. కాని అబ్బూరి రాజకీయ, సామాజిక సాహితీ భావనలు అనుక్షణం వినూతనత్వాన్ని అన్వేషిస్తూనే ఉన్నాయి.

1919లో రాసిన జలియన్‌వాలాబాగ్ (బుర్ర కథ)ను అప్పటిప్రభుత్వం నిషేధించింది. ఈ రచన ఇప్పటికీ దొరకలేదు. 1923-24 మధ్యకాలంలో కృష్ణా పత్రికలో 'రసమంజరి' ప్రారంభించి "సూర్యరాజు కథలు" రాశారు. 1924లో 'మంగళ సూత్రం' అను అపరాధ పరిశోధక నవలను గూడా రాశారు. అనేక చాటువులు రాశారు.

నాటక రంగంలో గూడ ఆయన విశేషంగా కృషిచేశారు. కన్యాశుల్కాన్ని ప్రదర్శనయోగ్యం చేశారు. ఆయన రామప్పంతులు వేషం వేసి రక్తికట్టించారు.

లోకవృత్తాన్ని ప్రతిఫలించటమే ఉత్తమ సాహితీ లక్షణమని ఆయన నమ్మేవారు. లోకవృత్తాన్ని ప్రతిఫలించటానికి విద్యలన్నీ చదవాలి. కేవలం ప్రతిభమీద ఆధారపడి పనిచేయలేం అని ఆయన చెప్పేవారు.

అబ్బూరి రామకృష్ణారావు ఎంత ఎక్కువగా చదివారో అంత తక్కువగా రాశారు. ఆయన నిత్య ప్రయోగశీలి. కీర్తికండూతి అంటే ఆయనకు తెలీదు.

గతం మీద కన్న వర్తమానం మీద ఆయనకు శ్రద్ధ ఎక్కువ. భవిష్యత్తు మీద విపరీతమైన ఆశాభావం.

"పైరుపండి రాలినట్లు–
ముసలియై లయించు జీవి
రాలి మరల వచ్చుననుట
రమ్యమైన ఎండమావి
వచ్చేదొక కొత్తపైరు
పండేదొక కొత్తపంట
దీనిపైని శ్రద్ధలేక
దానికేల కడుపుమంట ?
ఏమన్నా నేటికన్న
రేపటి విలువే ఎక్కువ ?
అందువల్ల కానోపును
అల్పసంఖ్యపై మక్కువ" అని

ఖండితంగా చెప్పారాయన.

తన భౌతికకాయానికి మత సంబంధమైన కర్మకాండ చేయవద్దనికోరి ఆయన కన్నుమూశారు.

"యువజన" మాస పత్రిక

చ ద వం డి

రెడ్డోచ్చె వెంద లెత్తుకో

కథానిక

వై. సి. వి. రెడ్డి

దేవుడుంటే యిల్లెందుకవుతుంది? ఒక పిల్లది మూగిది. యింకొకపిల్లది చెవిటిది. పెండ్లాము చూస్తామా అంటే పూసుకాళ్ళది, శక్తిలేనిది ఏ పనీ అలుపు లేకుండా చేయలేదు. చిన్నా పెద్దా కలసి ఆరు మంది పిల్లోల్లతో అస్తులూ పస్తులతో ఆరిపోతావుంది. మొగడున్నాడు వానికి పూరూలేదు పేరూలేదు. యిల్లూలేదు వాకిలీలేదు. ఏ గోడ కిందనో ఏ చెట్టు కిందనో పడుండాల. రోగిష్టి భార్యతో, ఎత్తుతెలియని పిల్లోల్లతో బతుకులో బండ లేసుకోవాల. వాడు మామూలు మనిషి. వానికి మామూలు కూళ్ళిస్తారు. పనిచేత కాదని సాకుపెట్తారు. మూగిదీ చెవిటిదీ ఆడపిల్లలు, పనికెదిగినారు కాబట్టి సరి పోయింది. వాళ్ళింత తెస్తారు. వాళ్ళే దిక్కు ముసిలోల్లకు. వూరుకోకుండా పని చేస్తారు. ఎటొచ్చీ యిన్ని గింజలు తెస్తారు. పనిలేని దినాల్లో నాలి పనిచేసి యింత బువ్వ తెస్తారు. సెరి రెండు ముద్దలు సంగటిని సంపాదిస్తారు. ఎవ రెవరు ఎంత తింటారో ఎట్ల పంచుకొం టారో తెలియదు.

ఎవరిని చూచినా పని చూపించ మని సైగల్తో మూగిపిల్లవి అడుగుతుంది. ఏమి చెప్పుతాడా అని వాళ్ళ నోటిదిక్కు చూస్తూ ఉంటుంది చెవిటి పిల్ల. పెద్దోళ్ళి ద్దరూ మాలోకం పడి దిక్కుతెలియని స్థితిలో ఆలోచిస్తూ వుంటారు. చిన్న పిల్లోల్లు దిక్కు దిక్కునచూస్తూ ఏమైనా తెస్తారేమో, తెచ్చినారేమోనని అక్కగారి దిక్కుగా ఆశగా చూస్తూంటారు. వాళ్ళం దరికీ మానాన్ని సరిగా కాపాడుకోడానికి బట్టలు లేవు. అన్నీ అడక్కచ్చుకొన్న చింపిరి బట్టలే. నేను వూళ్ళో ఉన్నప్పుడు ఆ పేద కుటుంబాన్ని చూచినాను. ఒకటి రెండు దపాలు తోచింది యివ్వడమూ జరిగింది.

కుటుంబ పెద్ద గంగడు. చేతనై నంతా పనిచేస్తాడు. పేడాకసువూ-పొట్టూ సొప్పా, దంచేది యిసిరేది, ఎదో చిన్న చిన్న పనులు చేసేదికాక-వరుపుసేద్యా లకు నీళ్ళుకాడికీ-గడ్డితీయనూ-పోతాడు. వానికి బతికేది చేతకాదు. మూగి చెవిటి పిల్లల్తో, రోగిష్టి భార్యతో యింకా నలు గురు ఎత్తుతెలియని పిల్లోల్లతో ఎట్లాబతు కుతున్నాడో-పాపం - అని అనుకొనే వాన్ని. ఎండిన కట్టె, ఎప్పుడు రాలి పోతుందో అన్నట్లుంది వాని పెండ్లాం. నాకు జూడ-పిల్లోల్లు తెలియనోల్లనీ, మూగి, చెవిటి అనీ-వారి మీద ఆధార పడి బతుకుతున్నామే అనీ-ఆమె ఆ స్థితికి వచ్చిందేమో. వాళ్ళుతెచ్చే తిండి తినలేక కుములుకొని అట్లా చిక్కి శల్య మైందేమో ! అప్పుడప్పుడు సన్నని పిల్లోల్లను చూచి కుములుకొని కుములు కొని ఏడ్చుకొంటూ వుంటుందంట. ఆ మాట మొగుడే చెప్పినాడు.

ఆ కుటుంబమంతా ఎక్కువగా గోవింద రెడ్డి యింట్లో పనిచేస్తూ వుంటారు. అతను ఎంత కూలిస్తే అంత, గంగడు మాత్రం-గాడి ఏట లూడ్చి-పోట్టూ సొప్పా తెచ్చి యిస్తూ వుంటాడు. ఆ పని నిత్యం చేయాల్సిందే. ఎవరి పనికి పోవాలన్నా-పై పనులు విధిగా చేసి పోవాల్సిందే.

ఊడిపడినట్లు గంగడు వచ్చినాడు. అప్పుడే లేచి మొగం కడుక్కుంటున్నా- "ఏరా గంగా బాగున్నావా" అని అన్నాను.

"మీ దాపున్నే బతుకు బాబ్బా. ఆవూళ్లో బతకలేను." అని కంట నీరు పెట్టుకొన్నాడు. 'ఛ' ఏడ్చేదెందుకురా-కూర్చో అని "నీ పెండ్లామూ పిల్లోలూ బాగున్నారా" అని అన్నాను.

"అందరం వచ్చినామబ్బా, రాత్రి రైల్లో టిక్కట్లు లేకుండా ఎట్లో వచ్చినాం. పక్కన అర స్టేషన్‌లో దింపినారు. అక్కడి నుండి నడిచి వచ్చినాం" అని గొంతు కూర్చొన్నాడు.

"ఏరీ వాళ్ళెక్కడున్నారు పిల్చుకోని రాపో." అని తరిమినాను. నా మాటల్లో ఆదరించే ధోరణి కనపడిందేమో ఉత్సాహంగా పరిగెత్తినట్లు పోయినాడు. నాకూ దిక్కుతెలియని టౌన్లో ఎట్లా యీ కుటుంబాన్ని ఆదుకొనేది. "వీనికి ఏ పని చేతకాదే-ఎట్లబ్బా" అని ఆలోచిస్తూ కూర్చున్నాను. తోటకాడికి పంపిస్తే అని ఆలోచన వచ్చింది. పంపి ఏం లాభం స్వంత సేద్యం లేదే. అక్కడా ఒకయ్యకు పనికి పోవాల్సిందే ఉండూరు కాదు. వానికి వాని పిల్లోల్లకూ పని ఎవరు చూపిస్తారు. అని తీవ్రంగా ఆలోచిస్తూ ఏమైనా తోట వద్దకే పంపాలని అనుకొన్నాను. అంతలో అందరూ వచ్చినారు. నేను మొదట చూచింది భార్యను. ఏముంది పాపం చిక్కిపోయింది. వట్టికట్టె. ప్రాణముంది అంతే మూగిపిల్ల చెవిటిపిల్లా నన్నుచూచి నవ్వుముఖాలు పెట్టినారు. చిన్న పిల్లోల్లు-యింట్లో ఉన్న కుర్చీలు మంచాలూ చూస్తున్నారు. టేబుల్‌మీద ఉన్న గడియారాన్ని చూచి-టిక్ టిక్ మనే శబ్దానికి ఆశ్చర్యపోతున్నారు.

వెంటనే తిండి తీర్థాలు ఏర్పాటు చేసి-తోటకాడికి పోండని చెప్పి-బస్సు చార్జీలు యిచ్చి-అక్కడున్న - తోట గుత్తకు చేస్తున్న సన్నకారు రైతు రామిరెడ్డికి ఒక జాబు రాసి పంపినాను. ఒక పెద్ద బరువుదించుకొన్నట్లయింది. సెడ్డులోనే వుండమనీ-పనులు చూపించమని-జాబులోని సారాంశం. ఆరో జంతా-ఎట్లా బతుకుతారో పాపం-ఏదో ఒక సాకుపెట్టి సెడ్డులోంచి వెళ్ళగొట్టుతారేమో-పనులు సరిగా చూపరేమో-కూళ్ళు సరిగా యివ్వరేమో-అని ఒకటే ఆలోచనతో గడిచింది.

నాలుగు రోజులు తోటవద్దవుండి. గంగడు వచ్చినాడు. "ఏరా గంగా సెడ్డులోనే వున్నారా-పనులు దొరుకుతా వున్నాయా-రామిరెడ్డికి జాబు యిచ్చి

నావా - పరవాలేదా - అక్కడవుండగ లదా"-అని అడిగినాను.

"రామిరెడ్డి మంచోడబ్బా. ఆ రాత్రికి అన్నం పెట్టించినాడు. సెడ్డులోనే వుండరా తర్వాత చూస్తాం - మీయిళ్ళల్లోనే కుదిరితే కొట్టం చూస్తాంలేరా" అని చెప్పి నాడబ్బా, అని అన్నాడు గంగడు.

"ఏరా మనసెడ్డుబాగుందే. గాలి వానలకు ఆటుకొంటుంది. అక్కడే వుండరా. పూర్లోకిపోతే యిబ్బంది పడతావురా" అని అన్నాను.

"లేదులేబ్బా యిళ్ళల్లోనేవుంటేనే మంచిది. ఒంటిగా సెడ్డులో వుండలేం. తోడుండరు. పైగా ఆడ పిల్లోల్లుందేపని బావి కాడా సెడ్డుకాడా గుడ్డలుతుక్కోవడం - అంతా రోతలేబ్బా. యిళ్ళల్లోకి పోతే ఎంతరోతున్నా పరవా లేదు. ఎవరూ చూడరు. చూచినా అందరితో పాటు మేమూ అని అను కొంటారు" అని గంగడు చెప్పినాడు.

"రామిరెడ్డి చెప్పితే పోతున్నావురా - వూర్లో మీ యిళ్ళలో సరిగా జరక్కపోతే-యిబ్బంది. సెడ్డు మేలురా నీకూ - భయం లేకుండా వుంటుంది. చుట్టూ పట్టూ తోటల్లో పనులు చేసుకోవచ్చు" అని అన్నాను.

"రామిరెడ్డితో మాట్లాడు కొంటా లేబ్బా" అని అంతలో తుంచేసినాడు గంగడు.

"ఏరా ఏమన్నా పనిమీద వచ్చినావా" అని అయిదు రూపాయలు లెక్కా కొన్ని పాత గుడ్డలూ యిచ్చిపంపినాను. గంగనికి పూరట కలిగిందేమో - ఉత్సాహంగా లేచిపోయినాడు.

నెల తిరక్క ముందే - గంగడు ముందున్న వూరినుండి ఒకడొచ్చినాడు. "మీ యింటిని కనుక్కోవడానికి తిరిగి తిరిగి చచ్చిపోయినా" అని అన్నాడు.

"ఏం విషయం" అని అన్నాను,

'వాడుండాడే గంగడు, మూగి పిల్లల నాయన, నీవూ చూచినావు మా పూర్లోవున్నప్పుడు వాడేమైనా నీ వద్దకు వచ్చినాడా" అని అన్నాడు

'ఏమీ ఏమన్నా విశేషమా' అని అన్నాను.

" విశేషమేముందీ - వూర్లో గోవిందరెడ్డి అన్నకు రు. 500/- బాకీ అంట. రాత్రికి రాత్రే చెప్పకుండా చెయ్యకుండా వచ్చేసినాడు యిక్కడ చేరి నీ పాదం పట్టితే సరిపోతుందని అనుకొన్నాడు. దొంగనాయాలు" అని అన్నాడు.

"అంతేనా యింకేమైనావుందా" అని అన్నాడు.

"అది చాలదూ. బాకీకత చెప్పకుండా తప్పించుకొని తిరిగితే మంచిదాన్నా - నీవే చెప్పు. ఆయన బాకీ ఎట్లారావాల" అని అన్నాడు.

"పని పాటలు చేసి వచ్చిన కూళ్ళల్లో మిగిలించుకొని బాకీ తీరుస్తాడు-యిప్పుడేమైందీ" అని అన్నాను.

"ఎట్లా తీరుస్తాడు - ఎదురుగా వుండి-అంటే-ఆ వూర్లోనే వుండి వచ్చింది వచ్చినట్లూ యిస్తావుంటే తీర్తాది. పారిపోయి వచ్చి యిక్కడ కూడబెట్టి తీరుస్తాడంటే - ఎవరన్నా నమ్ముతారా-అయినా యిట్లా విషయాలు నీ కంతగా తెలియవులే. తెల్లనివన్నీ పాలూ - నల్లనివన్నీ నీళ్లూ అని అను కొంటారు. మీకిట్లాటి విషయాల్లో లోతు తెలియదు" అని అన్నాడు చిరుకోపంగా.

"గోవిందరెడ్డి ఎందుకిచ్చినాడు. అంతమొత్తాన్ని వాడెట్లా తీర్చుకొంటాడు. ఐదు వందల జీతగాడైనా అయిదు వందల అప్పుతీర్చు కోవాలంటే - టౌనులో కష్ట పడుతున్నాడే" అని అన్నాను.

"అయిదారేళ్ళ కింద వంద రూపాయలు యిచ్చినాడంటా. యిప్పటికి వడ్డీతో యింకా ఎక్కువే అయివుంటుం దని అన్నాడు గోవిందరెడ్డి-

"తీర్చలేనోనికి వడ్డీ కట్టుకుంటా పోతే ఎట్లప్పా" అని వెటకారంగా అన్నాను.

"అది మామూలే కదా. అవస రానికిందిచ్చి నప్పుడు-యిస్తానని ఒప్పు కొన్నాడుకదా. యిచ్చినోనిదేమి తప్పు అని అన్నాడు.

"శక్తిలేనోడు-ఎక్కడా తెచ్చు కోలేని వాడు - మీ యిష్టమబ్బా అని చెప్పివుంటాడు." అది ఒప్పుకోడం ఎట్లవుతుంది యింతకూ యిప్పుడు నన్నేం చెయ్య మంటావు" అని అన్నాను.

"ఏముందీ వాన్ని పంపించు. పూరుచేరుకొని ఎట్లో అప్పు తీర్చు కుంటాడు" అన అన్నాడు.

"నీ పిచ్చిగానీ - వాడెట్లా తీర్చు కొంటాడు. అది కానిపని. వాడు చావ కుండా కొన్నాళ్ల బతికితే గొప్పసంగతి. వాని పెండ్లాము మాత్రం తొందరగా చచ్చేట్లువుంది. యింకా నేదర పిల్లోల్లూ వాళ్ళె పెద్దోల్లయి పనికెదిగితేనే - ఆ కుటుంబం - యింతతిండి, కడుపునిండా తింటారు" అని అన్నాను.

"అయితే గోవిందరెడ్డికి రావల సిన బాకీ పోయినట్లేనా" అని అన్నాడు.

"పోక వస్తుందను కొన్నావా - కాకపోతే వానితో వాని పిల్లలతో ఉప రాగా పనులు చేయించుకోవచ్చు. త్వరగా చచ్చిపోయేట్లు చేస్తారు. డబ్బు మాత్రం రాదు" అని కచ్చితంగా అన్నాను.

"ఏదో ఒకటి చూడన్నా. నీకు నిందవస్తుంది. యితర్లకు బాకీలు ఎగ్గొ ట్టించి తన పనిలో పెట్టుకొన్నా"డని అంటారు - అని సూటిగా అన్నాడు.

'నాకు స్వంత సేద్యం లేదే - నన్నేందుకట్ల అను కొంటారు" అని అన్నాను.

"ఎందుకనుకోరు. ఎంత లేంది తన తోటకాడ పెట్టుకొంటాడా-అందరం రైతులమే – చూచుకొని పోవాల. సన్నోళ్ళకు చనువిచ్చి నెత్తికెక్కించు కొంటే ఎట్లన్నా. గోవిందరెడ్డి అన్న మొత్తుకొంటున్నాడు ' 'నానెక్క ఎట్లా అని ఏదో ఒక పరిష్కారంచెయ్యన్నా. లేకుంటే పెద్ద రాగం పాడాల" అని కటువుగా మాట్లాడినాడు.

"ఏం పరిష్కారముంది. వాడు తీర్చలేడు. కాదంటే వాన్ని కొట్టొచ్చు-తిట్టచ్చు. కుటుంబాని కందరికి బువ్వ పెట్టితే – తిట్టినా-కొట్టినా పడి వుంటాడు. ఊరక పని చేయలేడు. బాకీలు తీర్చ లేడు. అందులో తక్కువ కూళ్ళల్లో, యిది నా అభిప్రాయం. మీరే ఏదో పరిష్కారం ఆలోచించండి" అని అన్నాను.

"నీ పనిలోకి వస్తున్నాడు కదా నీవేసర్దు. బాకీ తీర్చినట్లూ వుంటుంది నీ పని జరుగుతుంది". అని అన్నాడు.

"ముందే చెప్పినాను. నాకు స్వంత సేద్యం లేదని. పాపం వాడు పనులు చేసుకొని బతికేందుకు మాత్రం ఏర్పాటు చేసినాను. అంతే వాని బాకీ నేనెందుకిచ్చుకోవాల. అందులో వడ్డీలకు వడ్డీల బాబతు లెక్కలు" అని నేనూ కటువుగానే మాట్లాడినాను. అతడు కొంత తగ్గి ''ఏమోనబ్బ మీ యిష్టం గోవిందరెడ్డన్ననే పంపుతా ఆయనే మాట్లాడు కొంటాడు" అని లేచి పోయినాడు.

"ఏందిదంతా. వాన్ని పంపిం చేయరాదా" అని మా ఆడవాళ్ళు, మందలించినట్లుగా అన్నారు.

"వారెక్కడికి పోతారు. ఆ వూర్లో జరక్క యీ వూరికి వచ్చినారు. యీ వూర్లో జరక్కపోతే యింకో వూరికి పోతారు. కడకు అడుక్కుతిం టారు అదీ వారి బ్రతుకు నేనెట్లాపం పేది. మళ్ళీ ఆటోనులోకి. అయిదారేళ్ళ నుండి వడ్డీకి వడ్డీ కట్టి-సందుకు అయిదు వందలకు ఎగారాసినారు. అంత మొత్తాన్ని వాడెక్కనుండి తెచ్చి కట్టుతాడు. అం దుకే దొంగతనంగా వున్న వూరు విడిచి-టికెట్టులేకుండా యీ వూరొచ్చినాడు. నా వల్లకాదు. గోవింద రెడ్డి ఏమైనా చేయాలనుకుంటే బుద్ధి చెప్పుతాను" అని అన్నాను కఠినంగా.

గోవిందరెడ్డి రానే వచ్చినాడు. వారం తిరక్క తలికే, "వాళ్ళింట్లో పేడా కసువు తీసేవాళ్ళు లేరనీ–పనిపాటలు కుంటుపడుతున్నా యని – చెప్పి-అన్నీ తెలిసి అడవిలో పడుతున్నాదే – వాన్ని పంపిచు. నీవు గట్టిగా పట్టినావు. నీ మాటే వింటాను. వాన్ని ఎట్లయినా పిలుచుకొని పోవాలని వచ్చినాను" అని అన్నాడు.

"వాన్నే అడుగు. నాబాకీ కట్ట వద్దులేరా అని అంటే పరవారతా వస్తాడు. మన పనికి భరమయ్యేవాన్ని వత్తితే యింతే జరుగుతుంది." అని అన్నాను.

“ఉరుపు యీకుండానా-ఎందన్నా అర్థమన్నా యీకుంటే ఎట్లా నీవే చెప్పు. అందుకే నీవు చెప్పి ఒప్పించి పంపుతావని వచ్చినాను. మనమంతా అయిన పోయినోళ్ళం యిట్లా గట్టిగా పట్టుకుంటే ఎట్లా. సనోళ్ళను యిరికించుకొకపోతే పనులెట్లా జరుగుతాయి. అందులో దేశదిమ్మర్లతో ఎట్లా పనులు చేయించుకోవాల్నో నీకు తెలియదా” అని నవ్వుతూ అన్నాడు.

“పనికి మాలిన ఆలోచనలతో నన్నెందుకు చంపుతావు. నీ నూరు రూపాయాలూ ఏనాడో తీరిపోయి వుంటుంది. నీకు పని జరగాలంటే-వాన్ని ఆదరంగా చూసుకో-అట్లయితేనే పంపుతా-అని అన్నాను. “నీ యిష్టం-అట్టనేకానీ” అన్నాడు

“ఏమైనా వారం రోజుల్లో వచ్చేట్లు చెయ్యన్నా-నీ దగ్గర చేరినాడు కాబట్టి సరిపోయింది. లేకుంటే వాన్ని ఏమి చేసిందునో” అన్నాడు.

“ఏమి చెయ్యొద్దు. యీవలసినంతా కూలిచ్చి ఆదరంగా చూసుకో. అంతే లేకుంటే-అవస్థలు పడతావు. వాళ్ళకూ సంఘాలున్నాయి వాళ్ళకూ దిక్కున్నారు. వాళ్ళిప్పుడేమీ ఊరుకోరు. ఊరక లేరు” అని అన్నారు.

ఎట్లనోలే అన్నా-కాలం తప్పి కందులు గుగ్గిళ్ళవుతున్నాయి. ప్రతి జుట్టు మాసినోడు సంఘాల్లో చేరడమే సంఘాలకు మీ యట్లా పని లేనోళ్ళు సాయంగా వుండనే వుంటారు. మాకు తెలియదా అని గోవిందరెడ్డి లేచి పోయినాడు.

గంగడు వారం రోజులకు తోట వద్ద నుండి వచ్చినాడు. “ఏరా గంగా గోవిందరెడ్డి వచ్చి-నీవు రాయించిన బాండు యిచ్చి-20/ రూపాయలు చార్జీలకూ యిచ్చి పోయినాడురా. బాకీ లేదంటలే పోతావా-ఎప్పుడు పోతావు” అని అన్నాను

“పోలేనబ్బా రామిరెడ్డి మంచోడు-నాకొక పాత కొట్టం కొనిచ్చినాడు నూటాయాభైకే యిప్పించినాడు. నిన్ననే రిజిష్టరు చేయించినానబ్బా, కొట్టం కొంప దొరికింది. తోట దొడ్డీ వున్న వూరు. పనులుంటాయి. ఆడపిల్లోళ్ళకు పెళ్ళిల్లన్నా చేసి చచ్చిపోతానబ్బా అందాకా పాత కొట్టంలో తల దాచుకొంటాను” అని అన్నాడు.

“నువ్వు మళ్ళా కూరుకున్నావు గదరా పనికి మాలినోళ్ళు ఏమైనా చేస్తారు. ఎదుర్కొనే శక్తివుండాల. ఇక్కడి వాళ్ళతో తకరారు వస్తే ఎట్లరా గోవిందరెడ్డి కానలసినోడు కాబట్టి విన్నాడు అని అన్నాను.

“అట్లానాబ్బా ! రామిరెడ్డిమంచోడనుకొంటినే” అని గొణుక్కుంటూ కాలబడిపోయినాడు గంగడు.

కళాశాలల్లో ఐచ్ఛికాంశంగా తెలుగు

ఆచార్య జి. యస్. రెడ్డి

ఆధునికమైన మన విద్యా విధానం-చిన్న తరగతుల **నుండి** స్నాతకోత్తర స్థాయి వరకు-పాశ్చాత్య పద్ధతులకు అనుకరణ. ఈ వాస్తవాన్ని ఎవరూ కాదనలేరు. బ్రిటిషు పరిపాలన, విశ్వవిద్యాలయాల స్థాపన, ఆంగ్లభాషాధ్యయనం, ఆధునిక విజ్ఞాన శాస్త్రపరిచయం ఇవన్నీ మనదేశంలో (ఇటీవలే, అంటే) గతశతాబ్దంలో, జరిగిన చారిత్రక సంఘటనలు. అప్పటినుండి భారతీయుల వేషభాషల్లో, ఆలోచనారీతుల్లో, దృక్పథంలో ఎంతో మార్పు సంభవించింది. ఈ నాడు మనం ఏ అంశాన్ని గురించి ఆలోచించినా, చర్చించినా, పరిశీలించినా పాశ్చాత్య పద్ధతికి మనకూ ఎక్కువ భేదము వుండదు. ఉన్నా భేదమంతా ఆచరణలోనే, పాశ్చాత్యుల పద్ధతి అన్నిరంగాలలోనూ ప్రధానంగా కార్యపరమైంది(Practical or action oreinted) మనపద్ధతి తద్భిన్నమైంది. కాబట్టి మనం స్వాతంత్ర్యానంతరం మన విద్యారంగాన్ని నిర్దుష్టంగా, లక్ష్యోన్ముఖంగా రూపొందించుకోలేని స్థితిలో పడి వున్నాం.

మన విద్యావిధానం పాశ్చాత్య దేశాలకు అనుకరణ కదా. అనుకరణ ప్రియులకు ఎప్పుడూ నిలకడ అయిన అభిరుచి వుండదు. కాబట్టి అనుకరణ ప్రధానమైన మన విద్యావిధానంలోను, విద్యాప్రణాళికల్లోనూ అనిశ్చితస్థితి ఏర్పడింది. దేశీయాభిమానాన్ని ప్రకటించాలనుకొనే విద్యామంత్రుల మస్తిష్కాల్లో పాశ్చాత్య దేశాలకు తీసిపోని ప్రగతిని సాధించాలనే U. G. C. విద్యావేత్తల మేధస్సుల్లో ఎప్పుడెప్పుడూ తళుక్కున మెరుపు తీగల్లాగ పుట్టే కొత్త, కొత్త భావాలు, ఆలోచనలు, వాటిని కార్యరూపంలో పెట్టడానికి చేసే ప్రయత్నాలు-అవన్నీ మన విద్యారంగంలో, రాష్ట్రస్థాయిలోనూ, జాతీయ స్థాయిలోనూ నిలకడలేని స్థితికి ముఖ్యకారణాలవుతున్నాయి. ఏ దేశపు విద్యావిధానంలోనైనా మార్పు, నిలకడ (Change and Stability) రెండూ ప్రధానమే. మార్పులేని నిలకడ నిర్జీవమవుతుంది. నిలకడలేని మార్పు నిష్ప్రయోజనమవుతుంది. మూడు దశాబ్దాలుగా మనదేశపు విద్యారంగంలో జరిగింది - ఇంకా జరుగుతున్నది నిలకడలేని మార్పే. దీని ఫలితమే మనవిద్యారంగంలో అన్నివైపులా, అన్నిచోట్లా, దేశమంతా ఈ నాడు కనిపిస్తున్న అస్తవ్యస్త పరిస్థితి, గందర

గోళం (రామున్న రోజుల్లోని స్థితికూడా దురూహ్యం, అయోమయం వాస్తవమైన ఈ పరిస్థితిని ప్రస్తావించడంలో నా ఉద్దేశ్యం నేటి పరిస్థితిని గుర్తింపజేయ డమేగాని విమర్శించడంకాదు. నిందించ డం అంతకన్నా కాదు.

ఇంతకూ మనం ఇప్పుడు చర్చించ వలసినది 'కళాశాలల్లో ఐచ్ఛికాం శంగా తెలుగు' (Optional Telugu) అన్న అంశాన్ని గురించి. కాబట్టి ఆ విషయాన్ని సంగ్రహంగా ప్రస్తావిస్తాను.

మన విద్యావిధానం పాశ్చాత్య పద్ధతికి అనుకరణ అని మొట్టమొదటే మనవి చేశాను. కాబట్టి పాశ్చాత్య విశ్వవిద్యాలయాల్లో, కళాశాలల్లో భాషా బోధనకు గల ప్రాధాన్యాన్ని గురించి కొంత తెలుసుకోవడం మంచిది.

పాశ్చాత్య దేశాల్లో భాషాబోధన మెట్రిక్‌లేషన్ వరకు మాత్రమే నిర్బం ధం (Compulsory). ఆ తర్వాత ఐచ్ఛికం. మెట్రిక్‌లేషన్ వరకు విధిగా భాషను నేర్చిన విద్యార్థికి-అంటే పది పదకొండు సంవత్సరాల భాషాధ్యయ నం వల్ల ఆ భాషలో చక్కని వ్యవహా రదక్షత, అవగాహనాపాటవం, రచనా కౌశలం సిద్ధిస్తుంది. అంటే పాశ్చాత్య దేశాల్లో నిర్బంధ రూపమైన భాషాబోధన ఉన్నత పాఠశాలల వరకే. కళాశాల స్థాయిలో విద్యార్థులకు భాషా సాహిత్యా ధ్యయనం ఐచ్ఛికమేగాని నిర్బంధం కాదు. ఐచ్ఛికం కాబట్టి భాషాసాహిత్యా లలో అభిరుచి వున్న విద్యార్థులు మాత్రమే భాషాధ్యయనం చేస్తారు. అంటే నిర్లక్ష్యమైన భాషా బోధన పాశ్చాత్య కళాశాలల్లో వుండదన్న మాట.

మన దేశంలో గత శతాబ్దంలో, ఈ శతాబ్దపు ప్రారంభంలోనూ కళా శాలల్లో చిన్నయసూరి, కందుకూరి, అక్కిరాజు ఉమాకాంతం మున్నగువారు తెలుగును బోధించిన రోజుల్లో, బి.ఏ. తరగతి విద్యార్థులకు విధిగా కొద్దిపాటి తెలుగు వుండేది. వచనగ్రంథ పఠనం, భాషాంతరీకరణం(Prose and Translation) మాత్రమే. తర్వాత తర్వాత కావ్యనాటకాది పఠనను చేర్చినారు. అయినా భాషాబోధనలో ఆంగ్లానికే ప్రథమస్థానం. దేశభాషలకు ద్వితీయ స్థానం. ద్వితీయస్థానమైనా అది నిర్బం ధమే. దీనివల్ల విద్యార్థులు సాధించిన భాషాపాటవం మాత్రం అంతంతే కలిగిన లాభం మాత్రం మరికొంతమంది పండి తులకు కళాశాలల్లో ఉద్యోగప్రాప్తి. ఒక వైపు విధిగా చదువుతూ, మరొక వైపు ఐచ్ఛికంగా కూడా చదవడానికి విశ్వ విద్యాలయం అవకాశమిచ్చింది. అయితే ఆ ఐచ్ఛికమైన తెలుగుకు పెద్ద పీట వేయలేదు. చరిత్ర, రాజనీతి ఇత్యాది విద్యా విషయాలతో సహపంక్తి భోజ నమే. ఆసంప్రదాయమే తర్వాతతర్వాత కొన్ని మార్పులు కూర్పులు పొంది (Branch XII) తెలుగు అని మద్రాసు విశ్వవిద్యాలయంలోనూ, (Part II) తెలుగు అని మన రాష్ట్ర విశ్వ

విద్యాలయాల్లోనూ ఈ నాడు నిలిచింది. ఇదే కళాశాలలో ఐచ్ఛికాంశంగా తెలుగు అన్న విషయం. మాకు ఈ నాడు చర్చనీయాంశం.

మనపిల్లలకు తెలుగు భాషా బోధన జరగవలసిన పద్ధతిలో ఏనాడూ జరగలేదని, ఇపుడూ జరగడం లేదని నా అభిప్రాయం. భవిష్యత్తులో జరుగుతుందనే ఆశగూడ నాకు అంతగాలేదు. నిర్బంధమైన తెలుగు, భాషాబోధన ఉన్నత పాఠశాలల వరకే పరిమితం చేయడం మంచిదని నా విశ్వాసం. ఈ మాటంటే కళాశాలల్లోని మన తెలుగు అధ్యాపకులు నన్ను నిందిస్తారు దూషిస్తారు. కారణం వృత్తి రక్షణ. తెలుగు M A. ల నిరుద్యోగ సమస్యను నివారించడానికి B. A. తరగతుల్లో వారానికి పది గంటలు తెలుగును బోధించినా పాశ్చాత్యదేశాల్లో మెట్రిక్‌లేషన్ విద్యార్థులకు తమ భాషలో కలిగిన శక్తి సామర్థ్యాలు మన బి. ఎ. విద్యార్థులకు రావనే చెప్పవచ్చును. లోపం విద్యార్థులది కాదు. ఉపాధ్యాయులదీ కాదు. మనం పాటించే భాషాబోధన పద్ధతిది. అలాగే పాశ్చాత్య దేశాల్లో కళాశాలల్లో ఐచ్ఛికంగా భాషాసాహిత్య అధ్యయనం చేసి ఆ విద్యార్థులు సాధించిన నేర్పుకు, Part II తెలుగు చదివిన మన విద్యార్థుల నేర్పుకు చాలా తేడావుంది. అంటే అది మన విద్యార్థుల దోషంకాదు. Part II తెలుగు పఠన ప్రవచనాల పరంగా మనం రూపొందించే ప్రణాళికలోని లోపమే కారణం. బి. ఎ. తరగతుల్లో తెలుగును ఐచ్ఛికాంశంగా ఎందుకు ప్రవేశపెట్ట వలసి వచ్చింది అన్నది ఒక ప్రశ్న. ముఖ్యమైన ప్రశ్న ఈ ప్రశ్నకు ప్రధానంగా నాకుతోచే సమాధానాలు నాలుగు.

1. దేశభాష అయిన తెలుగు అధ్యయానికి చరిత్ర, అర్థికశాస్త్రం, రాజనీతి, ఇత్యాది విషయాలతో పాటు సమాన గౌరవం, ప్రాధాన్యం కల్గించడం అంటే తెలుగు భాషా సాహిత్యవిషయాలలో కూడవిద్యార్థులు విశేష కృషిని చేయడానికి అవకాశ మున్నదనీ, ఆ అవకాశాన్ని ఐచ్ఛికంగా విద్యార్థులకు కలగించాలని. ఇది విద్యాప్రణాళికలో ఒక ఆదర్శానికి సంబంధించిన సమాధానం.

2. బి.ఏ.లో ఐచ్ఛికంగా తెలుగు భాషా సాహిత్యాలను అభ్యసించి ప్రావీణ్యాన్ని గడించిన వ్యక్తి ఉన్నత పాఠశాలల్లో తెలుగు ఉపాధ్యాయుడుగా పనికి రాగలడని. ఇది విద్యావేత్తల, విశ్వవిద్యాలయాచార్యుల అభిప్రాయానుగుణమైన సమాధానం.

3. బి.ఏ.లో ఐచ్ఛికంగా తెలుగు చదివిన విద్యార్థి స్నాతకోత్తర తరగతుల్లో ప్రవేశించి విశేషించి అధికంగా భాషాసాహిత్యాధ్యయనం చేయడానికి అర్హుడు అనుకోవడం. ఇది విద్యావేత్తల. విశ్వవిద్యాలయాచార్యుల అభిప్రాయానుగుణమైన సమాధానం.

4. ఇక నాల్గవది చాలాముఖ్యమైనది. అది ఏమిటంటే తమ కళాశాలల్లో బి.ఏ. విద్యార్థులకు ఐచ్ఛికంగా తెలుగును చదివే అవకాశం కలిగిస్తే ప్రభుత్వం నుండి మరికొంత గ్రాంటు, మరి కొందరికి ఉద్యోగాలు వచ్చే అవకాశాలు లభిస్తాయి అనే కళాశాల నిర్వాహకుల ఉభయతారక దృష్టి.

పై నాలుగు కారణాలను మీరు పూర్తిగా అంగీకరించక పోవచ్చు గాని నేను విశ్లేషించి చెప్పిన విషయంలో కొంత సత్యం లేక పోలేదన్న విషయం మాత్రం మీరందరూ అంగీకరిస్తారు. నేను చెప్పిన పైనాలుగు కారణాల్లో విద్యార్థి అభిరుచికి ప్రమేయం, ప్రాధాన్యం లేదన్న సంగతి మనం గుర్తించాలి. ఉన్న విషయం కూడ అంతే. ఈ మాట తెలుగు ఎం. ఏ. చదవటానికి వచ్చే విద్యార్థులకు కూడ కొంత అన్వయిస్తుందని మనం పైకి చెప్పకపోయినా మనకు తెలుసు.

ఇంతకూ మనం గుర్తించవలసిన ముఖ్య విషయం ఏమిటంటే- కళాశాలల్లో ఐచ్ఛికంగా తెలుగు చదివే విద్యార్థులలో విధిలేక మరో అవకాశం లేక ఐచ్ఛికంగా తెలుగును చదవడమే గాని అభిమానాన్ని బట్టికాదు. అభిరుచినిబట్టి అంతకన్నా కాదు. ఏ కారణాలవల్ల నైతేనేమి మన ఉన్నత విద్యా ప్రణాళికలో కళాశాలల్లో ఐచ్ఛికంగా తెలుగు అభ్యసించే అవకాశం కల్పించబడింది. వందలకొద్దీ విద్యార్థులు చదువుతున్నారు కూడా,

ప్రస్తుతం మనరాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలకు సంబంధించిన కొన్ని కళాశాలల్లోను, మద్రాసు విశ్వవిద్యాలయానికి సంబంధించిన 'క్వీన్ మేరిస్' కళాశాలలోను బి.ఏ. స్థాయిలో ఐచ్ఛికంగా తెలుగు భాషాధ్యయనం చేసే అవకాశముంది. పాఠ్య ప్రణాళికలో మాత్రం ఆయా విశ్వవిద్యాలయాల మధ్య కొంత తేడా వుండొచ్చు. అయినా అన్ని విశ్వవిద్యాలయ కళాశాలల్లోను Part II కింద ఐచ్ఛికాంశంగా తెలుగును చదివే విద్యార్థులు ఇతర విద్యార్థులతో పాటు Part I లో తెలుగును కూడా విధిగా చదవాలి. ఆలోచిస్తే ఇది కొంత విడ్డూరంగానే కన్పిస్తుంది. ఒక్కొక్కప్పుడు Part II తెలుగులో Pass అయిన విద్యార్థి Part I తెలుగులో తప్పే విడ్డూర పరిస్థితి యేర్పడుతూ వుంటుంది. అంటే Part II కింద విశేషాధ్యయనం చేసి తెలుగునో గడించిన ప్రావీణ్యం ఆ విద్యార్థికి సామాన్యమైన Part I తెలుగు pass కావడానికి ఉపకరించడం లేదన్న మాట తెలుగును ఐచ్ఛికంగా కళాశాలల్లో స్వీకరించే విద్యార్థులకు ఈ నాడున్న Part I తెలుగు పాఠ్య ప్రణాళికను మార్చవలసిన అవసరం వున్నాదా లేదా అన్నది మనం చర్చించ వలసిన అంశాల్లో ఒకటి.

తెలుగు ఉపాధ్యాయుడికి సంస్కృతభాషా పరిచయం తప్పక వుండాలన్నది అందరూ అంగీకరించే విషయం. మరి తెలుగును ఐచ్ఛికాంశంగా చదివే

విద్యార్థులు ఉన్నత పాఠశాలల్లో తెలుగు ఉపాధ్యాయ పదవికి అర్హులు. అందువల్ల ఐచ్ఛికాంశమైన తెలుగు పాఠ్య ప్రణాళికలో సంస్కృత భాషాధ్యయనానికి ఏ స్థానముండాలి? మద్రాసు విశ్వవిద్యాలయంలో Part II తెలుగు విద్యార్థులకు ఇప్పటి వరకు సంస్కృతం లేదు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం వారి పాఠ్య ప్రణాళికలో ఒక పేపరు (భండార్కర్ మొదటి పుస్తకం, ప్రసిద్ధ సంస్కృత కావ్యాల్లో నుంచి గ్రహించిన కొంత సంస్కృత పద్య భాగం) విధిగా వుంది. ఉస్మానియా, ఆంధ్ర విశ్వవిద్యాలయాల బి.ఏ. పాఠ్య ప్రణాళికలో సంస్కృతానికి ఎంత ప్రాధాన్యముందో నాకు తెలియదు. అయినా తెలుగును ఐచ్ఛికాంశంగా స్వీకరించే విద్యార్థులకు సంస్కృత భాషాబోధనను గూర్చిన విషయం కూడా ఈ సదస్సులో చర్చ నీయార్హం.

తెలుగు ఐచ్ఛికాంశంగా చదివే విద్యార్థులకు వ్యాకరణాధ్యయనం అన్ని విశ్వవిద్యాలయాల్లోను విధిగానే వున్నది. వ్యాకరణమనే సరికి మనం పాఠ్య గ్రంథాలుగా నిర్ణయించే బాల ప్రౌఢలే. బి ఏ. వాళ్ళకి బాల ప్రౌఢల అధ్యయనం ఏ లక్ష్య సాధనకు నిర్ణయిస్తున్నారో నాకు తెలియడం లేదు. ప్రాచీన కావ్యావగాహనకు బాల ప్రౌఢల అధ్యయనం తోడ్పడుతుందనే అభిప్రాయం సరిగాదు. ఆధునికమైన రచనకు లేదా సృజనాత్మకమైన రచనకు బాల ప్రౌఢలు ఉపయోగకారులు కావు. అందువల్ల ఐచ్ఛికాంశంగా తెలుగును అభ్యసించే కళాశాల విద్యార్థులకు బాలప్రౌఢల పఠన ప్రవచనాలు అవసరమా అనే ప్రశ్న గూడ ఉన్నది.

ఐచ్ఛికాంశంగా తెలుగు చదివిన విద్యార్థులకు ప్రస్తుతమున్న పాఠ్య ప్రణాళికల్లో రచనా కౌశలాన్ని, భాషా పాండిత్యాన్ని కలిగించే పద్ధతి మృగ్యం. అందువల్ల Part I తెలుగు చదువుకొన్న విద్యార్థులకు అట్టే భేదం కనిపించడంలేదు. పైగా M.A. తరగతుల్లో Part II చదివి వచ్చిన విద్యార్థులు ఎక్కువగా రాణిస్తున్నారు అని చెప్పడం గూడ సాహసమే.

చరిత్ర, ఆర్థికశాస్త్రం, ఇంగ్లీషు సాహిత్యం ఇత్యాది విద్యావిషయాలను ఐచ్ఛికంగా తీసుకొని చదివిన B. A. విద్యార్థులు వివిధ రంగాలకు సంబంధించిన ప్రభుత్వోద్యోగాల్లో పోటీపరీక్ష ద్వారా ప్రవేశించి రాణించ గలుగుతున్నారు. కేవలం తెలుగు భాషాసాహిత్యాలే Part II కింద చదివిన విద్యార్థులు ఉపాధ్యాయేతర వృత్తుల్లో ప్రవేశించలేక పోతున్నారు. దీనికి కారణం ఐచ్ఛికాంశమైన పాఠ్య ప్రణాళికలలోని లోపం గావచ్చు.

కొన్ని విశ్వవిద్యాలయాల్లో తెలుగును ఐచ్ఛికాంశంగా చదివిన విద్యార్థుల పాఠ్య ప్రణాళికలను పరిశీలించినపుడు ఆంధ్రదేశ చరిత్రకు లేదా ఆంధ్రుల సాంఘిక చరిత్రకు సముచిత ప్రాధాన్యం లేదన్నది గూడా తెలుస్తుంది. అలాగే

బహుముఖంగా అభివృద్ధి పొందుతన్న ఆధునిక తెలుగు సాహిత్యంతో తగిన పరిచయాన్ని బి. ఏ. పార్టు-2 విద్యార్థులకు కలిగించ లేకపోవడం కూడా జరుగుతున్నది.

పైన చెప్పిన ఐదారు అంశాలతో పాటు చర్చించవలసిన మరికొన్ని విషయాలు కూడా వున్నాయి. ఇవిముఖ్యంగా పాఠ్య గ్రంథాలకు టెక్స్టుబుక్స్ సంబంధించినవి గురుముఖం గానే కాకుండా స్వయంకృషి వల్ల తెలుగు విద్యార్థి తెలుగు భాషా సాహిత్యాలలో సముచిత పాండిత్యాన్ని గడించడానికి అనువైన పుస్తకాలు లేవు. ఉదాహరణకి అలంకారాలను గురించి సులభమైన పద్ధతిలో చక్కని ఉదాహరణలతో వివరించే గ్రంథం ఇంతవరకు రాలేదు. చంద్రాలోకాన్నే అన్ని స్థాయిల్లోను పాఠ్య గ్రంథంగా నిర్ణయిస్తున్నారు అలాగే సూత్ర ప్రధానమైన బాల ప్రౌఢ వ్యాకరణాలు వ్యాకరణ పరమైన శాస్త్రావగాహనకు ఉపయోగించినట్లుగా భాషా పాండిత్యాభివృద్ధికి ఉపయోగపడడంలేదు ప్రాచీన కావ్యభాషను చారిత్రక దృష్టితో ప్రదర్శించే గ్రంథం మనకులేకపోవడం గూడా ఒక లోపమే. కళాశాల విద్యార్థులకు అన్నివిధాల ఉపయోగపడే విద్యార్థి నిఘంటువు కూడా మనకు లేదు అసలు మన కాలేజి విద్యార్థులకు నిఘంటు పరిచయం వాటి వుపయోగం నాస్తి.

విద్యార్థులు తెలుగులో చక్కని రచనా శైలిని అలవరచుకోడానికి అనువైన మార్గదర్శి గ్రంథం ఒక్కటి గూడ లేదు. ఇంగ్లీషులో ఇట్టి రచనలు కొల్లలు కాబట్టే పాశ్చాత్య దేశాల్లో కళాశాల స్థాయిలో విద్యార్థులు ఇంగ్లీషు నిర్బంధంగా చదవక పోయినా ఇంగ్లీషు రచనా పాటవాన్ని స్వయంకృషితో అభివృద్ధి చేసుకొనే అవకాశాలున్నాయి. ఇవి కొట్టవచ్చినట్టు కనిపించే కొన్ని కొరతలు మాత్రమే. ఈ కొరతలు పూరించినపుడు, పైన పేర్కొన్న ప్రశ్నలకి సముచితమైన సమాధానాలు రూపొందించు కొన్నప్పుడు ఐచ్ఛికాంశంగా తెలుగు చదివే విద్యార్థుల పరీక్షా విధానం గూడా మారాలి.

ఇటీవల యు. జి. సి. విద్యావేత్తలు బి. ఏ. పాఠ్య ప్రణాళికను పూర్తిగా మార్చివేయాలని మన విశ్వవిద్యాలయాలకు ఆదేశాలు పంపుతున్నారు. వారి ఆదేశాల్లో ముఖ్యంగా ఫౌండేషన్ కోర్సెస్ అని సపోర్టింగ్ కొర్సెస్ అని, ప్రాజెక్టు రిపోర్టు అని కొన్ని 'రకాలుగా' బి. ఏ పాఠ్య ప్రణాళిక రూపొందించారు. కొత్త ప్రణాళిక ప్రకారం కూడా ఐచ్ఛికాంశమైన తెలుగును మనం సమూలంగా మార్పు చేయవలసిన అవసరముంది. అయితే ఈ మార్పును ప్రవేశపెట్టడం పూర్తికాగానే మరొక రకమైన మార్పును యు. జి. సి వాళ్ళు ప్రవేశ పెట్టరనే నమ్మకమేముంది ? అపుడు మనం చేయగలిగింది ఏముంది ?

సమ సమాజ రాగం

-శ్రీ చొప్పకట్ల చంద్రమౌళి

సమ సమాజ రాగానికి
సరిగమపద పాడదాం
పూరింటిని రూపు మాపి
పూల మేడ కడదాం ॥ సమ ॥

దారిద్ర్యం ఘోర కలికి
కోరలూడ పెరుకుదాం
అవినీతిని ఆశయాల
ఆయుధమున నరకుదాం ॥ సమ ॥

వెల్లువలా పొంగి పారు
నల్లధనం అరికడదాం
తల్లడిల్లు హృదయాల లో
మల్లియలను నిలబెడదాం ॥ సమ ॥

సోమరులై బ్రతుకువారి
కామనలను వంచుదాం
ధనంవలన ధనం పెంచు
జనం తలపు తెంచుదాం ॥ సమ ॥

"మానవుడు సౌందర్యాన్ని అనుభవించాలి గాని జయించటం దేనికి? జయించిన వాడు జయగర్వాన్ని అనుభవించ గలడు గాని జయించిన వస్తువును అనుభవించ గలడా? జయించిన వస్తువు శరీరాన్ని అనుభవించ గలడేమోగాని, దాని ఆత్మ సౌందర్యాన్ని అనుభవించ గలడా? జయించటం వల్ల దాని ఆత్మ సౌదర్యం చిదిమివెయ్యబడుతుంది. అప్పుడు మానవుడు అనుభవించ గలిగేది జీవంలేని కొయ్య బొమ్మనే!!"

(గోపీచంద్ 'మెరుపుల మరకలు'లో)

మినీకథ

సీసాలో నోటు

-చామర్తి దుర్గాప్రసాద్

గాజుసీసాల్లో కాగితాలు (మెస్సేజెస్) పెట్టి వదలడం, ధనికుల సరదాల్లో ఒకటిట. అవి దొరికి అమాంతం అదృష్టవంతులయారట కొందరు.

రాజులకి నిద్రపట్టలేదు అది చదివి. అతని జీవితం అంతా అలాంటి అదృష్టం వేటలోనే జరిగిపోయింది. గుర్రప్పందేలు, బ్రాకెటు ఆట ఇలా ఎన్నో. అన్నీ అయి అతను బికారిగా అయ్యాడు. అయినా అదృష్టం వేటమీద మజాపోలేదు. వేటకి పెట్టవలసిన కనీస ధనం లేకే ఆగిపోయ్యాడు.

ఇప్పుడు దొరికింది సముద్రం పక్కకిపోయి అదృష్టంవెదుక్కోవడమే. సహారా ఎడారిలో ఉంగరం ఎవరోపారేశారని తెలిసి వెదకడం లాంటిదే అయినా రాజులకి మాత్రం అలా అనిపించదు. అదేదో పెట్టె తెరిచి తీసుకోవడమే అని పిస్తోంది అతనికి

ముప్పైఏళ్ళ క్రితం అతనికి ఓటు హక్కు వచ్చింది. దాదాపు ఆరుసార్లు అతని ఓటుని వాడుకొన్నాడు. అదృష్టం మారుతుందేమో నని ఎదురుచూస్తూ, అతని బ్రాకెట్టు ఆటలాగానే ఈ ఎన్నికలు అతన్ని ముంచాయి అంటేఏమీ లేదు– అతని నుదుటి రేఖలో మార్పులేదనే.

కాయకష్టం చేసుకోకుండా ప్రభుత్వం మారితే మాత్రం నీ అదృష్టం మారుతుందా అని అతనికి "ఇంత గడ్డి" పెట్టారు, ఎందరో. వాళ్ళంతా గూడా రాజుల్ని చూచి ఇవాళ అసూయపడుతున్నారు. మనం అనవసరంగా కష్టపడ్డాం పైకిరాలేదు వీడు కష్టపడలేదు. తెలివిగలవాడు"

అయితే రాజుల అదృష్టం పండింది. సీసా దొరికింది. ఎవరికీ తెలియకుండా అరణ్యంలోకి పోయి మారుమూల తెరిచి చూశాడు.

"డబ్బులేకపోయినా, నెరవేరగల డబ్బున్న వాళ్ళ సరదా ఏవా అని ఆలోచించాను. ఇలా తీర్చుకొంటున్నాను." అంతే, మరేమీ లేదు అందులో.

అన్ని పార్టీలు అలాంటి సీసాలు వదుల్తూనే ఉన్నవి. ఏటొచ్చీ సీసాలో ఆ మాత్రం నిక్కచ్చి సమాధానం గూడా ఉండడంలేదు.

రాజులు హతాశుడు కాలేదు. అతను 'చందమామ'లు చదివాడు. చదువుతున్నాడు. విసుగు చెందని విక్రమార్కుడు అతని ఆదర్శం.

భారతీయులందరూ విక్రమార్కులే. శవజాగరణ చేస్తున్నారు. అలసటే ఎరగరు ఇన్నేళ్ళబట్టి.

అదృష్టం రెండుసార్లు తలుపు కొట్టదని సామెత. రాజులకి మరోసీసా దొరకడం అందుకే వింత!

అరణ్యంలోకి పోకుండానే, ఆత్రంగా తెరిచి చూశాడు.

"గంట క్రితం ఒకసీసావదిలాను సరదా తీర్చుకోవడానికి, నాలాంటి ఏ పేదవాడో ఆశగా తెరిచి బాధపడగలడని తోచింది. అలాంటి బాధకి కారకుణ్ణి కనక నన్ను క్షమించాల్సింది. ఇంక ఎప్పుడూ ఇలాంటి తప్పుడు పనులు–ఆశలు కల్పించడం–చెయ్యను. గంటకే నాకు ఆశకురుపు లేచింది."

రాజులు బాధపడలేదు. అతనికి సంతోషం అయింది. అదృష్టదేవత ఎప్పుడూ తన్ని బాధపెడుతునే ఉంది. తన లాంటి పేదవాడిని గురించి ఆ మాత్రం ఆలోచించిన ఆ పేదవాడి హృదయం బంగారమై ఉండాలి; తన్ను గురించి ఎవరో ఎక్కడో ఆ మాత్రం ఆలోచించినందుకు అతనికి సంతోషం అయింది.

ఆ పేదవాడి పాటి ఆలోచించగల హృదయం ఎంతమంది నాయకులకు ఉంది ?

ఎందు కుండాలి నాయకులకి ? సీసాలమీద మోజుపడే మూర్ఖులున్నంత వరకూ–ఎందుకుంటుంది ?

"ఇదిలోకం"

–పి. ఆర్. భానుమూర్తి

ఇట జీవితమొక సమరం
ఎటు చూచినభీతావహతిమిరం
అనవరతం జీవితమిట పథవిహీన
పయనం
గమ్యమేదో తెలియని చీకటి విపినం
యిట కన్నుల కాంతి లేదు శాంతి లేదు
కుటిలత్వం–కాకుంటే కన్నీరులు
యిది లోకం–ముదిలోకం
హృదయాలను తొలిచేసే చెదపురుగుల
లోకం
మృతవీరుల ప్రతిశకలం
కృతకపు చీకటి లోకపు చితిమంటల
సందోహం
వినిపించే దినమెప్పుడు?
కనిపించే క్షణమెప్పుడు?

నిన్న రేపు

–చైతన్య

నిన్నంటే గతం గతం
గడిచిన యుగాల చరితం
భిన్నస్వరాల గతం స్వగతం
గతంలోకి తొంగిచూడు

రేపులోకి పయనించు
బీదవాని వెతలు చాటు
అయినవాని జరుగుబాటు
పీడితుని తిరుగుబాటు

మారుతున్న తీరుబాటు
నిన్నతల్లి రేపు పిల్ల
తల్లిపాటు తెలిసివుంటె
పిల్లబతుకు జిలుగు వెలుగు

మద్రాసు తెలుగు మాండలికమా?

—కోరాడ రామకృష్ణ

జీవద్భాషకు మార్పు సహజం. భాష ప్రాథమికా వ్యవస్థలో ఉన్నప్పుడు మాండలికాలు ఏర్పడ్డానికి ఎక్కువ అవకాశాలుంటాయి. అందరి ఉచ్చారణ ఒకే విధంగా ఉండదు. ఆయా వ్యక్తి మాట్లాడే భాషను వైయక్తిక భాష (idiolect) అంటారు. ప్రతి వ్యక్తి లోను ఉచ్చారణ భేదం కలగటానికి (1) ఇతర భాషలతోటి గల సన్నిహిత సంబంధం. (2) ఆ వ్యక్తి అభిరుచులు, అలవాట్లు (3) గ్రహణ సామర్థ్యము కారణాలవుతాయి.

సంఘం మారుతున్న కొద్దీ నూతన పదాలతో బాటు పదబంధాలు కూడ భావ వ్యక్తీకరణకు ఆవశ్యకం అగుటచే భాషలో అవి ప్రవేశిస్తూ ఉండటం వలన నూతనత్వం సంపాదించు కొంటుంది. భాషలో ధ్వని సంబంధమైన మార్పులు ఏర్పడుతుంటాయి. కాలక్రమంగా భాషా వ్యవహర్తల సంఖ్య పెరుగుతుంది. వారి మధ్య రాకపోకలు, సన్నిహిత సంబంధం తక్కువయ్యే కొద్దీ వారు మాట్లాడే భాషలో (1) భౌగోళిక (2) సాంఘిక (3) రాజకీయం అయిన కారణాల వల్ల మార్పులు ఏర్పడు తుంటాయి. ఈ కారణాలే కాక వ్యవహర్తలోని అలసత్వం, వృత్తులు, కుల మతాలు, రవాణా సౌకర్యాలు, రాజకీయ సరిహద్దులు, సహజ సరిహద్దులు, వలసపోవడం మొదలైన కారణాలు కూడ మాండలికత్వసిద్ధికికారణా అవుతాయి.

ఇక మాండలికాలు ఏర్పడ్డానికి గల కారణాలు పరిశీలిద్దాం.

మాండలికాలకు కారణాలు

భౌగోళికం : ఆంధ్రప్రదేశ్ కు, దక్షిణంలో తమిళనాడు; పడమట కర్నాటక, మహారాష్ట్ర; ఉత్తరాన మధ్యప్రదేశ్, ఒరిస్సాలు సరిహద్దులుగా ఉండటం చేత సరిహద్దు ప్రాంతంలో అన్యభాషా ప్రభావం స్ఫుటంగా కనిపిస్తుంది.

రాయలసీమ ప్రాంతం కన్నడ దేశానికి సమీపంలో ఉండటం చేత కన్నడ పలుకుబళ్ళు, కన్నడ పదాలు రాయలసీమ తెలుగులో ప్రవేశించాయి. ఉదా:- పుంటి (కూర), పుండి "గోంగూర" (కన్నడంలో 'పుండి' అంటారు) ఇట్లే తెలంగాణ ప్రాంతం తెలుగులో ఉర్దూ, మరాఠీ పదాలు ఎక్కువగా వినబడుతూంటాయి. ఉదా:- గిరక, 'బావి గిలక' మరాఠీలో 'గిర్క' గిర్కి, ఇదే విధంగా నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో తమిళ ప్రాబల్యం ఎక్కువగా కనిపిస్తుంది. ఉదా:- తకాళి (కాయ) 'రామ్ము

లగ కాయ' తమిళంలో 'తక్కాళి' అంటారు.

కోస్తా ప్రాంతం గోదావరి, కృష్ణ పెన్నా నదులచే సారవంతము అగుట, సమతల మైదానమగుట వలన ఈ ప్రాంతంలో జన సాంద్రత ఎక్కువ. రాకపోకల అనుకూల్యం కూడా ఎక్కువే. రాయలసీమ మెట్ట ప్రాంతమగుటవలన, తెలంగాణా దక్కను పీఠభూమి అగుట వలన ఇవి కోస్తా ప్రాంతంతో వేరుపడుతున్నాయి. రాయలసీమలో జనసాంద్రత తక్కువ, రాకపోకల అనుకూల్యం కూడా తక్కువే. అందునా, వెనుకబడిన ప్రాంతం కావడంచేత ప్రత్యేక విభాగంగా ఏర్పడింది.

రాజకీయ, సాంఘిక కారణాలు:– ఆంధ్రదేశం ఎప్పుడూ కూడా ఎక్కువ కాలం పరిపాలనలో లేదు. ఒక ప్రభువు రాజమహేంద్ర వరం మొదలైన నగరాలు రాజకీయ, సాంస్కృతిక ప్రాముఖ్యం కల్గిన కేంద్రాలు రాయలసీమ, తెలంగాణలలో అట్టి నగరాలు లేకుండుట వల్ల, తెలంగాణాను చాలా కాలం మహమ్మదీయులు పాలించడం మొదలైన కారణాలవల్ల మూడు ప్రాంతాల మధ్య సంబంధం ఎక్కువ లేకపోయింది. కోస్తా ప్రాంతాన్ని పాలించిన రాజులు హిందూ ధర్మ రక్షణకు కంకణం కట్టుకోవడం, ముస్లిం రాజులు తెలంగాణాను పాలించడం అక్కడి భాషలో విలక్షణతకు కారణాలయ్యాయని చెప్పవచ్చును.

వృత్తులు కూడ మాండలికతకు దోహదకారులే. గ్రామ ప్రజలకు చాల వరకు కులవృత్తులే జీవనాధారం. కాబట్టి వారికి దూరప్రాంతాల వారితో సంబంధం చాలా తక్కువగా ఉంటుంది. కాబట్టి జానపదుల వ్యవహారంలో స్వప్రాంతీయ ముద్ర అధికంగా కనిపిస్తుంది. ఏ వృత్తులవారి పదజాలం ఆ ప్రాంతము మాండలిక సరిహద్దులు దాటి ఎక్కువగా పోజాలదు.

వృత్తిపద కోశకారులు కళింగ ప్రాంతాన్ని కూడ ఒక ప్రత్యేక మాండలిక ప్రాంతంగా పేర్కొని తెలుగును నాల్గు మాండలికాలుగా విభజించారు. అంతేకాక నెల్లూరు భాష కూడ ఒక మాండలికంగా పేర్కొన వచ్చునేమో పరిశీలించవలసి ఉంది.

ఒకే ప్రాంతంలోనే మతాలు, కులాలు, ఆచార వ్యవహారాలు మొదలైన కారణాల వల్ల వర్గ మాండలికాలు (Social dialects) ఏర్పడతాయి.

మాండలికాల పరిశోధనా పద్ధతులు

ప్రాంతీయంగా మాండలికాలను ఏ విధంగా విభజిస్తారో ఈ పరిశోధన ఏ విధంగా జరుగుతుందో స్థూలంగా తెలుసుకొందాం. పరిశోధనా విషయాన్ని బట్టి, ప్రయోజనాన్ని బట్టి, మాండలిక పరిశీలన జరుగుతుంది

1. ఒక అర్థంలో ప్రతిచోటా ఏ మాట వాడుతారో ఆ భాషా ప్రాంతమంతా

తిరిగి సేకరించడం. మొదటి పద్ధతి.
ఉదా :- పొలందున్నే పనిముట్టుకు, నాగలి, నాగేలి, నాగేలు, నాగెల, నాంగలి, మడక.

2. ఒక శబ్దం ఉచ్చారణ భేదాలతో మాత్రమే ఉంటుందని తెలిసికొన్న కొన్ని మాటలను తీసుకొని ఆయా భేదాలను భాషా ప్రాంతం అంతా తిరిగితెలిసికొని ధ్వనివిధేయ లిపిలో సేకరించడం, రెండవ పద్ధతి.
ఉదా :- రేగడి, రేగడ, రేవడి, రేవడ, రాగడి-రాగిడి.

3. కొన్ని వ్యాకరణ ప్రక్రియలకు చెందిన విశేషాలు ఎట్లా ఉన్నాయో పరిశీలించి సేకరించడం మూడవ పద్ధతి.

ఈ సేకరించిన పదజాలాన్ని ఒక్కొక్క సంకేతం పెట్టుకొని ఆ ప్రాంతాన్ని దేశపటం (ఆ భాషా వ్యవహార ప్రదేశం) లో గుర్తించాలి. వాడుక మారిన చోట గుర్తులు మారుతాయి, అలాటి గుర్తులు వచ్చేటట్టు పటంలో గీచిన గీతలకు వ్యవహార భేదక రేఖలు (isogloss) అంటారు. ఈ విధంగా తయారుచేసిన పటాలను మాండలిక పటాలు (Dialect Atlas) అంటారు.

పటాలయందు నియత ప్రాంతాన్ని వేరుచేస్తున్న వ్యవహార భేదక రేఖా సమూహాన్ని (bundle of isogloss) మరోపటంలో గీయాలి. సామూహికంగా (bundle) ఏర్పడ్డ వ్యవహార భేదక రేఖలే భాషా మండలాలకు సరిహద్దులుగా గుర్తించాలి. ఈ వ్యవహార భేదక రేఖలు 1 రాజకీయ, భౌగోళికసరిహద్దులతోనూ 2భాషేతరలక్షణాలతోనూ (Extra linguistic features) అనగా జానపద ఆచార వ్యవహారాలు, మూఢ నమ్మకాలు మొదలయినవి ఆధారంగా గీసిన వ్యవహార భేదక రేఖల (isogrades) తోనూ ఈ వ్యవహార భేదక రేఖా సమూహం చాలి మట్టుకు ఏకీభవిస్తుంది

ఈ వ్యవహార భేదక రేఖలు ఒక దానిమీద మరొకటి ఆశ్రయించుకొని అంటే (overlap) ఆ ప్రాంతాన్ని మాండలిక సంధి ప్రాంతం(transition zone) గా గుర్తింపవచ్చును. అంటే రెండు మండలాల్లో విలక్షణంగా ఉన్న మాటలన్నీ ఈ ప్రాంతపు ప్రజలవాడుకలో వినిపిస్తాయి.

ధ్వని (phonological); పదాంశ (morphological), వ్యాకరణ (grammatical) స్థాయిలలో డయలెక్ట్ అట్లాస్ (Dialect Atlas) తయారు చేసి, వాట (isogloss) బొత్తిని (bundle) మరో పటంలో గీస్తేనే గాని భాషా మండలాల సరిహద్దులను నిర్ణయించడం పూర్తికాదు.

ఇంతశ్రమ పడి మాండలిక పరిశోధన చేయవలసిన ఆవశ్యకత ఏమిటని ఒక ప్రశ్న : కొన్ని చారిత్రక,సాంఘిక రాజకీయ కారణాలవల్ల ఏదో ఒక ప్రాంతీయ మాండలికం ప్రామాణికత్వం వహిస్తుంది. ప్రామాణిక భాషనే పరి

శీలించినట్లయితే, మిగిలిన మాండలి కాలను పరిహరించినట్లవుతుంది. ఇది భాషా పరిపుష్టి విషయమై సంభావ్యం కాదు. కనుక మద్రాసు తెలుగు మాండలికాన్ని పరిశీలించవలసిన ఆవశ్యకత ఏర్పడుతోంది.

మద్రాసు తెలుగు

మద్రాసు తెలుగుపై తమిళ భాష ప్రభావం ఎక్కువగా కనిపిస్తుంది. ఇది రాయలసీమ మాండలికానికి సరిహద్దులో ఉంది కనుక మద్రాసు తెలుగుకు ఆధారం రాయలసీమ (నెల్లూరుకూడ) మాండలికమే అని చెప్పవచ్చు.

మద్రాసు నగరంలో స్థిరపడిన తెలుగువారిని మూడు వర్గాలుగా విభజింపవచ్చు.

1. మద్రాసు ప్రాంతంలో చాలకాలం నుంచి నివసిస్తున్నవారు; (2) మద్రాసులో ఇటీవల స్థిరపడ్డవారు; (3)దక్షిణ దేశంనుంచి వచ్చి మద్రాసు నగరంలో స్థిరపడినవారు.

శ్రీకృష్ణదేవరాయలు దక్షిణదేశాన్ని జయించిన తరువాత రాజ ప్రతినిధులుగా పరిపాలకులుగా ఉన్నత పదవులలో అనేకులను నియమించారు. వారిలో చాల మంది తెలుగువారు. వారు తమిళ దేశంలో స్థిరపడిపోయారు. ఆనాడు తెలుగు రాజభాష కావడంవల్ల దానిపై గౌరవ భావంతో తమిళులుకూడ అనేకులు తెలుగు నేర్చుకొన్నారు. ఆంగ్లేయులు ఫోర్ట్ సెంట్ జార్జి కోటలో స్థిరపడి తరువాత క్రమేపి రాజరికాలు అంతరించడంతో ఉద్యోగార్థమై, వ్యాపారార్థమై ఆ ప్రాంతం నందలి తెలుగు వారు నెమ్మదిగా మద్రాసు నగరం చేరుకొన్నారు. అట్లు తరలివచ్చిన అనేక తెలుగు కుటుంబాలు సెంట్‌జార్జికోట చుట్టూగల చింతాద్రిపేట, జార్జిటౌను, రాయపురం, తొండయారుపేట మొదలగు ప్రాంతాల్లో స్థిరపడ్డారు.

ఆంధ్రరాష్ట్రం విడివడిన తరువాత ఇచ్చట తెలుగువారి ప్రాబల్యం రాజకీయ కారణాల వల్ల తగ్గింది ఇచ్చట స్థిరపడిన తెలుగు వారికి అటు ఆంధ్ర దేశం తోటీ, ఇటు దక్షిణ దేశంతోటీ, సంబంధం తగ్గిపోయింది. రాజకీయ కారణంగా మద్రాసు లోని తెలుగు వారు తమ పిల్లలకు తమిళాన్నే నేర్పిస్తున్నారు. ఇంట్లో తెలుగే మాట్లాడుతున్నా, నిత్య వ్యవహారంలో తమిళం అవసరంకావడం వల్ల వారి తెలుగు భాషపై తమిళం ప్రభావం ఎక్కువ కనిపిస్తుంది.

మద్రాసు తెలుగు అని విశాలార్థంలో గ్రహిస్తే ఈ మూడు రకాల వ్యవహర్తలను దృష్టిలో పెట్టుకొని వాళ్ళ భాషా లక్షణాలను వివరించవలసి వస్తుంది.

మద్రాసు తెలుగు లక్షణాలు

మద్రాసు తెలుగు భాషా లక్షణాలు కొన్నిటిని మచ్చుకు పరిశీలిద్దాం.

(1) "వాడు పోచ్చినాడు. వీడు పూడ్చినాడు" అని మద్రాసు తెలుగు వారంటారు. ఇవి "పోయి విడిచినాడు" అను రూపం నుండి ఏర్పడింది. ఇది "పోయి విట్టాన్" అనే రూపానికి తెలుగు సేత. తమిళం లో "విడు" అనేది సహాయక క్రియ. ఇది ఒక పని పూర్తి అవడం, సంపూర్ణంగా జరగడం, త్వరగా జరిగిపోవడం–ఇత్యాది అర్థాల్లో క్వార్థక రూపానికి చెందుతుంది.

ఉదా:- 'వందు విట్టాన్', ''వాంగి విట్టాన్''

ఈ "విట్టాన్" అనే సహాయక క్రియకు "వేయు, పోవు" అనే సహాయక క్రియలే కాని "విడుచు" అనే క్రియను వాడము. తమిళంలో "విడు" అనే క్రియ ప్రభావంచేత తెలుగులో దాని సమానార్థకమైన "విడుచు" క్రియ మద్రాసు తెలుగులో వాడకంలోకి వచ్చింది. కావున ఈ పలుకుబడి తెలుగు ప్రాంతంవారికి వింతగా కనిపిస్తుంది.

2. "నేను ఇట్లా వినబడితిని" అనే మద్రాసు తెలుగు రూపం "నాన్ కేళ్వి పట్టేన్" అనే రూపానికి ప్రతిరూపం. తమిళంలో "కేళ్విపట్టేన్" అంటే సరిగానే ఉంది. అదే తెలుగులోకి మార్చి "వినబడితిని" అంటే, తెలుగు భాషా సంప్రదాయానికి భిన్నంగా ఉన్నట్లు అనిపిస్తుంది.

3. శబ్దాలకు అర్థాల్లో భిన్న ప్రాంతాల్లో వైవిధ్యం ఉంటుంది.

"కోక ఎత్తితివా ?" అనేది ఇక్కడ "ఎత్తు" "కొను" అనే అర్థంలో వాడుతారు. తమిళం "నాన్ రెండు పొడవె ఎడుత్తేన్" "ఎడు" అనే దానికి తమిళంలో "కొను" అనే అర్థం ఉండటం చేత "ఎడు" కి సమానమైన క్రియ "ఎత్తు"– దానికి "కొను" అనే అర్థం వచ్చింది. ఈ పలుకుబడి తెలుగు ప్రాంతంవారికి అశ్లీలార్థాన్నిస్తుంది.

(4) దీర్ఘం మీద అనుస్వారం తెలుగులో నన్నయ తరువాత లోపించింది. కాని మద్రాసు తెలుగులో నిలిచి ఉంది.

"పేంద", "కోంతి", "పూంసలు", "కూంతురు."

(5) తెలుగులో "నూగులు–నవ్వులు", "నేయి–నెయ్యి", "పూవు–పువ్వు", అనే రూపాలున్నాయి. వాటిలో "నూగులు–నేయి–పూ" అనే రూపాలు మద్రాసు తెలుగులో ఉన్నాయి.

"నూగులు" అని వ్యస్తపదంగా వాడేప్పుడు మాత్రమే ఏవిధమైన మార్పు లేదు. కాని విశేషణంగా వాడేప్పుడు కొందరిలో "నుగులనూనె" అని హ్రస్వంగా మారుతోంది.

(6) "మంది" బహువచనార్థకంగా వాడతారు "అక్కడ చాలమంది ఉన్నారు." కాని మద్రాసు తెలుగులో "మంది"పై బహువచన ప్రత్యయం చేర్చి "మందిలు" అని వాడుతున్నారు

(7) "అన్నలు ఇద్దరు" అని చెప్ప డానికి "అణ్ణ ఇద్దరు" అని వాడు తున్నారు. నామవాచకానికి బహువచనం చేర్చడం లేదు. దీనికి తమిళ ప్రభావం కారణం.

తమిళం-"అణ్ణారెండ్ పేర్".

8. బహువచనానికి ఏకవచనక్రియను ఉపయోగించడం.

"అంగడిల పుస్తకాలు ఉండాదబ్బా"

(9) "లో" విభక్తి ప్రత్యయంగా వాడే సందర్భంలో మద్రాసు తెలుగు నందు "ల" విభక్తి ప్రత్యయంగా వాడుతున్నారు. దీనికి తమిళ ప్రభావం కారణం.

"దానిల నాలుగు రూబాయలు ఉండా దబ్బా". తమిళం-"అదిలనాల్ రూబా ఇరిక్కు."

(10) "నూరు" సంఖ్యావాచకం కనిపిస్తోందే కాని, "వంద" సంఖ్యా వాచకం వాడటం లేదు. అంటే ఈ మాండలికంలో "నూరు" సంఖ్యా వాచకం నిలిచి ఉంది. "ఇన్నూరు" నన్నూరు".

11. తమిళపదాలు అనేకం అలాగే మద్రాసు తెలుగులో వాడుతున్నారు.

"ముడివు" = "నిశ్చయం"
"అడయాళమ్" = "గుర్తు"
"ఆణి = "గోరు"

పై కారణాలవల్ల మద్రాసు తెలుగును మాండలికంగా పరిగణించవచ్చును.

ఓ పిత

మూలం : గెవోర్క్ ఎమిన్ | అనువాదం : తాతిరాజు

ఈ భూప్రపంచంలో
'అవును' 'కాదు' కంటే
చిన్నపదాలు లేనేలేవు కాని
కొన్ని ప్రశ్నలకి జవాబుగా వీటిలో ఏదోఒకటి చెప్పాలంటే
ఒకోక్క జీవితకాలం పట్టొచ్చు.

నేనూ - నువ్వూ

నేను తుపాకీ నీమీద పేలుస్తే అది శాంతి స్థాపనకి. నువ్వు నామీదకి ఒక మెల్లంగి రాయి విసిరినా అది పితూరీ!

నేను పుట్టి ఏడు పదుల ఏళ్ళు గడిచినా, నిరుడే నా దేశానికి ముద్దుబిడ్డగా పుట్టినంత సంబరంగా వేడుకలు జరుపుకుంటూ, సభలుచేసి, లక్షలాది నా భక్త బృందాలని లారీలమీదా బళ్లమీదా వేసుక వచ్చి, వారి శుభాకాంక్షలు, వారు సమర్పించుకునే కట్నకానుకలు లక్షలు విలువజేసే ధన కనక వస్తువాహనాలు పొందుతే అది నాహోదాకీ,పాప్యులారిటీకీ చిహ్నం.

పాతిక దాటిపోయింది నీకు-ఉద్యోగం లేక రోడ్లమ్మటపడి తిరుగుతున్నావ్ గూండా వెధవలా- అడ్డగాడిదలా ఉన్న నీకు పుట్టిన రోజేమిట్రా? నీకు కొత్త బట్టలు కుట్టించాలా? పాయసం వండి పెట్టాలా? ఒరే! నీవంటివారు భూమికి బరువురా! దేశానికి అరాచకం! సిగ్గుపడరా! సిగ్గుపడు!

నా ముద్దుల 'బిచ్'కి మరో ఒకనాటి ముద్దుల 'బిచ్చి' కొడుకునిచ్చి ఆకాశమంత పందిరేసి, భూమం త తివాసీ పరిచి, నవగ్రహాలనూ, నక్షత్రాలనూ, దేవదానవులనూ అతిథులుగా ఆహ్వానించి ఏడు రోజుల వేడుకలతో పెళ్ళి చేసి కట్న కానుకలతో నా ఖజానా నింపుకుంటాను... అది నా రాజసానికి చిహ్నం-

నువ్వు నీ అనుంగు కూతురు పెళ్ళి నీ కున్నంతలో జరిపి, ఒక్కరోజు పెళ్ళికి ఒకరో అరో బంధుమిత్రులని పిలిచి తిండిపెట్టినా, వారిచ్చే ప్రేమపూరిత ఖరీదు మనసు రూపేణా ఉన్న డబ్బు రూపేణాలేని కానుకలు పుచ్చుకున్నా, అది నీ తాహతుకు మించిన బతుకు! ఎక్కడిదయ్యా నీకాసొమ్ము? పెడతాను నీ వెనుక రహస్యపోలీసుని నీ భరతం పట్టడానికి.

నా మందికీ సిబ్బందికీ, నా రాణులకీ సానులకీ, వారి పోషణకీ విలాసాలకీ (వాటినే ఆంగ్లంలో 'పెర్క్స్' అంటారులే) కావల్సిన సొమ్ము నువ్వూ, నీ అబ్బాకాక మరెవరిస్తారు? మరి ఏలుబడి ఎలాచెయ్యగలననుకున్నావ్ రిటిన్యూ లేకపోతే? ఏడుస్తావేం? అవి పన్నులు-

నువ్వు, నేదాచుకున్నది కావాలంటే అది కుట్ర... తిరుగుబాటు... దొంగబుద్ధి... డెకాయిటీ!

నా మాస్ మీడియా యంత్రాంగం నా సొమ్ముతో నడిచే వార్తాపత్రికలూ నాప్రతిపనినీ భళీభళీఅని తందాన తం దానా అని పదంపాడుతూ కదం తొక్కుతే అవి వార్తలు.

నువ్వు వాటిని ఖండిస్తూ కరపత్రాలు పంచుతే అది ప్రొహిబిటెడ్ లిటరేచరు.

కొరతలు సృష్టించి ధరలు పెంచి, కోటికి పడగలెత్తి, అంతస్తులమీద అంత స్థులు నేను లేపుతే అది వాణిజ్యం.

అందుకు నువ్వు నన్ను తెగనాడతా నంటే నువ్వు ఉగ్రవాదివి... పద బొక్కలోకి- అదే నీకు సరైన చోటు-

ముందు ముందు పదవికోసం మదు పుగా నా ఆస్తిలో అరవీసంవంతు త్యాగం చేసి, ఖైదుకిపోయి విడుదలైతే నేను త్యాగమూర్తిని.... ప్రియతమ నాయ కుణ్ణి- నేను దైనాస్టీని స్థాపించే హక్కు గలవాడిని-

నువ్వు ఖైదులో పడ్డావా ? అయితే విడుదలయ్యే సంగతే మరచిపో ! చీకటి కోణాలలో మగ్గిమగ్గి ఓనాడెప్పుడో దిక్కు లేని చావు నువ్వు చస్తే ఓ హంతకుడు చచ్చేడని నా మీడియా ప్రకటిస్తుంది ప్రపంచానికి.

నేను దైవాంశ సంభూతుడ్ని! నువ్వు కేవలం నన్ను పూజించడానికి, సేవించ డానికిపుట్టిన మానవుడవి... నా బానిసవి!

నేను సర్వవ్యాప్తుడని ! నువ్వు బతక డానికి సూదిమొనంత చోటుకూడా పొందే హక్కులేని శాపగ్రస్తుడివి !

ఏమిటీ ? పడతావా నాతోకుస్తీ!? ఒరేమూర్ఖుడా ఉరికేముందు ఆలోచించరా కొంత !

ఆలోచించావ్ ? అయితే రారా ! అర్భకుడా ! ఉఫ్ఫున ఊదేస్తాను ! కమాన్ !

అబ్బ ! అబ్బ ! ఏమిటిరా ఇంత బరువానువ్వు ! తియ్యరాబాబూ నీ కాలు నాగుండెల మీంచి ! ఏమిటలా పెరిగి పోతున్నావ్ ? జానెడు మనిషివి ఆకాశ మంత ఎత్తు ఎలా ఎదిగిపోయేవ్ ! ఒక కాలు భూమి.... ఒక కాలు ఆకాశం.... రెండుపాదాలు సమస్త విశ్వాన్నీ ఆక్ర మించాయెలా ?

మూడోపాదం నా పీకమీద పెట్టి నొక్కకు ఓ మహామనీషీ! అబ్బ ! అబ్బ! చచ్చేన్రోయి ! రక్షించండి ! నన్ను రక్షించండి ! ఒక్కడూ పలకడేం....? ఒక్క తుపాకీ నా రక్షణకోసం పేలదేం? నా ఉప్పుతిన్న, నన్నే ఇంద్రుడూ చంద్రుడూ అన్న నా భృత్యవర్గం, నా సిబ్బందీ ఎక్కడ చచ్చింది ! హతోస్మి! హతోస్మి !

—మంథా వెంకట రమణారావు

పాబ్లో నెరూడాతో

ముల్క్‌రాజ్ ఆనంద్

సోమసుందర్

విప్లవ చిలీదేశపు రాయబారిగా నెరూడా భారతదేశంలో ఉండి ఉన్న రోజులనుంచీ శ్రీ ముల్క్‌రాజ్ ఆనంద్ వంటి భారతీయ సాహితీ వేత్తలెందరో ఆయనకి మంచి మిత్రులు. భారతదేశపు ప్రకృతి సౌందర్యం, సస్యసంపన్న సుక్షేత్రాల శోభా, సంస్కృతీ, వంటివెన్నో నెరూడా మక్కువను చూరగొన్నాయి.

1971 లో పారిస్ లో యునెస్కో (ఐక్యరాజ్య విద్యా విజ్ఞాన సాంస్కృతిక సంస్థ) సమావేశం జరిగింది. ఆ సమావేశంలో పాల్గొనడానికి శ్రీ ఆనంద్ పారిస్ వెళ్లాడు. అప్పట్లో ఫ్రాన్సులో చిలీ రాయబారిగా పని చేస్తున్న నెరూడా పారిస్‌లోనే ఉండేవారు. ఆ సమయంలో ఆయన కొంచెం సుస్తీ పడ్డాడు కూడా. వీరిద్దరి స్నేహమూ అప్పటికన్న ప్రాచీనమైనదే ! స్పానిష్ అంతర్యుద్ధంలో శ్రీ ఆనంద్ స్వచ్ఛంద సైనికుడిగా పాల్గొన్నాడు. అప్పుడే ఆయనకు నెరూడాతో సన్నిహిత మైత్రి ఏర్పడింది. ప్రపంచ సంగ్రామానికే స్పెయిన్‌ను ఆద్యపీఠిగా ఫాసిస్టులు మార్చిన ఆదశలో ప్రపంచ దేశాల అభ్యుదయ రచయిత లెందరో స్వచ్ఛంద సైనికులుగా ఆదేశానికి వెళ్లి పాల్గొన్నారు. క్రిస్టోఫర్ కాడ్వెల్, రాల్ఫ్ ఫాక్స్, ఫ్రెంచి కవిగేబ్రియల్ పెరి ....వంటి వారెందరో నిహతులై అమరవీరులుగా సంస్మరింప బడుతున్నారు. గండం తప్పి తిరిగి వచ్చి ప్రఖ్యాతులైన వారిలో W.H. ఆడెన్ స్టీవెన్ స్పెండర్, క్రిస్టోఫర్ ఇషర్‌వుడ్, ముల్క్‌రాజ్ ఆనంద్ వంటి కవులు పేర్కొన తగినవారు స్పానిష్ అంతర్యుద్ధ సమయంలో నెరూడా ఆనంద్‌ల కేర్పడిన మైత్రి ప్రగాఢంగానూ, చిరంతనంగానూ పరిఢవిల్లింది ఎక్కడో ఒకచోట ఏడాదికొక సారైనా వీరిద్దరూ కల్సుకుంటూ ఉండేవారు, హాయిగా సాహిత్య కాలక్షేపం చేసుకొనేవారు.

ఎలాగా తాను పారిస్ వచ్చాడాయె! నెరూడా కూడా పారిస్‌లోనే ఉన్నాడు కనక ఎలాగైనా ఆయన్ని కలుసుకోవాలని ఆనంద్ తహతహలాడాడు. కాని నెరూడా జబ్బుపడ్డాడనీ, డాక్టర్లు ఎవరినీకల్సుకో వద్దంటున్నారనీ, సంభాషణ లు మంచివి కాదన్నారనీ ఆనంద్‌కి సమాచారం అందింది. ఆయన్ని ఎలాగైనా సందర్శించి తీరాల్సిందే అనుకున్నాడు ఆనంద్. ఉభయులకి మిత్రుడూ, పారిస్ లో స్థిరపడినవాడూ అగు రతలా జరస్‌కి నెరూడాతో సమావేశం ఏర్పాటు చేయ మని చెప్పాడు.

మరునాడే జరస్ ఆనంద్‌ని కలిశాడు. "పాబ్లోకి ఫోన్ చేశాను. మీరు కలుసుకో గోరుతున్నట్లు చెప్పాను. ఈరోజు మధ్యాహ్న భోజనానికే తన నివా సానికి మనల్నిరమ్మని ఆహ్వానించాడు." అని తెలిపాడు, జరస్... ఆనంద్ హృదయం ఆనందంతో పరవశించింది. ఈ సంఘటన గురించి ఆయన-టైమ్స్ ఆఫ్ ఇండియా పత్రికలో నెరూడా మరణానంతరం అతనికి మహత్తర స్మా వర్జిక (Tribute) అందిస్తూ అతనిలారాశాడు. అతని ప్రత్యక్ష కథనమే నేరుగా చవి చూడడం ఆనందకరం.

"కేంటో జనరేల్"

గ్లాసులోకి పానీయం వంపుతున్నాడు నెరూడా... పాబ్లోకావ్యం "కేంటో జనరేల్" (విశ్వగీతి అనవచ్చు)– జపాను భాషలోకి అనువదింపబడి చక్కగా ముద్రింపబడిన గ్రంథం బల్లమీద మెరుస్తోంది. నా చూపులు దానిపై వాలడం నెరూడా కనిపెట్టాడు. వెంటనే అతనిలా అన్నాడు. "ఇది నలభయ్యో అను వాదం!" అతి సామాన్య సమాచార మందిస్తున్నట్లు నిరాడంబరంగా చెప్పాడు.

"ఫ్రెంచ్ అనువాదం చదివానండీ! ఏమంత బాగుండలేదు!" అన్నాడు రత్‌లాజరస్.

"కవిత్వం అనువాదానికి లొంగేదికాదు లెద్దురూ! మహా మొండిది!" అన్నాడు చిరునవ్వునవ్వుతూ పాబ్లో.

పడక కుర్చీలోకి కొద్దిగా వాలాడు. నీరసంగా ఉన్నాడు. అంతలోనే మళ్ళీ ఉత్సాహంతో నాముందుకు వంగాడు. "మిమ్మల్ని చూడగలగడం నా కెంతో ఆనందంగా ఉంది.... ఈవేళ మీరిక్కడికి రావడమూ ఎంతో బాగుంది.

ఏమంటారా, నాల్గురోజుల్లో నాదేశానికి తిరిగి వెళ్ళిపోడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి!" అన్నాడు పాబ్లో దరస్మిత వదనంతో!

"అదేం? మీ రిక్కడికివచ్చి ఏడాదైనా పూర్తికాలేదటకదా?" అని అయన్ని ప్రశ్నించి. నా చూపులు జరన్‌పైకి త్రిప్పాను. అతనప్పుడే సిగరెట్టు ముట్టిస్తున్నాడు:

నెరూడా హృదయంలో చిలీ

"చిలీ వ్యవహారాలేమీ బాగూలేవండీ! అలెండీ చాలా ఇబ్బందుల కెదురవుతున్నాడు. నా అవసరం అక్కడే ఎక్కువుంటుంది! ఊపిరి సలపని గొడవలంటే నమ్మండి!" అన్నాడు. ఆయన ముఖంలో ఒక మ్లానరేఖ తొంగిచూచింది.

చిలీ పరిస్థితులు నేను తెలుసుకుంటున్నాను. అయినా అడిగాను: "అక్కడ మీకు మంచి వైద్య సదుపాయాలుంటాయికదా?" అని.

"చిలీలో డాక్టర్లు చాలామందే ఉన్నారు. పైగా చాలా మంచివాళ్లు కూడా నేనన్నా నా కవిత్వమన్నా ఎంతో ఇష్టం వాళ్ళకు. ఇక్కడలాగా మరీ దబ్బే దైవం అనుకొనేవాళ్లలేరు" అంటూ ఒక్కసారిగా ఆగాడు నెరూడా-ఏదో హస్తచాలనం చేశాడు- పోనీలెండి ఆ గొడవలకేం? అన్న భావం స్ఫురించేలా: సరిగా అదే సమయంలో ఆయన భార్య ఒక ఆజానుబాహుడైన యువకునితో వచ్చింది. అబ్బ ఆమె ఎంత సౌందర్యవతి!

వెంటనే ఆ యువకుని పరిచయం చేశాడు పాబ్లో. "స్పెయిన్ కొత్త కవుల్లో యితనొకడు. ప్రవాసంలో బ్రతుకుతున్నాడింకా!" అన్నాడు ఎంతో ఉత్సాహంగా!

ఇద్దరమూ అంతర్యుద్ధపు రోజుల్ని తలపోసుకున్నాం. మేం కలసిచేసిన మంచిపనులూ, నవ్వు తెప్పించే పిచ్చిపనుల జ్ఞాపకాలూ మాచుట్టూ తిరిగాయి. కొన్ని మరీ దిగుళ్ళనూ విసిరాయి. మా తెలివి తక్కువ పనులకు పకపక నవ్వుకొన్నాం. మా మిత్రుడు గర్షియా జ్ఞాపకంవచ్చి కన్నులు చెమ్మగిల్లాయి. ఆ రోజుల్లో మేం కలసి బ్రతుకుతూ పడిన కష్టాలూ గుర్తుకు తెచ్చుకున్నాం. జ్ఞాపకాలు గగుర్పాటు కలిగించాయి.

'అబ్బబ్బ! ఏంరోజులవి! ముక్కకంపుకొట్టే ఒక రొట్టెముక్క కోసం

ఎలకల్లాగ అంగలార్చే వాళ్ళం! ఆరోజు లెంత దుర్భరంగా గడిచాయి అన్నాను ఆలోచనల బరువుతో!

మా సంభాషణకి స్పెయిన్ యువకవి అడ్డు వచ్చాడు. 'అంతర్యుద్ధం రోజుల్లో బార్సెలోనాలో వాళ్ళు మా అమ్మనీ నాన్ననీ చంపేశారు. అప్పుడు నాకు ఏడేళ్ళు!' అన్నాడు. అతని కనుగ్రుడ్లలో నీళ్ళు సుళ్ళు తిరిగాయి. అతని ముఖంలో నాకు గర్షియాలోర్కా దర్శన మిచ్చాడు.

'మా ఊహల్లో మెదిలే సాహసగాథ స్పెయిన్!' అన్నాడు రత్‌లాజరస్!

'నిజమే, ఇప్పటి చిలీ అప్పటి స్పెయిన్‌లాగే ఉంది. నిత్యం పోరాటం సాగుతూనే ఉంది. అయితే అది రాజ్యాంగబద్ధమైన పోరాటం! అంతే తేడా!' అన్నాడు పాబ్లో మా చుట్టూ ఏదో గాంభీర్యం ఘనీభవించింది.

మధురమూర్తి :

భోజనాలు చేశాం. చాలాసేపు నిశ్శబ్దంగానే గడిచింది... 'మీ కొత్త కవితలేమైనా చదవరూ ?' అని పాబ్లోని అభ్యర్థించాను. అతని ముఖం భారంగా మారింది. జబ్బుపడి ఉన్న సమయంలో నా ఉత్సుకతతో ఆయన కిబ్బంది కలిగించడం భావ్యం కాదనిపించింది. నే నిలా తటపటాయిస్తున్నాను – ఆయన కలగచేసుకొని వెంటనే యిలా అన్నాడు: 'అంత ఓపిక లేదు సోదరా ! ఓపిక ఉంటే ఆమధ్య రాసిన 'ఈటడ' అనే కవితనే వినిపించి ఉండేవాడిని' అంటూ టైపు చేయబడిఉన్న ఆ కవితను నాకిందించాడు. 'అది మీరు తీసుకువెళ్ళి చదవండి కాని ఈ మధ్య నే రాసిన ఓ చిన్నగేయం చదువుతాను.' అన్నాడు పాబ్లో !

"మీ 'కొత్తపాట-ప్రవాసం' అనే కవితలు నాకెంతో యిష్టం" అన్నాడు స్పానిష్ యువకవి.

'అబ్బో అది చాలాపెద్దది. ఇప్పుడు చదవలేను బాబూ! ఊపిరి చాలదు' అంటూ చిన్నగేయం వినిపించాడు. ఆయన ఎంత మనోహరంగా చదువుతాడని! ఆయన గొంతెత్తి చదువుతూంటే కొండ అవతలి అరణ్యాలు భగభగ మండుతున్నట్లో, భూకంపాలు కదలిస్తున్నట్లో, విచిత్రాను భూతులు కలుగుతాయి. ఆయన కవిత చదవడం ముగించాడు. నే నభినందించాను.

'ఏమిటోనండి, నా ఆరోగ్యం బాగుండడంలేదు. తరచుగా యిబ్బంది పెడుతోంది. రాయబారిగా ఈ పారిస్‌లో ఉండడం నాకసలే మనస్కరించడం లేదు. ఐనా అలెండీ మాట కాదనలేక ఒప్పుకున్నాను' అన్నాడు యిబ్బందిగా పాబ్లో.

"పోనీ కొన్నాళ్ళు విశ్రాంతి తీసుకోండి !" అన్నాను ఓదార్పుగా.

"అబ్బో ! విశ్రాంతి! ఎంత తీయనిమాట ? కాని అది ఎప్పటికేనా అందేదేనా ? చిలీ ప్రజలంతా, ఎక్కడెక్కడున్నా, స్వదేశానికి తిరిగి చేరుకోవాల్సిన సమయం వచ్చింది. కొత్త ప్రభుత్వాని కండగా నిలచి కాపాడుకోవాలి ! రాగి గనుల్ని జాతీయం చేసినప్పటినుంచీ, దేశంలో స్వార్థపరుల కుట్రలు మితిమీరుతున్నాయి. శత్రువులు యింటాబయటా విజృంభిస్తున్నారు...." అంటూ అర్థోక్తిగానే ఆపుచేశాడు పాబ్లో.

ఈ నిత్య సమస్యలన్నిటితోనూ తానొక్కడే సతమతమవుతున్నట్లున్నాడు. మళ్ళీ వాటిని పునశ్చరణ చేసుకోవడమెందుకులే అన్నట్లు గాలిలో చేయి వూపాడు. ప్రసంగం మార్చదలచినప్పుడల్లా ఆయన అదే భంగిమ ప్రదర్శిస్తాడు.

స్పానిష్ యువకవి తనకు నచ్చిన పాబ్లో కవితలను లో గొంతులో చదివాడు. ఒక్కచోటి మాత్రం ఎందుకో అప్రయత్నంగా అతని గొంతు హెచ్చింది. అతను చదివిన ఆ కవిత ఎంతో మనోహరంగా ఉంది. 'కేంటో జనరేల్'లో, వాల్ట్ విట్మన్‌కు ఎంతో ఉద్రేకపూరిత హృదయంతో విజ్ఞాపన చేస్తాడు. అందులో పీరుని ఆక్రోశం వినిపిస్తుంది. కాని ఈ కవితలో సుకుమార భావాల సెలయేటి అలజడులు మృదువుగా వినిపిస్తాయి. కృతికీ కృతికీ ఎంత వైవిధ్యం ? కవిగా పాబ్లో ఎంత ధన్యజీవి!....అనుకున్నాను మనసులో!

పాబ్లో కునుకుతీసే సమయం దగ్గరపడుతున్నట్లు అతని బద్ధకం తెలుపుతోంది.

'సరే-మేం వెడతాం!' అన్నాను. ఇద్దరమూ లేచాము. 'మళ్ళీ వచ్చే వసంతంలో కల్సుకుందాం' అన్నాను.

వాతావరణం పాబ్లో కవితల బరువుతో గంభీరముద్ర దాల్చింది. గది ఊపిరి బిగపట్టినట్లుంది. అందుకే ఆశాభావంతో కొంత సంచలనం కలిగించాలనిపించే అలా అన్నాను.

'బహుశా.. కల్సుకోగలమనే ఆశిస్తాను!' అన్నాడు పాబ్లో. కానిఎందుకో అతని గొంతులో సంశయాలు నిట్టూరుస్తున్నట్లు వినిపించింది! అతని మనసు నిండా ఏవో తీరని వ్యథలు సుళ్ళు తిరుగుతున్నట్లుంది.

పాబ్లో లేచాడు. నన్ను సమీపించాడు. ఆప్యాయంగా తన రెండు చేతులూ నాచుట్టూ వేశాడు. గాఢంగా ఆలింగనం చేసుకున్నాడు. 'మీరు చిలీ రండి! అక్కడ జరుగుతున్న సంగతులు మీవంటి సన్మిత్రులు చూసితీరాలి ! తప్పక వస్తారుకదూ!' అన్నాడు ప్రేమగా నా బుజం నొక్కుతూ !

ఆ మహనీయ మధురమూర్తిని మళ్ళీ ఈ జన్మలో కల్సుకోలేకపోయాను...

పెదవులు

—రవి

ఎడద చీకటి పొరల
సుడులలో జనియించు
అగ్ని గోళాల్లాంటి
ఆలోచనల గుంపు
తను తరువు చివరలో
రస నాగ్రముల పైన
గూటిలోపలి నుండి
అక్షరమ్ముల పక్షి
అధరాన విహరించు

వర్గ శత్రువు పైన
ఖడ్గమ్ము ఝుళిపించి
చరమ యుద్ధమ్మంచు
సాటింపు వేసెదను
చెలికాళ్ళతో కలిసి
చేసెదను నృత్యమ్ము
విజయ గీతారావ
విన్యాసముల నాదు
మధురాధ రమ్ముపై
విరియింప జేసెదను

బ్రతుకు ముంగిలిలోన
ప్రతి సమస్యకు కూడ
పెదవి కదలికలోనె
బదులు వినగావచ్చు

నా పెదవి గుసగుసలు
నక్షత్ర గానమై
పడతి గుండెల్లోన
పండించు రతనాలు

ఒక ముద్దు నా పెదవి
చేరితేనే చాలు
విద్యుదావేశమ్ము
కమ్ముకొను నాలోన

తేనీటి అమృతంపు
దాహమ్ములో పెదవి
చిరుచేదు జీవితపు
విరుపులా నా పెదవి
మేధస్సు చీల్చుకొని
మెరుపులా ప్రవహించు
విజ్ఞాన దీపికల
వెదజల్లు నా పెదవి

మేఘావృతమ్మైన
ముఖమండ లమ్ముపై
చురకత్తి విసురులో
మెరుపులా నా పెదవి

మబ్బు తునకల్లేవి
మధుమాస గగనాన
చిరు సూర్యకాంతిలో
హరివిల్లు నా పెదవి

అలసి సొలసిన మనిషి
అదుముకొను పెదవులను
ఆ పెదవి విప్పెనా ! ? !
దశదిశల మానవుల
తలలపై ఎగిరేటి
విహగ పంక్తుల్లాటి
మాటలే పెదవిపై
పాటలై పలవించు

దొండపండుల్లాంటి
రెండు పెదవుల జతలు
కలుసుకుంటే చాలు
మెలుచుకుంటే చాలు
మధురమగు మంటలో
మాడిపోవును దేహ
మాపాద మస్తకము

మరుని పొదరింటిలో
విరుల దొంతర పైని
చిరు చీకటుల మధ్య
అరుణార్ద్రిమా పెదవి
వేరొక్క పెదవిలో
కోరికల వర్షించు.

తొలిసంజె వెలుగులకు
కిలకిలా రావాలు
పలుకు స్వాగతగీతి
చెవిసోకితే చాలు
శ్రుతిగల్పి నా పెదవి
సుప్రభాతము పాడు.

మెల్లగా చల్లగా
ఝల్లుమను నునువెచ్చ
స్పర్శలో గిలిగింత
స్వరము పాడును పెదవి
కడగళ్ళ వడగళ్ళ
కటికి బతుకుల్లోన
కాంతికిరణము పెదవి
శాంతి కిరణము పెదవి.

(ఎడార్డ్స్ మెఝులేటిస్ (సోవియట్ కవి)కు కించిత్ స్వేచ్ఛ+అను వాదం).

పాలెగాడు

కథానిక

నర్సమ్మ కొడుకు అప్పలసాఁవి తల్లికాళ్ళ దగ్గిరి కూర్చున్నాడు. అరుగు మీద కూర్చుంది నర్సమ్మ. చలిగాలి తగలకుండా, చింకిదుప్పటి కప్పుకుంది. దుప్పటి చిరిగి పోయిందని ఏడవక్కార్లేదు నర్సమ్మ-దాని బతుకంత కంటె ఎక్కువగానే చిరుగులు పడిపోయింది. బయటి చలి దానికో లెక్కకాదు-బతుకే చలిపట్టిపోయింది-దాన్ని ఏ దుప్పటితో కప్పడం ? రెండేళ్ళ కిందట మొగుడు చచ్చిపోయిన్నాట్నుండి - ఎప్పుడూ విచారంగా కూర్చుంటుంది నర్సమ్మ. దాని మొగుడు పోలెప్పి ఎంతో మంచి వాడు. పెళ్ళాన్ని, పిల్లల్ని, కొసకి గొర్రె పిల్లల్నికూడా అభిమానంగా చూస్కునే వాడు. ఏ నాడూ మందు చుక్కైనా వేస్కునేవాడుకాడు. అంబలి తప్పమరో రకం తిండన్నది ఎరగడు. అయితే మందు వేస్కోడానికి, అంబలి తప్ప మరోటి తినకుండా వుండడానికి కారణాలేమిటి ? పోలెప్పి గాంధీ మహాత్ముడేదీ కాదు — నా కవకాశం వున్నప్పటికి తాగను-శనగ్గింజలే తింటాను, అంబలే తాగుతాను అని వొట్టువేస్కోడానికి. పండుగనాడే నా పట్టెడు మెతుకు తిండానికి, బుక్కెడు కల్లు తాగడానికి, గజంగుడ్డ కట్టడానికి, ఈ దేశంలో కోట్లాది మందికి ఎందుకు అవకాశంలేదో అందుకే పోలెప్పికి అవకాశంలేదు-తినాలనుకున్నది తిన్లేక పోడానికి, తాగాలనుకున్నది తాగలేక పోవడానికి.

అయితే పోలెప్పికూడా ముష్టి వెధవేనా ? కాదుకాక కాదు. డబ్బున్నవాడా ? ఎంత మాత్రంకాదు. గావంచాకి చిన్న గోచికి పెద్ద అంటారే—అదీ వాడి బతుకు. వున్నదల్లా ఓ రెండెకరాల మడిచెక్క. ఏ గోదావరి జిల్లాలోనో అయితే ఈ రెండెకరాలు ఎంతచేసునో నాకు తెలీదు. కానీ శ్రీకాకుళం జిల్లాలో మాత్రం, మెరక ప్రాంతంలో రెండెకరాలు ఎంతపాటి ఆస్తో-అలాటి ఆస్తి ఉన్నవాడికే తెలుస్తుంది. దానిమీద శనక్కాయలు పండించొచ్చు, వరి పండించొచ్చు, చెరుకు వెయ్యొచ్చు, కూరగాయలు దర్జాగా పండించొచ్చు, గోగు వెయ్యవచ్చు. అయితే ఎప్పుడివన్నీ సంభవం ? నీళ్ళున్నప్పుడు. అవి లేనప్పుడు ? కొర్నించదఁవే. శ్రీకాకుళం జిల్లాలో నీరు తక్కువ కనక-సాధారణంగా మెరక పొలాలన్నీ యిదే స్థితిలో వుంటాయి.

చెప్పొచ్చేదేవిటంటే పోలెప్పిగాడి పొలంలో చెప్పుకోదగ్గ పంటలు ఏ నాడూ పండనూ లేదు-వాడింట్లో సిరి సంపదలు తులతూగిపోనూలేదు. అయితే పంటలు పండటం లేదని ఏ రైతేనా మదుపులు పెట్టకుండా కూర్చుంటాడా ? కూర్చోడే ! మదుపులు పెడుతూనే వుంటాడు-పంటలుపోతూనే వుంటాయి-మదుపులకోసం తెచ్చిన అప్పులు అలాగే వుంటాయి-వాటిమీద వడ్డీలు అలా అలా

పెరుగుతూనే ఉంటాయి-దరిమిలాను ఆ పొలాలు షావుకారు చేతుల్లోకి పోతూనే వుంటాయి, అప్పుకింది. ఈ కథా సంగ్రహం ఏవత్తుమందికీ తెలిసిందే అలాగే వెళ్ళిపోయాయి పోలెప్పి రెండెకరాలున్నూ. పొలం పోయిన్నాడుపోలెప్పి చాలా బాధపడ్డాడు. అనేక రకాలు బాధలు పడ్తూనే వున్నాడు చిన్నప్పట్నుండీ. అయితే యీ పొలం పోవడం వుందే-అది వాళ్ళ కుటుంబం ఎన్నడూ పడివుండని బాధ. "గుడ్డి కన్ను గుప్పెడు" అని సామెత చెపతారు- ఆలాంటిదే వాడి పొలంకూడా. అయినా రైతన్నవాడు ప్రాణం పోవడానికేనా యిష్ట పడతాడేమోకాని, పొలంపోతే మాత్రం భరించలేడు. అందునా పోలెప్పికి యీ పొలం తాత, తండ్రుల్నుండి సక్రమించింది.

"మా అయ్య, మా తాత సెయ్యలేని పని నేను నేసినాను. ఆల్లు మడిసెక్క లిచ్చినారునాకు-నానేమో ఆట్న-అప్పు తీర్సలేక, సావుకోరుగాడికి కిరిసీటి సేసీసినాను. మా అయ్య మా తాత బతికుండేయీ యేల నామొకంమీన వుమ్మనావికికూడా యెనక తీసుండీవోల్లు." అని అంబలి ముందు కూర్చొని పోలెప్పి అన్నాడు. ఆఖరిమాటలు వాడినోట్నుండి బయటికి పూర్తిగా రాలేదు. గొంతుకని ఏడుపు నొక్కేసింది. నర్సమ్మ చెయ్యి పట్టుకొని తినమని బతిమిలినా "నాకు ముద్ద నోటికెల్లదే-బలింవి సెయ్యక" అనేసి లేచిపోయాడు. మొగుడు కూడు తిన్లేదని కొండంత విచారంతో, తను కూడా తిండి మానేసింది నర్సమ్మ. పోలెప్పి అలాగే బెంగ పెట్టేస్కొని, మంచ మెక్కిపోయి (మందూ మాకు లేకపోవడంవల్ల కూడా కావొచ్చు) కొండెక్కిపోయాడు.

అప్పలసాంవికి భయంవేసింది, అమ్మ కూడా అయ్యలాగే విచారంతో కొండెక్కిపోతుందేమోనని. "పొలం పోనాదని బెంగెట్టుకొని అయ్యసచ్చిపోన్డు అయ్యపోనాడని బెంగెట్టుకోనిఅమ్మసచ్చిపోతే, మర్నానెందలబడిపోవాల?" ఈ సంగతి తెల్సి రాగానే అప్పలసాంవి అమ్మ దగ్గరికొచ్చి, కాళ్ళదగ్గర కూర్చున్నాడు. వాడి పెళ్ళాంవచ్చి ఆవతల పక్కని కూర్చుంది. అప్పలసాంవి ప్రారంభించాడు "అమ్మ, అయ్యి సచ్చిపోన్డు, సాల్దేటి? నాకింటికాడ పూరాగ పెద్ద బుర్రనేకంట నేసేస్తావా? అదేటో సెప్పు! పొలం పోనాదని ఆడు బెంగెట్టుకుంటే, ఆడు పోనాడని నివ్వు బెంగెట్టుకుంటే, నీ యెనక నువ్వు పోనావని నాను బెంగెట్టుకుసస్తే-ఆయెనక నాపెళ్లాం మాటేటి" అనడిగేడు. కోపంకాదు-అభిమాన వేతల్లంటే! కోడలు, కొడుకూ చెరోపక్కా కూర్చుని యీ విధంగా అడిగేసరికి నర్సమ్మ చెప్పుకొచ్చింది. "నాకు రెండు బెంగలా నాయినా! మీయయ్యపోనాడు-పూరివీకులు యిచ్చిన పొలంపోనాది. మావు నీకేటియియ్య నేదు. ఏటప్పగించినాం కొడుక్కాని బతికుండమంటావుర్నాయినా" అంది

"ఒలమ్మ, ఆ పొలం వుండి అయ్యేటీసుక పడిపోస్డే? బతికినన్నాళ్ళు

గంజిబట్టేూ కట్టకంట ! గోసి యెట్టు కొని, బుర్దలో నే దొల్లి, బుర్దేతిని కష్ట పడ్డాడు. అయితేకికేటా నామిగిల్నాదా? మనవి మెరకలు-పండిసావ్వు. పండిన్నా దేనా. ఎట్టైడు గింజలు మనం వుడకబెట్టు కొని తిన్నాంవేటే అమ్మా? ఆ కోంవి టోడికే నెల్లు మన పంటలన్నీ, అనాటి పొలం పోనాదని యేడుపేలే"! అన్నా దప్పలసాంవి....

"నాయినా, నువ్వు సిన్నోడివి, నీకు తెల్దురా ! కసింత పొలంవేన్నేక పోతే, నివ్వు రైతువని ఎవుడంటాడ్రా ఆలెక్కన మన వేలుండాల యీమడ కని ? కూల్లోల్లైపోయి పట్నాలంట ఎల్లిపోవాల ! నేకపోతే, ఆడి పొలంల వుడుపుకని, యీడి పొలంల గొప్పకని కూలికెల్లాల? నేరడో, మూరడో, పొలం నెక్క వున్నాదనింపిచ్చుకోని, యిప్పు డది పోనాదని, కూలీ బతుకు బతకా లంటేయేట్రా బతుకు నాయినా ? సస్తే నయ్యింవ్ ; ఆ బతుకు బతకనేక మీ యయ్యి సచ్చిపోన్డు, నానుండి పోన్ను" అంది నర్సమ్మ.

"అయితదన్న మాట నీ మన సుల బాద ! అమ్మా, ఒలమ్మ, నా మాటమీద కసింత ఏదస్తుంచుకోయే. రెండు సంవచ్చరాలు తిరిగే తప్పటికి నానూ పొలం కొంటాను. సూడే! నాన్ని జివైన కొడుకుని అవునో కాదో సూస్తా వుగదా ! మన మడకవి పొలాలే దొర కివా కొన్నానికి – ఎక్కడ సూసినా అమ్మకానికి పెట్టి వోళ్ళే ! కాసి మగాడే నేడు, కోంవిటోడు తప్ప. అంచేత మర్నానసంగతి సూడు-కానీ మొగాడ్ని వునో కాదో ! నీకొడు కెంతటోడో సూడాలంటే, నువ్వు బతికుండాల. నెగు నెగు, నెగిసెల్లి యీ పొద్దు కొడ్డిండి కరట్టుగ అంబలి తిను, అయెనకోసారి పొలాలంటగొర్రిపిల్లల్ని మేపు కొట్టి కెల్లు. నాను టౌన్ల కూలి కెల్తాను." అన్నాడు.

కొడుకు ప్రతాపం చూడాలని వుందో ఏమిటో నీర్సంగా, విచారంగా కూర్చోవడం మానేసింది నర్సమ్మ. ఆటూ యిటూ తిరగడం, కంపల్ని విరిసిపొయ్యిలోకి తేవడం, పశుల వెనకా తల తట్టు పట్టుకు వెళ్ళి పేడపోగు చేసుకురావడం మొదలెట్టింది. అత్త చేస్తున్న సాయానికి కొండంత పొంగి పోయింది కోడలు.

నర్సమ్మ కొడుకు అప్పలసావి జాగ్రత్తయిన వాడే. తాగడం నేర్చు కోలేదు, పట్నం షోకులు నేర్చుకోలేదు, చివరికు సినిమాలూప్పడ్డం కూడా నేర్చు కోలేదు. పోయిన మడి చెక్కల్ని తిరిగి సంపాదించేయాలని, వూర్లో "పొలెప్పి గాడి కొడుకు అప్పలసావి గాడు గనం వైన మనిసిరా ?" అని అనిపించు కోవా లని ఒకటే తాపత్రయం వాడికి యధా శక్తి పడ్తున్నాడుబాధ. శ్రీనివాసా మెడి కల్ షాపులో బంట్రోతుగా చేరేడు. ఆ కొట్లో డబ్బు చూస్తుంటే వాడికళ్ళుతిరిగి పోతూవుండేవి. రోజుక్కనీసం రెండు వేల్రూపాయిల అమ్మకం వుండేది షాపు

లో. ఆ రెండు వేఁలాపాయల్లోంచి రెండ్రూపాయలు తీసి, పీడికిర్కాలిగా యిచ్చేవారు షాపు ప్రొప్రయిటరు. ఆ రెండ్రూపాయిల్లోంచి పీడెంత మిగిల్చి వాడన్నది కాదు ప్రశ్న- మిగిల్చేవాడు, ఎంతోకొంత-అదీ కావల్సిన సంగతి. నిజంగా రెండు సంవత్సరాల్నాటికి వాడి దగ్గర నాలుగు వందలు పోగయేయి. పోలెప్పిగాని, వాడి తండ్రిగాని-ఆ మాట కొస్తే వాళ్ళ కుటుంబంలో ఎవ్వడుగాని- ఏనాడూ కళ్ళ చూశీవుండని మొత్తం అన్నమాట నాలుగు వందఁలంటే అంద రికీ కళ్ళు జిగేలు మన్నాయి. అప్పల సాఁవి కయితే స్వర్గం దొరికిపోయినంత సంతోషం కలిగింది. వెంటనే వెళ్ళేడు మంత్రాల రాఁవయ్య దగ్గరికి. వాడి పేర సలు బగ్గు రాఁవయ్య. తేలుమంత్రం, దిష్టి మంత్రం, కురుపులు తగ్గడానికి మంత్రం-యివి వాడికిబాగా వొచ్చునట. దాంతో చుట్టు పట్ల వూళ్ళన్నిటికీ వాడు మంత్రాల రాఁవయ్య అయి కూర్చు న్నాడు.

ఈమంత్రాల రాఁవయ్య రెండేళ్ళ కిఁదట సెట్టోడి పేట చెట్టు పోతయ్య దగ్గర ఎకరం పొలంకొన్నాడు. పొలం నందిగాడి చెరువుక్రిందనుంది. చెరువులో నీళ్ళుంటే పొలంకి నీరందుతుంది. కాని పీడా పొలం కొన్నప్పట్నుండి వానల్లేక, పెట్టిన పంటల్లా నాశనఁవై పోయింది. అప్పుల బాధ పడ్లేక పొలాన్ని అమ్మ కానికి పెట్టేడు. అయితే, పీడంటే అమ్మ కానికి పెట్టేడుగాని, మెరక పొలాల్ని కొనే నాధుడేడీ ? ఇలాటి పరిస్థితులలో పొలంకొంటానని వొచ్చిన అప్పలఁసావి యీ రాఁవయ్యగాడి కళ్ళకి, పెంటలవీధి కోవిల్లోవున్న రాఁవుల వారిలా కనిపిం చేడు.

బేరాల్లోకి దిగేరు. రోజల్లా పట్లు పడు తూనే వున్నారు. "నీకు ఎరికినేదేటా, సెట్టోడిపేట బుగత, అల్లయ్య సచ్చి పోతే, కారివ్ (పెద్దకార్యం) సెయ్యి నానికి డబ్బునేక బంగారంనాటి యీ పొలాన్ని నాలుగొందల కమ్మిసినాడు సెట్టోడికి. ఆడు అప్పులపాలై పోయి నా కమ్మిసినాడయిదొందలకి" రాఁవయ్య మాటని, గభీమని నరికేస్తూ అప్పల సాఁవి అన్నాడు కదా- 'నీవు అప్పుల పాలై పోయి నాకమ్మియాలని సూస్త న్నావు అంతేనా! అని గొల్లున్నవ్వేడు. కాని రాఁవయ్య నవ్వలేదు. 'నివ్వు సెప్పింది నిజవేఁన. అప్పులు పడ్నేకే అమ్మేస్తున్నాను. కానొరే, అప్పల సాఁవి, నీ కింక సిన్నతనం! మీ యయ్య పొలఁవేల అమ్మిసినాడో నీకు తెల్దా? మన్లాటి నాదారి రైతులు పొలం నిలబెట్టు కోనానికి మనకేటుందిరా ఆ దరువు ? గవుర్‌మెంటు లోన్లు మల్లాటి సిన్నరైతు లకి యిస్తున్నావో అని గోలే! ఏనాడే నా మనకి ముట్టినా యేటి లోన్లు? పంచాతి పెసెంట్లుకి, సఁవితి పెసెంట్లకి, యింకా మోతుబరోళ్ళకీ-యీాళ్ళకే ముదరన్నాయి లోన్లు. అల్లకేఁవో యీ డబ్బు పులగం మీద పప్పునాటిది. ఈళ్ళు గవుర్‌మెంటు నుండందుకున్న లోన్లు మన్లాటోల్లకి అప్పులిచ్చి, వొడ్డీలు గుంజీ, పొలా ల్లాపించేసుకొనీ పెద్దోలవుతున్నారు.

నీకు సత్తువుందా కిందోమీదోపడి పొలం నిలబెట్టుకుంటావు సత్తు విరిగిన మర్నాడు – నక్కపోతు కోడిపిల్లని నొక్కేసినట్లు, యీ డబ్బునోళ్లు మన్లాటోళ్లని నొక్కేసి మనకున్న సెక్కాముక్కా ఎండేస్తారు. అయితదాలగుండ్నీ-నానయి దొండలకి కొన్న పొలం, నీకు నాలు గొండలకిచ్చీమంటావు గదా – మర్నాకు పూరాగా అప్పూ తీరదు – పొలంపూ బోతాది– మర్రేలా అయమ్మకం" అన్నాడు బగ్గ రాంవయ్యా.

విసిగిపోయాడు అప్పలసాంవి. ఇది గ్రహించేడు రాంవయ్యా. ఆఖరి దరువు కింద అన్నాడు 'అదికాదు రప్పలసాంవీ, సెడిపోయి తెగుదెంపులేసుకోనా నీకే అమ్మకానికెట్టి నానుగదా-దానమ్మ, నా నెట్టిన కర్సేనా రాకపోతే —" నసిగేడు.

బీడీ తీసి, కొసగిల్లేసి, వేళ్ళతోనలిపి, పళ్ళకు మధ్యని బిగించి వెలిగించేడు అప్పలసాంవి. రెండుదమ్ములీ్న పీల్చేక అన్నాడు 'రాంవియ్యా-నివ్వు సెడిపోయి పొలాన్ని నాకమ్మీరా అని నానెలా సెప్పగల్ను ? నాయవస్త కూడా కసింత కనిపెట్టరా! నాకాడున్నాయి నాలుగొండలు. అందలోదే నీ కివ్వాల, రిజష్ట్రి కర్సు లెట్టుకోవాల, ఆఫీసుకాడ బంట్రోతులు కాడ్నుండి రిజిష్టారుదాకా అంతమందికీ కస్సిలిచ్చుకోవాల, కర్ణంమల్లీ సర్రావుని రిక్సాలో ఆఫీసుకొట్టికెల్లాల, అడికక్కడ సేపా, మాంసంవ్ తో బోయినవెట్టించాల, కాయితాలు రాయిచ్చినందుకు కట్నం సదివించుకోవాల – ఇన్ని కర్సులున్నాయి కదా-మర్నే నెందలబడిపోవాల ? సూస్తే నాలుగొండలున్నాయి నాకాడ – నివ్వయితే కొన్నదర యిమ్మంటున్నవ్. నివ్వు సెప్పిందీ దరంవేలే. నివ్వెట్టిన మదువు అయిదొండలూ రాకపోతే మరెలా అమ్మడం? రాంవియ్యా, మనకితెగదురా – నివ్వు మరోకాడ బేరం సూస్కో, నాను మరోమడకని పొలం సూస్కుంటాను'.

లేచి వెళ్ళిపోయాడు అప్పలసాంవి. ఇలా బేరం చెడిపోయి నందుకు యిద్దరూ విసవిసలాడుతూనే వున్నారు. ఈ పొలం దొరికితే యింటికి దగ్గరగా వుంటుందని ఆశపడ్డాడు అప్పలసాంవి పొలంలో బక్కా, బడుగు దూరినా యింటి ముందుకూర్చుంటే అవుపిస్తుంది, కేకవేసి అదురుకోవచ్చును అని ఎంతో సంబరపడ్డాడు. కాని వ్యవహారం చెడిపోయింది.

రాంవయ్యా పరిస్థితి అలానేవుంది షావుకారుదగ్గర తీసుకున్న అప్పుమీద వడ్డీ పెరిగిపోతుంది. భూంవిని అమ్మకానికి పెట్టి ఏడాదయింది. కాని యింత వస్తూ కొంటానని ముందు కొచ్చిన మొనగాడే లేడు. ఇవాళ అప్పలసాంవి గాడు వొచ్చేడంటే, వాడిచ్చేడబ్బుతో అప్పె తీరదు–మరెందుకా అమ్మకోవడం.

పుగాకు నవుల్తూ, రంగడి టీ బడ్డీలో దూరేడు రాంవయ్యా. టీ పడేసరికి కొత్త ఆలోచన వొచ్చింది. వురుకుల్తోనీ, పరుగుల్తోనీ అప్పలసాంవి

యింటికి చేరుకున్నాడు.

ఆలోచన్లో వున్నాడు అప్పల సాఁవి. ఆలోచిస్తూ, ఎటో సూస్తూ, గొర్రె పోతునోట్లో, గడ్డికుదుళ్ళు కూరుతున్నాడు. (పొట్టేలుని పందేలకి తయారు చేసే పనిలో గడ్డితినిపించడం ఒకభాగం పచ్చగడ్డి కుదుళ్ళని నోటికి అందించి తినిపిస్తారు. కాని ఆ గడ్డిని పూర్తిగా నవిలి తినేదాకా వ్యవధి యివ్వరు గొర్రె పోతుకి–గబగబ కూరేస్తారునోట్లో. ఇలా చేస్తే బలంగా తయారవు తుందని వాళ్ళ నమ్మకం.)

మంత్రాల రాఁవయ్య పలకరించేడు అప్పలసాఁవి. తలతిప్పి చూసి "ఏట్రా, మల్లింతలోనే పారొచ్చినావు, యేటేనా తెగిందేటి ఆలోసన ?" అనడిగే డప్పలసాఁవి.

"అదేన్రా. ఓ పన్జేస్తే యెనాగుం టుదో నిన్నడగాలని పారొచ్చినాను. అప్పల్నాఁవోరే, దైవసొచ్చిగా సెపత న్నాను-నాను నాబవేటక్కర్నేదుర, నా నెట్టిన మదుపు నాకెలిపోస్తేసాలు. నీకాడ సూస్తే నాలుగొందలే వున్నాయంటు న్నావ్. నానొకమాటనేస్తాను-నివ్వేటి అనుకోనంటే."

"సెప్పురాఁవియ్య, సల్లకొచ్చి ముంతేల్దాసాలా !"

"మరేట్నేదురా, నాయప్పు తీర్నట్టుంటుంది' నీకుబూఁవి దక్కినట్టూ వుంటాది–నాన్సెప్పితే సావుకోరునూరో' నూటేప్పయ్యో అప్పిస్తాడునీకు. నా ఆయిదొందలు నాకిచ్చి ఒక్కడాది పండిందటే, అప్పొరిగిపోద్ది''

అప్పలసాఁవి ఓ విధంగా తుళ్ళి పడ్డాడనే చెప్పాలి–ఎంచేతంటే గడ్డిమింగుతున్న గొర్రెగభీమని తుళ్ళిపడింది కాబట్టి. అప్పుచేసి తీర్చలేక తన తండ్రి పొలం అమ్మేసుకున్నాడు. ఇప్పుడీ రావయ్య అప్పులబాధ పడ్లేక పొలం అమ్మెయ్యాలని చూస్తున్నాడు తనకి. మరితలిస్తేలిసి తనుకూడా అప్పుల్లోకి దిగితే– పొలంకొనడానికే అయినా–" కసింత ఆలోసిస్తే" అంతకంటే మరో మార్గం కనపడ్డంలేదు. పొలంకొనాలంటే ప్రస్తుతానికి అదొక్కటే పద్ధతి అయినా ఆలోచించి చెపతానన్నాడురాఁవయ్యతో. సాయింత్రం"సెరూదుక్కు యెల్లేటప్పుడో పాలి'' రమ్మన్నాడు.

అమ్మకి చెపితే, అప్పుచేసి పప్పు కూడు ఒద్దుగాక వొద్దు అనేస్తుంది. అందుకని పెళ్ళాంతో సలహాచేసేడు. "రెక్కలు ముక్కలు సేసుకొని కష్ట పడితే తల్లి మాలచ్చి భూదేవి మన కన్నాయం సేస్తాదేటి- మరో ఆలోస నెట్టుకోకు- సావుకారు దగ్గిర వొందో, యేవియ్యో నోడి పొలంకొనీ" అని సలహా యిచ్చింది పెళ్ళాం.

ఆ విధంగా పొలంకొండానికి వంద రూపాయిలు అప్పుతీసుకున్నాడు అప్పల సామి షావుకారు దగ్గర. ఆ డబ్బు చాల్లేదు. రిజిష్ట్రేషన్ ఖర్చులకోసం, యితర అమాంబాపతులకోసం తను ప్రాణప్రదంగా పెంచుకొస్తున్న గొర్రె

పోతులు రెండింటినీ అమ్మేసేడు. కొన్న పొలం బాగుచెయ్యడానికే, వ్యవసాయపు మదుపులకే షావుకారిదగ్గర మరో వంద వాడేడు.

మూడేళ్ళయింది అప్పలసామి పొలం కొని, చచ్చిపోయిన పోతేప్పులు, బతికి చెడిపోయిన రామయ్యలు- వీళ్ళను మించినవాడు కాదే యీ అప్పలసామి! వాళ్ళలాగే నానా బాధలూ పడ్డాడు పొలం నిలబెట్టుకోడానికి. అయితే, పల్లెటూళ్ళలో షావుకార్ల అప్పుల సాలెగూడు నుండి బయటపడ్డవాళ్ళు- బహుశా నూటికో, కోటికో ఒక్కరుండవచ్చు. అందరికీ ఏగతి పడుతుందో, పట్టిందో- అదేగతి పట్టింది అప్పలసామికి

మళ్ళీ శ్రీనివాసా మెడికల్‌షాపులో బంట్రోతు పన్లో చేరాడు. "నీ యిష్టం వొచ్చినప్పుడు వొస్తూవుండడానికి- యిదేం అత్తవారిల్లనుకున్నావేవిటి, పో, యిక్కడేం పన్లేదు" అని కుక్కను గసిరినట్టు గసిరేడు అప్పలసామిని, మందులకొట్టు ప్రొప్రయిటర్. అయితే, అప్పలసామి వొదలకుండా కాళ్ళావేళ్ళా పడ్డాడు. వీడి బలహీనత కనిపెట్టి, బాగా బతిమాలించుకుని ఆఖరట "రూపాయి ముప్పావలానే కూలికింద యిస్తాను రోజువారీ, నీ కిష్టమైతే వుండు, లేకపోతే పో" అన్నాడా ప్రొప్రయిటర్. అదే మహా ప్రసాదమని అంతకే ఒప్పుకొని పన్లో కుదిరేడు అప్పలసామి.

—ఎ. వి. రెడ్డిశాస్త్రి

గుండెలావా

సుప్తంగా నిక్షిప్తంగా
గుప్తంగా నిర్లిప్తంగా
అగ్నిలా అనలంలా
కేకలా చాకిరి మూకలా
వాటికి గుండెల్లో నివిష్ట
దానిపై అనుక్షణం
మందాంధుల, కబంధుల
పాదాలకింద పుర్రెలు పగుల్తూ
ఎర్రగా ఎర్రగా
లో అనలాన్ని ఎర్రఎర్రెర్రగా
మండిస్తోంది మాడుస్తోంది
మండి మండి ఆకిటి
గుండె పగిలి ఎప్పుడో ఒకప్పుడు
లావాలా..........................

—వత్సులి శివకుమార్

చాటు పద్యాల్లో సరసత

డా॥ బూదరాజు రాధాకృష్ణ

సంస్కృతం నుంచి తెలుగులోకి వచ్చిన అనేక పదాల్లాగానే 'చాటు' శబ్దం కూడా అర్థవిపరిణామం సంతరించుకుంది. సంస్కృతంలో "చాటు" శబ్దానికి ప్రియవాక్యమని అర్థం. తెలుగు నిఘంటువుల్లో ఈ మాటకు 'చెల్లింపు మాట, ఇచ్చకాలు, పొగడ్త' వంటి అనేక అర్థచ్ఛాయలున్నాయి. చాటు పద్యాలంటే ఆశువుగా ఏదో విషయాన్ని గురించి చమత్కారపూర్వకంగా చెప్పిన పద్యాలు అనే అర్థమే వ్యాప్తిలో వుంది. రాజులమీది ప్రశంశాపద్యాల నుంచి అత్యంత సాధారణ దైనందిన వ్యవహారాలవరకూ సమస్త విషయాలమీదా తెలుగులో చాటుపద్యాలు లభిస్తాయి. ఆ యీపద్యాల రచయితలెవ్వరో కొన్నింటి విషయంలో తెలుసు - మరికొన్నింటి విషయంలో తెలియదు. నీతి, శృంగార, హాస్య, కరుణాదులను ప్రతిబింబించేవి, మోటుసరసాల నుంచి పొడుపు కథల వరకూ అనేక సందర్భాలను వివరించేవి చాటుపద్యాలున్నాయి. కొన్ని చాటువులు గంభీరభావాలతో శ్లేషయమకాలతో నడిచినవీ లభిస్తున్నాయి. ఆశువుగా చెప్పిన చాటుపద్యమే నిజానికి కవిత్వమనే భావం కలిగించిన తిరుపతి వేంకట కవులు తెలుగు సాహిత్యంలో పెద్దపేరు సంపాదించారు. నాకు తెలిసినంతలో ఖడ్గతిక్కన కాలం నుంచి నేటివరకూ సుప్రసిద్ధులూ అజ్ఞాతకవులూ చెప్పిన చాటుపద్యాలు అవిచ్ఛిన్నంగా భిన్నకాలాలవీ దొరుకుతున్నాయి. ఒకప్పుడు పొడుపుకథల రూపంలో ఉన్న 'దీని భావమేమి తిరుమలేశ, 'సమ్మెటాంక సోమ జాణరాయ'వంటి చాటువులను 'భావకవిత్వం' అని పిలిచేవారు. వేటూరి ప్రభాకరశాస్త్రిగారూ, దీపాల పిచ్చయ్యశాస్త్రిగారూ 'చాటుపద్య మణిమంజరి, చాటుపద్య రత్నాకరం' అనే సంకలన గ్రంథాలు ప్రచురించారు. తిరుపతి వేంకటకవుల "చాటువులు" సుప్రసిద్ధాలు.

చాటు సాహిత్యాన్ని జానపద సాహిత్యంగా భావించిన ప్రాక్పశ్చిమ పండితులు లేకపోలేదు. ఐతే ఈ రెండూ ఒకటేనని విమర్శకులందరూ అంగీకరించరు. పాశ్చాత్యదేశాల్లో చాటుకవితా సంప్రదాయానికి భారతదేశంలో ఉన్నంత ప్రఖ్యాతిగాని, ప్రాచుర్యంగానీ వున్నట్లు కనిపించదు. వారిలో ఆశుకవుల సంఖ్య చాలా తక్కువ. సుప్రసిద్ధ కవుల్లో టెనిసన్ వంటి వారు కొందరే కనిపిస్తారు. "ఎక్స టెంపోర్ పొయెట్రీ" అని వారి రచనలకు పేరు. ప్రాచీన గ్రీక్, లాటిన్ సాహిత్యాల్లో ఈ సంప్రదాయం లేకపోలేదు గాని దానికి

ప్రసిద్ధిలేదు మధ్యయుగాలనాటి యూరప్‌లో ఇంప్రువైజర్స్ అనే గాయక కవులు ఊరూరా తిరిగి మన అవధానులు ఆశువుగా ఆయా విషయాలమీద పద్యా లల్లినట్లుగా పాటలల్లుతుండేవారని రష్యన్ మహాకవి పుష్కిన్ రాసిన ఒక కథానిక ద్వారా తెలుస్తుంది. అయితే ప్రాచ్య పాశ్చాత్య సాహిత్యాల్లోని చాటు పద్యాల్లో 'సరసంగా' ఉన్నవెన్ని అన్న ప్రశ్నకు సరైన సమాధానం చెప్పటం కష్టం. నిత్యవ్యవహారంలో నర్మ సంభాషణలకు మాత్రమే సరసత్వం అనే పేరుంది. కొంతవరకు హాస్యచమత్కార పూర్వక ప్రసంగాలను కూడా సరసంగా భావించటం కద్దు. తెలుగు సాహిత్యంలోని చాటుపద్యాల్లో మోటు సరసాల పాలూ తిట్ల పాలూ ఎక్కువ. కుల ప్రసక్తి లేని చాటువుల సంఖ్య తక్కువ. అటువంటివి ఇటువంటి సందర్భాల్లో ప్రస్తావయోగ్యాలు కావు. అందువల్ల ప్రస్తుతం ప్రస్తావించదగ్గ సరస చాటుపద్యాలు కొన్నిమాత్రమే. సమకాలిక కవులు సమకాలీనులను, ఆధునిక పరిస్థితులనూ సరసంగా విమర్శి స్తూ చెప్పిన చాటుపద్యా లెన్నో ఉన్నాయి. కాని వాటిని ప్రస్తావించటం మరింత ప్రమాదకరం. అందువల్ల ప్రసంగపరిధి సంకోచిస్తున్నది.

మన మధ్యయుగాలనాటి మహారాజులు స్తుతిప్రియులు. ఆమాటకొస్తే భగవంతుడుగూడా అర్చనప్రియుడు, భక్తవత్సలుడు. అందువల్ల జానెడుపొట్ట కోసం మన పూర్వ కవులు ఎదటా, చాటుమాటునా, తమతమ ప్రభువులను పొగుడుతూ చాటువులు చెప్పేవారు. ఒక రాజుగారికి అతిశయోక్తులంటే మంట. స్వభావోక్తులంటే యిష్టం. అందుకని ఒక పూర్వకవి సరసంగా ఆరాజు మీద చాటువొకటి చెప్పాడు. 'అన్నాతి గూడ హరుడవు, అన్నాతిని గూడకున్న నసురగురుండౌ, అన్నా తిరుమలరాయా. కన్నొక్కటి లేదుగాని కంతుడవయ్యా' అని. ఒంటికంటి రాజుగారు రాణిగారితో కలిసివున్నప్పుడు ముక్కంటి. లేనప్పుడు శుక్రాచార్యుడు ఐతేనేం? ఆయన ఒక కన్నులేకపోయినా మన్మథు డేనట! రెండుకళ్ళూ వుంటే ఏమయ్యేవాడో కవిగారు చెప్పలేదు మరి. రాజు గారి పరోక్షంలో వారిని పొగుడుతూ వారి పరివారాన్ని తెగడ్తూ సరసంగా చెప్పిన చాటువులు లేకపోలేదు. 'కోమటి వేమన త్యాగము, భూమి ప్రసిద్ధంబు కల్పభూజము వలనన్, పామున్న పగిది తురగా, రాముండున్నాడు చేరరా దెవ్వరికిన్' అనే చాటువు రాజుగారి త్యాగాన్ని పరోక్షంలో స్తుతిస్తూ పరివార దేవతలను అధిక్షేపిస్తుంది.

వొకర్ని పొగడటం ఒక ఎత్తయితే ఒకర్నొకరు పొగడుకోవటం మరో ఎత్తు. ఈ శుభలక్షణానికి దేశకాలావధులు లేవు. పశుపక్ష్యాదుల్లోకూడా ఈ సద్గుణముందని పుల్లకవి చాటువు సరసంగా వివరిస్తుంది. 'కోణంగి నాట్యముల్ కోతులాడించంగ ఊరకుందులు తలలూపినట్లు, గూబకూతలు విని గువ్వలు

తలలూచిపోయి కాకుల్లవద్ద పొగడినట్లు కొలువదరినుండి కప్పలంకించగా నేంద్ర కాయలు తలలెత్తినట్లు, ఎనుబోతు బిరుదులు మనుబోతు పొగడంగ మేలుమేలని గొర్రె మెచ్చినట్లు, ఓగు దగిడీలు తమలోన నొకరినొకరు, మెచ్చుకొనుచుందు రెటువంటి పిచ్చితనమొ, మేలుమేలెట్టి గుణము నిర్మించినాడు, పుల్లకవినేలు గోపికా వల్లభుండు'.

కొందరు సామాన్య కవులు సామాన్య విషయాలమీద సామాన్యంగా చెప్పిన చాటుపద్యాలున్నాయి. ఒక కవి 'నల్లులు లేవని వస్త్రమి, కొల్లలుగా చేరెడేసి గోడల వెంటన్, నల్లులకు తోడు దోమలు, చిల్లులువడ కుట్టెనయ్య సీతారామా' అని వాపోతే, ఒక గ్రామాధికారి జమాబందీ బాధపడలేక యిలా మొత్తుకున్నాడు— 'శీతలవారి స్నానము, భూతల శయనంబు ఒంటిపూటశనం బున్, నాతిగల బ్రహ్మచర్యము, నాతరమా దినము గడప నారయభూపా.' మరోకవి తనకు వేళకు తిండిపెట్టలేదని 'అగ్నిగుండాలవారి మర్యాద గొప్ప, ప్రేమతో వారు పెట్టెడు పెట్టుగొప్ప, భానుడపరాద్రిలోపల బడకమున్న, నింతలోపల ప్రాణమ్ము వెడలకున్న' అని ఆక్షేపించాడు సరసంగా. ఇంకో కవి బహుశా తన భార్యనేమో సరిగమలు పల్కించి చాటువురూపంలో బతిమాలుకున్నాడు— 'మాపని నీపనిగాదా? పాపను మా పాపగారి పని నీపనిగా, నీపని దాపని పనిగద: పాపనిపనిమాని, దానిపనిగానిమ్మా? మరింకోకవి బుక్కపట్నం తిరుమల తాతాచార్యులుంగారు ఎవరిమీదనో సరససల్లాపాలతో చాటువుగా 'దా స్తంత నళ్యమడిగిన, నా స్త్రీయని పలుకువాని నాలుకపీకా' అన్నాడు. తమలో తాము కలహించిన కవులు ఒకరినొకరు మొరటుగా చాటుపద్యాలతో తిట్టుకోవడం పరిపాటిగావుంటే మూడోవ్యక్తి దగ్గర దా స్తంత సరసంగా తమ సద్భావాన్ని చాటుకున్నందుకు కూడా ఉదాహరణలు దొరుకుతాయి. వాసిరెడ్డి వేంకటాద్రి నాయనింగారి ఆస్థానంలో బుచ్చివెంకు అనేకవి విద్యాప్రదర్శనం చేస్తే అతని వ్యక్తిగత లోపాలు బయటపెట్టడానికి సమయంకోసం ఎదురుచూస్తున్న మరో కవి రాజుగారి మాటను మరికొంత సాగదీస్తూ 'కొంకక తమరాడినయది, బొంకేలగు? వేంకటాద్రి భూపాలక! యే, న్యంకేల వాసికింగల, రంకే యిచ్చోట నిలుప రసవంతమగున్' అన్నాడట. 'జింక' అనే అర్థంలో బుచ్చివెంకు తన పద్యంలో 'న్యంకు' అన్నాడు. 'కృష్ణసారరురు న్యంకు రంకు శంబర రౌహిషా:' అనే నిఘంటువు కంఠస్థంచేసిన ఆక్షేపకుడు బుచ్చివెంకు

'రంకు' సూచించడానికి 'దయ' అనే పర్యాయపదమే వాడమన్నాడు. ఇదీ మన కవుల సరసం.

చాటుపద్యాల్లో వినిపించే భావమరదలల సరసానికి శ్రీనాథపద్యాలే మంచి ఉదాహరణలు. తాటికాయంత ముద్దలు మింగే రామయమంత్రిమీద కవిసార్వభౌముడి చాటుపద్యమిది. 'గ్రామముచేత నుండి పరికల్పిత ధాన్యము లింట నుండి శ్రీ, రామకటాక్షవీక్షణన పరంపర గల్గిన గల్గెగాక మా రామయమంత్రి భోజన పరాక్రమ మేమని చెప్పవచ్చు నా, స్వామి యెఱుంగ తత్కబళ చాతురి తాళఫల ప్రమాణమున్.' అలాంటిదే– మరొక శ్రీనాథ చాటువిది. 'మాకవి దిండి కామయ కుమారకు డన్నిట తండ్రి వైఖరే, గాక తదన్యుడెట్లగును? గాడిద కుం దురగంబు పుట్టునే? చేకొని కొంకి నక్కకును సింగము పుట్టునె? మాల కాకికిన్, గేకి జనించునే? చెనటి కుక్కకు మత్తగజంబు పుట్టునే?'

ఈ పద్యాల్లోని మంత్రులు గ్రామకరణాలే. కరణం అంటే జ్ఞాపకం వస్తుంది. ఒక కరణంగారు తమ ఘనతను కీర్తించుకొని విష్ణ్వాలయం పూజారిని వెక్కిరించగా ఆయన కొక్కిరించాడట. పక్కనున్న శివాలయం పూజారి అందుకో చిన్న సవరణ చెప్పాడట. అంటే తిరుపతి వెంకటకవులే కాక మన పూర్వకవుల్లో కూడా కొందరు జంటకవులు చాటు పద్యాలు చెప్పేవారన్నమాట. ఆ పద్యమిది. 'కరణికంబుచేసి కష్టాలు పడుకంటె, నంబితనముచూడ నాకు మేలు'– అప్పుడు మూడోవ్యక్తి 'నంబితనముచేసి నరకానపడుకంటె, జంగమగుట మేలు లింగమూర్తి' అని పద్యం పూర్తిచేశాడు. ఐతే ఈ పూరణలేని పాఠాంతరం లేకపోలేదు– 'కుడువ కూడు కద్దు గుగ్గిళ్ళు తినగద్దు, తలకు చమురు కద్దు తరుణి కద్దు' అని అంటే కరణికంలో తినడానికి తిండి, తలకు నూనె, తుదకు సంసార సుఖం కూడా వుండవని ఆయన తేల్చివేశాడన్నమాట. తిండి తిప్పలూ, ఆస్తిపాస్తులూ ప్రస్తావించగానే చప్పున గుర్తుకువచ్చే చాటుపద్యమొకటి బాగా ప్రచారంలో వుంది. 'ఏనాటి అగ్రహారమొ, మీనాటికి కంద్రికాయె మీ పనితీరన్, మానాడు మాన్యమాయెను, నానాటికి తీసికట్టు నాగంభట్టూ' అనేదా పద్యం.

శృంగారాత్మకమయిన మన చాటుపద్యాల్లో సరసం మోటు సరసంగా

వుండటం ఎక్కువ. కొంచెం శ్రమపడితే అతిశయోక్తులతో నిండిన సరస చాటువులు దొరక్కపోవు. కొత్తగా కాపురానికి వచ్చిన ఒక యిల్లాలు భర్తను యుద్ధరంగానికో గ్రామాంతరానికో పంపుతూ అక్షతలు చల్లబోయింది. అప్పుడామెకు కలిగినసంకటాన్ని ఒకానొక చాటుపద్యంలో సరసంగా వర్ణించాడొక కవి. 'కలలోనైనను పాయజాల వకటా కాంతుండ, నన్బాసితే, తఱపూవాడకపోయి రమ్మనుచు చెంతంజేరి హస్తాక్షతల్, తలపై చల్లగబూన చేచెమట, సంతాపాగ్ని, కూడయ్యె అచ్చెలి ప్రాణేశుని చుట్టురాదిగిచివైచెన్ సిగ్గు రెట్టింపగాన్.' ఆమెచేతి చెమటకు విరహాగ్ని తోడ్పడితే బియ్యపుగింజలు అన్నమైపోయినవట. అన్నాన్ని అక్షతలుగా చల్లరాదు కాబట్టి ఆమె సిగ్గుపడుతూ తలచుట్టూ తిప్పి భర్తకు దిష్టి తీసివేసిందట ! ఇదో సరసం !

ఇదంతా మనుషుల విషయం. జంతువులను, వస్తువులనూ చాటుపద్యాల్లో వర్ణించిన వారు మరికొందరున్నారు ఇంటింటా తిరిగే ఎలుకలనూ పిల్లులనూ పొగిడే చాటువులవి.' నిర్ణిద్రవిషయుక్త విశితదంష్ట్రిలబూని భేదించు నెటువంటి గాదెనైన, దారుణోద్యద్దంతతతి చేత ఖండించు గురుతుగా నెటువంటి కోకనైన, పటుసురంగాగార భరితంబుగా త్రవ్వు పొంకాన నెటువంటి భూమినైన, కీచుకీచు ధ్వని ప్రాచుర్య మహిమచే వర్ణించు నెటువంటి వారినైన' అని మూషక చక్రవర్తి నొకరు సరసంగా వర్ణిస్తే మరోకవి 'సకల గృహవర్తి మార్జాల చక్రవర్తి, అని పిల్లిని ప్రస్తుతిస్తూ ఎలుకలు, చిలకలు, తేళ్ళు, కోళ్లు మొదలయిన వాటిని భక్షించటంలో దానికున్న ప్రావీణ్యం ప్రస్తుతించాడు. పొగాకు వంటి వస్తువుల మీద వచ్చిన చాటువులు ఈ శతాబ్ది మొదట్లో ఎంత ప్రశస్తికి వచ్చాయో గిరీశం బృహన్నారదీయంలోవిదని బుకాయించిన పద్యమే సాక్ష్యమిస్తుంది. చివరికి పొగాకు ఒక కవి దృష్టిలో 'ఇంచువిలుకాని చేతిబాకై' కూచుంది. పొగాకు అమృతమని, అందువల్లదానికి ఎంగిలిలేదని, నశ్యం వశ్యకరమని కవులు చాటువుల మీద చాటువులు చెప్పారు.

చాటుకవితలో చివరికి సంసార వ్యవహారాలకు కూడా సరసస్థానం లభించింది. చాటుకవులకు ఎందువల్లనో కోడళ్ళ మీదే కోపముందనిపిస్తుంది. అత్తల అగడాలు చెప్పిన చాటువులు దొరకలేదుగాని కోడళ్ళ గుణగణాలను వెక్కిరించిన చాటువొకటిఉంది. 'పొరుగిళ్ళ కూర్చుండి పొద్దుపుచ్చగనేర్పె నీలాటి రేవున

నిల్వనేర్చె, అత్తాడబిడ్డల నాడిపోయగ నేర్చె కూర్చుండి నట్టింట గొణగనేర్చె, పనివేళ మూల్గుచు పండుకోగా నేర్చె చెంపను సున్నంబు నింపనేర్చె, పసిబిడ్డ లేడ్వంగ విసరికొట్టగ నేర్చె ఒక రెండు పస్తులు నుండనేర్చె, పెఖ్ఖ పెఖ్ఖన మెటికలు విరువనేర్చె, ఎవ్వరును నాకులేరని యేడ్వనేర్చె, పుట్టినింటికి చెప్పకా బోవ నేర్చె, అమర|అత్తింటి కోడలు అవగుణములు.'

ఈ విధంగా సాగిన చాటు సాహిత్యంలో నిత్యజీవితంలో కొందరి చేతల వల్ల మనకు వచ్చిపడే ఇబ్బందులు. ఆ పని చేసిన వారిని దూషిస్తూ వర్ణించిన పద్యాలు కూడా లేకపోలేదు. మానవ దౌర్బల్యాలను కొంత కఠినంగా చెప్పినా సరసంగా చెప్పాడీ కవి. 'ఆలితో కలహించి ఆకలిలేదని పస్తున్నవాడొక పంజి విధవ, ఇద్దరు ఒకచోట ఏకాంతముండగా వద్దచేరినవాడు వట్టివిధవ, చదువు చెప్పిన జీతమదనుకో ఈయక, మిటకరించెడివాడు మేటి విధవ, |తోవబోయెడు స్త్రీలతో మొగం బిగిలించి ముచ్చటాడెడువాడు ముష్టివిధవ, దారిద్ర్యమున నుండి తన పూర్వసంపద యూరక తలచువాడుత్తవిధవ...' ఈ విధంగా సాగుతుంది ఈ సీస మాలిక.

ఇరవయ్యో శతాబ్దంలో చాటుకవులుగా పేరుమోసినవారు చాలామంది ఉన్నారు. అడిదం సూరకవి బహుశా వీరికాద్యుడు అనవచ్చు. తిరుపతి వెంకట కవులు పరమ ప్రఖ్యాతులు. రాజకీయవాదిగా ఉండి చాటుకవితలో మేటి అని పించుకున్నవాడు ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య. ఆయన జగన్నాథ పండితరాయల ప్రఖ్యాత శ్లోకాన్ని అనుకరిస్తూ సంస్కృతంలో 'నయాచేరిఫారం నవా ప్లాటుఫారం' అని సంస్కారంగాని రాజకీయవేదికగాని తనకక్కరలేదంటూ చెప్పిన శ్లోకాలు కూడా ఉన్నాయి. వ్యక్తి నిర్దేశం లేకుండా సభాసాధువుగా చెప్పిన చాటు పద్యాల సంఖ్య చాలా తక్కువ ఈ నాటి వాటిలో. అందులోనూ సరసంగా చెప్పిన వాటి సంఖ్య చాలా మరీ తక్కువ. అందువల్ల ఈ వ్యాసం చాలావరకు పూర్వకవుల చాటుపద్యాలకే పరిమితం కావలసి వచ్చింది.

చాటుపద్యాలనేకం గ్రంథస్థం కాలేదు. దొరికిన చాటువులన్నింటినీ గ్రంథ స్థం చేస్తూ మరికొన్ని సంకలన గ్రంథాలు వస్తే బాగుంటుంది. ఈ పద్యాలు తెలుగువారి సాంఘిక చరిత్ర నిర్మాణానికెంతో ఉపకరిస్తాయి.

(-ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం సౌజన్యంతో)

పావురాయి

కథానిక

పాకాల సదానంద్ శారద

"అయ్యగోరు శాన మంచోరు.." అనుకున్నాడు మైసయ్య. శాంతమూర్తి గారు పావురాన్ని చేతిలోకి తీసుకొని నూకలు పెట్టడం చూసి—

శాంతమూర్తి ఆ మేడకు యజమాని

మైసయ్య ఆ మేడకు తల్లీ, తండ్రీ.

ఎక్కడిదో ఒక పావురం పిల్ల దారి తప్పి ఆ మేడ ఆవరణలోకి వచ్చింది. అదే ఇప్పుడు శాంతమూర్తి చేతిలో ఉంది.

"ఓయ్య సద్ది...." అంటూవచ్చింది ఓ పది హేనేళ్ళ అందం.

రెప్పవేయకుండా ఆ అమ్మాయినేచూడసాగాడుశాంతమూర్తి

"నా బిడ్డ బాంచెను—" అన్నాడు మైసయ్య.

"ఓరి నీ ఇల్లు బంగారంగాను—మరి ఇన్ని రోజుల్నుంచి కనుపడకపాయె నేందిరా.... ఇంత సక్కని సుక్క పుట్టినాదిరా నీ ఇంట్లో?" అన్నాడు శాంతమూర్తి అందాన్ని కళ్ళతో తాగేస్తూ—

సద్దితీసుకొని— "రత్తీ!.... అయ్యగోరికి దండం బెట్టు—" అని కూతురికి మెల్లగా చెప్పాడు మైసయ్య.

ఆ అందం రెండుచేతులు జోడించింది.

"అహ(హ(....హ(...ఇదిగో పిల్లా.... ఈ మేడ నీదనుకో—ఇయన్నీ మీ అయ్య చేతులున్నయే—నువెప్పుడంటె అప్పుడు రావచ్చు. అరే మైసిగా.. దీనికి ఒడినిండా పూలుకోసియ్యిరా.... కొంటబోయి జెడనిండా పెట్టుకోయే...." అంటూ మీసం మీద చేయివేసుకున్నాడు శాంతమూర్తి.

"దర్మ పెబువులు" అనుకున్నాడు మైసయ్య.

మరో రోజు ఆ అమ్మాయికి పండ్లు కోసివ్వమన్నాడు శాంతమూర్తి.

ఒకరోజు—"దీనికి మంచిగుడ్డలు కొనియ్యిరా..." అంటూ కొంతడబ్బు మైసయ్య చేతిలోకి విసిరాడు.

అయ్యగారి దయార్ద్ర హృదయాన్ని చూసి ఎంతో పొంగిపోయాడుమైసయ్య.

అలాంటిదొర దగ్గర పని చేయటం తన అదృష్టంగా భావించాడు.

మైసయ్యకుతెలిసిన వాళ్ళందరిచెవుల్లో శాంతమూర్తి దేవుడై కూర్చున్నాడు.

పావురం పెరిగి పెద్దదయింది.

సిల్కు దారాలు కప్పుకున్నట్లుగా దాని రెక్కలు నిగనిగలాడుతున్నాయి.

ఒకరోజు శాంతమూర్తి మైసయ్యను పిలిచి—"వంటవాడొస్తడు—ఆ పావురాన్ని వండికిచ్చేయిరా..." అని చెప్పాడు.

మైసయ్య నిర్ఘాంతపోయాడు.

"అనేంటి బాబూ. తవఁరు నూకలు బెట్టి చాదుకున్న పావురాన్ని కొయ్యమంటారా !" అన్నాడు ఆశ్చర్యంగా.

"ఓరేయ్ ఎ రినాగన్నా..." అని నవ్వి "పావురం కూర ఎంత రుచో తెలుసా ?...దానికి నూకలు బెట్టిసాదింది ఎందుకురా ?.... కోసుకోడానికి కాక పోతే !" అన్నాడు శాంతమూర్తి.

మైసయ్య నోటమాట రాలేదు.

"ఆఁ...మరిచిన...ఇంగో ఈరూపాయలుకొంటబోయి రత్తికి పట్టగొలుసులు చేయించురా ... పోరి బొత్తిగ ఉత్త కాళ్ళతో ఉంటాంది." అని జేబులోంచి రెండు పచ్చనోట్లు తీశాడు శాంతమూర్తి

కాని, ఆ రూపాయలు శాంతమూర్తి చేతిలోనే ఉండిపోయాయి—

మైసయ్య తీసుకోలేదు.

"తీసుకోరా..." అన్నాడు శాంతమూర్తి.

"వొద్దు బాబూ...."అంటూవెనక్కు అడుగులు వేశాడు మైసయ్య.

"ఓరేయ్ ఎ రినాగన్నా... దానికి నూకలుబెట్టి సాదింది ఎందుకురా ?... కోసుకోడానికి కాకపోతే !" అన్నఅయ్యగారి మాటలు మైసయ్య చెవుల్లో మారు మ్రోగుతున్నాయి.

"పైసలు చేదారా....తీసుకొమ్మంటె వద్దంటావు ?" అని గద్దించాడు శాంతమూర్తి.

"వొద్దు....వొద్దు బాంచెన్...." అంటూ రెండు చేతులు జోడించి వెనక్కు అడుగులువేసి 'ముందుకు' వెళ్ళిపోయాడు మైసయ్య.

ప్రకటన

ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం పత్రికగా 'అభ్యుదయ' హైదరాబాద్ నుండి వెలువడుతున్నది. రచయితలు, పాఠకులు, ప్రకటన కర్తలు ఏజెంట్లు, చందాదారులు మొదలయినవారు, యీ మార్పును గమనించ వలసినదిగా కోరుతున్నాం.

పైకం తప్ప తక్కిన వాటన్నింటికీ చిరునామా :

Yetukuri Prasad,
3-6-737/3,
Himayatnagar,
Hyderabad - 500 029

పైకం (చెక్కులు, డ్రాఫ్టులు, మనిఆర్డర్లు) వాటికి చిరునామా :

Y. Vijaya kumar
3-5-911/B1, Himayatnagar,
Hyderabad-500 029

సంచలనం రేపిన

'తెలుగు' సదస్సు

ఎండాకాలం వచ్చేసరికి భాగ్యనగరంలో అనేకరకాలైన సభలూ - సమావేశాలూ, సదస్సులూ జరుగుతూంటాయి. ఈ సంవత్సరం ఉస్మానియా విశ్వవిద్యాలయం వజ్రోత్సవం,ఇక చెప్పక్కర్లేదు. ప్రతి డిపార్టుమెంటూ సభలనూ-సదస్సులనూ ఏర్పాటు చేసింది.

అలా జరిగినవాట్లో ఉస్మానియా తెలుగు శాఖ - తెలుగు అకాడమీలు సంయుక్తంగా నిర్వహించిన తెలుగు చర్చా సదస్సు ఒకటి. అధికారభాషగా-బోధనా భాషగా తెలుగు ఎలా వృద్ధి చెందాలి? చెందిందీ? సాధకబాధకా లేమిటీ? అన్న అంశాలమీద చర్చ జరగటం ఉద్దేశం. మే 1 నుండి 3 వరకూ జరిగిన ఈ సదస్సుకు ఉపన్యాసకులుగానూ-ప్రధాన విషయాలపై పత్రాలను చదవటానికి చర్చలను ఆరంభించటానికి ఆంధ్రప్రదేశ్‌లోని విశ్వవిద్యాలయాల- పి జి సెంటర్ల ప్రొఫెసర్లూ. ప్రముఖులూ, ఆయా ప్రభుత్వశాఖల అధిపతులూ హాజరయ్యారు.

ప్రారంభోత్సవం గౌ॥ హయగ్రీవాచారిగారు చేస్తే ముగింపుసభలో గౌ॥ భవనం వెంకట్రాంగారు ప్రసంగించారు.

చర్చాగోష్ఠులు : (1) అధికార భాషగా తెలుగు, న్యాయస్థానాలలో తెలుగు, అనువాద భాషగా తెలుగు, (2) విశ్వవిద్యాలయాల్లో తెలుగు-స్నాతకోత్తరస్థాయిలో తెలుగు, పరిశోధనాంశంగా తెలుగు, (3) కళాశాలల్లో తెలుగు- ఐచ్ఛికాంశంగా తెలుగు కళాశాలల్లో నేర్పవలసిన తెలుగు స్వరూపం, తెలుగులో శాస్త్ర విద్యాబోధన, (4) పాఠశాలల్లో తెలుగు- ఉపాధ్యాయ సమావేశాల ఆవశ్యకత, రాష్ట్రభాషగా తెలుగుకు ఇవ్వవలసిన ప్రత్యేక స్థానం, ఇతర భాషలవారు తెలుగు నేర్చుకోవడంలో సాధకబాధకాలు అన్న అంశాలమీద జరిగాయి. అంటే హైస్కూలు నుండి పరిశోధనారంగం వరకూ అన్నిదశలనూ చేర్చారు. ఆయా రంగాలలో ప్రముఖులు పత్రాలను చదివారు. ఆరంభగోష్ఠికి

భాషా కమీషన్ అధ్యక్షులు శ్రీ వందేమాతరం రామచంద్రరావ్ అధ్యక్షత వహించారు.

ఈ సదస్సులో పాల్గొనాలని అనేక కళాశాలల తెలుగు అధ్యాపకులను రమ్మన్నారు. తెలుగు శాఖవారూ-తెలుగు అకాడమీవారూ ఉన్నారు. ఇవన్నీ తెలుగు అకాడమీలోనే జరిగాయి.

నిర్వాహకులు చాలా ఎక్కువ విషయాలమీద పత్రాలను గుప్పించారు. కొందరు చదివితే మరికొందరు ఉపన్యాసాలిచ్చారు. వీటి మీద చర్చలకు గూడా కొందరు ప్రముఖులనే నిర్వాహకులు ఏర్పాటుచేశారు. ఎటోచ్చీ ఇక్కడేజరిగింది ప్రమాదం. ఏకొద్దిమందో తప్ప ఎక్కువమంది చాలాసేపు విషయాన్ని వదిలి మాట్లాడారు. కొందరు ప్రొఫెసర్లు క్లాసురూంగా అనుకొని మాట్లాడారు. కొందరు విషయాన్ని గాలికొదిలి తమకొచ్చిన హరికథ చెప్పారు. మరికొందరు తమ చిన్ననాటి అధ్యాపక వృత్తిలోని ముచ్చట్లు చెప్పారు. దీన్నిబట్టి తెలిసిందేమంటే పేరున్న వాళ్ళు విషయానికి న్యాయం చేకూర్చకపోవటం కూడా కద్దు-అని. ఇక సదస్సులోని వ్యక్తులు చర్చలో పాల్గొనటానికి సమయం తక్కువ. ప్రతి చర్చలోను 5-10 మందికిమించకతలొ రెండు నిముషాల మేరకే మాట్లాడగల్గారు. ఎక్కువమంది ఉత్సాహం చూపడానికి వీల్లేక పోయింది తప్పనిసరిగా మాట్లాడాలి అన్నభావంతో కొందరు పాల్గొన్నారనిపించింది. ఏ మైనా చర్చలుమాత్రం ఉత్సాహం కల్గించలేదు.

ఇక చివరినాడు విషయనిర్ణయ సభ, ఈ మూడు రోజుల చర్చల ఆధారంగా తయారుచేసిన తీర్మానాలు-చర్చ-ఆమోదం, దీనికి డా॥ బి. రామరాజు గారధ్యక్షత వహిస్తే, తీర్మానాలను డా॥ బూదరాజు రాధాకృష్ణ ప్రవేశ పెట్టారు.

నిర్వాహకులు సుమారు 14 తీర్మానాలను చర్చించి ఆమోదించడానికి ప్రవేశపెట్టారు. వాటిలో

--ప్రాంతీయభాష అభివృద్ధికోసం కేంద్రబడ్జెటులోనూ ప్రణాళికల్లోనూ తగిన నిధులు కేటాయిస్తూ సమప్రాధాన్యం ఇవ్వాలి.

--పాఠ్యగ్రంథాలూ-విజ్ఞాన సర్వస్వాలూ-నిఘంటువులూ తదితరాలైనవాటి ప్రచురణకు కేంద్రం వారు విశ్వవిద్యాలయానికీ-తెలుగు అకాడమీకీ నిధులు సమకూర్చాలి

--తెలుగులో పట్టభద్రులకు ఉద్యోగావకాశాలకోసం ప్రత్యేక సదుపాయాలు రాష్ట్రప్రభుత్వం కల్పించాలి. అధికార భాషగా అన్ని స్థాయిల్లోనూ ఏకకాలంలో తెలుగును ప్రవేశపెట్టాలి.

--ప్రాథమిక స్థాయినుండి పరిశోధన స్థాయివరకు తెలుగు మాధ్యంలో బోధన జరుగుతున్న ఈ తరుణంలో సమాజావసరాల దృష్ట్యా దీన్ని పరిపుష్టం చెయ్యాలి.

--జానపద విజ్ఞాన విభాగాలను విశ్వవిద్యాలయాల్లో ఏర్పాటు చెయ్యాలి.

--ఉస్మానియా విశ్వవిద్యాలయంలో (Research Institute and laboratory for Modern Telugu language and literature) స్థాపించాలి.

ఈ అన్నితీర్మానాలను ఏకగ్రీవంగా సదస్సు ఆమోదించింది. అయితే అపస్వరం ఒక ప్రధానమైన తీర్మానం దగ్గరొచ్చింది. 1వ తరగతి నుండి 10వ తరగతివరకు పిల్లల పాఠ్యపుస్తకాలన్నీ-తెలుగుతో సహా వ్యావహారిక భాషలోనే ఉండాలని నిర్వాహకులు ప్రతిపాదించారు-దీన్ని విశ్వవిద్యాలయంలోని శ్రీ అమరేశం రాజేశ్వర శర్మలాంటి కొందరు అధ్యాపకులూ! భీమవరం డి. యన్. ఆర్. కళాశాల తెలుగుశాఖాధ్యక్షులు శ్రీ పి. వెంకట్రాజు తీవ్రంగా వ్యతిరేకించారు. కనీసం ప్రాచీన-ఆధునిక సాహిత్యాల ప్రతిపత్తి సగం సగం ఉండాలన్న మధ్యే మార్గం సవరణనుకూడా అంగీకరించక అడ్డుకున్నారు. సదస్సులోని కొందరు ఛాందసులు వత్తాసు పల్కారు. అధ్యక్షులు సర్ది చెప్తున్నా-సభలో అధికశాతం వ్యావహారిక విధానానికి బలం ఉన్నా ఈ ఛాందసుల గడబిడతో ప్రతిపాదకులు దీన్ని మొత్తంగా ఉపసంహరించుకున్నారు. సభలో అధికులకు ఈ చర్య ఆమోద యోగ్యం కాకపోవటమేకాక ఆశ్చర్యం కల్గించింది.

ఏనాడు గ్రాంథిక వ్యావహారిక వాదాలు తెలుగుదేశంలో ఆరంభమయ్యాయో నాటినుండీ గిడుగు లాంటి వ్యక్తులు పడిన శ్రమ ఎదుర్కొన్న ఆటంకాలు, ఇంత అభ్యుదయం సాధించామని విర్రవీగుతున్న ఈ కాలంలో కూడా ఎదురవడం ఆశ్చర్యం కల్గిస్తూంది. విశ్వవిద్యాలయాల్లో అధిపతులు వ్యావహారికాన్ని పరిశోధన వరకూ అంగీకరిస్తున్న ఈ తరుణంలో పచ్చి ఛాందసులు కొందరు మునిగిపోతూ ఏదో వాదం పరకను ఆసరా చేసుకోవాలనుకొంటున్నారు.

సరిగ్గా ఇన్నాళ్ళూ చక్కగా జరిగిన సదస్సు ప్రముఖులెందరో పాల్గొన్న సదస్సు ఇలా ఒక ప్రధాన తీర్మానం మీద వెనకడుగు వేయటం బాధాకరం. నిర్వాహకుల్లో సమయ స్ఫూర్తికిసంయమనం కూడా తోడై ఉంటే మరింత బాగుండేది.

ఏది ఏమైనా; అనేక విషయాలపై కొంతలో కొంత క్షుణ్ణంగా చర్చించటానికి-తెలుగుబతుకెలా ఉందో పర్యాలోకనం చేసుకోటానికి-ఈ సదస్సు అవకాశం కల్పించింది. ఏర్పాటు చేసిన నిర్వాహకులు అభినందనీయులనే అనచ్చు.

పసిపిల్లలకు విషం పోస్తున్నారు జాగ్రత్త

హైదరాబాదులో వ్యావహారిక భాషపై సదస్సు ఇచ్చిన హెచ్చరిక

వ్యావహారిక భాష గ్రాంధిక భాష పై రణభేరి మోగించిన తొలిదశ 1910. ఆనాటివరకూ పరమ గ్రాంధికభాషాభిమానులు భాషకు కృతకమైన సంకెళ్ళుతగిలించి ప్రజలు చేరుకోటానికి భయపడేంత ఎత్తులో అట్టిపెట్టారు. చదవాలన్నా, రాయాలన్నా "మనకా భాషేంవచ్చు కనుక ఆ జోలికి పోవద్దని" నిర్వ్యాపారంగా కూర్చున్నారు ప్రజలు. సువర్ణ ఘంటాకంకణాలూ, సింహతలాటాలూ, మకరకుండలాలూ శాలువాలు కప్పుకొని భాషకుమడీ-దడీ కట్టాయి.

ఇలాటి దశలో గిడుగు పిడుగుపాటుగా పడి వ్యావహారిక భాషకు ఊపిరి పోశాడు. గ్రాంధిక భాషావాదుల గుండెల్లో గాలం వేశాడు. నాటినుండి భాషా సమరం ఆరంభం. అంతవరకూ వ్యావహారికభాషంటే విసవిసలూ, రుసరుసలూ పోయేవాళ్ళుకూడా దీని సజీవత్వాన్ని దీనిలోని తార్కికత్వాన్ని అంగీకరించక తప్పిందికాదు. క్రమంగా మార్పు. చివరకు కందుకూరి వీరేశలింగంగారు 1919లో వర్తమానాంధ్ర వ్యావహారిక భాషా ప్రవర్తక సమాజాన్ని స్థాపించడమేకాదు రాజమహేంద్రవరంలో. దానికి అధ్యక్షుడుగా కూడా ఉన్నారు. అనేక యుద్ధాలూ - ప్రతియుద్ధాలూ సాగించి గ్రాంధిక భాషావాదం ఓటమి పాలైంది.

"సైతానెప్పుడూ నిద్రించదన్నది" సామెత. మురికినీరు ఏర్పడ్డప్పుడల్లా బాక్టీరియా అవకాశం చూసుకొని విజృంభిస్తుందన్నది శాస్త్రీయ సత్యం. నాటి నుండి గ్రాంధికవాదం వ్యావహారిక భాష యొక్క ఉప్పెనలో కొట్టుకొనిపోతున్నా దొరికిన గడ్డిపరకన్నా తనను ముంచకుండా తేల్చదా అని పట్టుకోటానికి అనేకసార్లు యత్నించింది. యత్నిస్తోంది కూడానూ. సరిగ్గా ఇదే జరిగిందీమధ్య. దానికితోడు విద్యార్థులు బయటవినేదీ- ఇంట్లో మాట్లాడేదీ క్లాసులో అధ్యాపకుడు చెప్పేదీ ఒకబాషైతే-తాను పుస్తకాల్లో చదివి రాసేది వేరొకటికావటంవల్ల విద్యార్థి గందరగోళంలో పడ్తున్నాడు. అతడి కేభాషా వంటబట్టటంలేదు. కనుక వ్యావహారిక భాషావాదాన్ని స్థిరీకరించాల్సిన అవసరం ఉంది.

పీలగానైనా తనకంఠం ఎత్తింది. ఓరగానన్నా పడగ విప్పింది. తుస్సుమనేలాటిదన్నా బుస్సుమంటోంది. కనుకనే చిన్నదాన్నైనా పెద్దకర్రతో కొట్టాలన్న సామెతగా ఆంధ్రప్రదేశ్ అరసం రాష్ట్రవ్యాప్తంగా గ్రాంధిక వాదాన్ని ఖండిస్తూ వ్యావహారిక భాషావాదంపై సదస్సులు జరిపి తమ తీవ్రనిరసనను తెలియచేయమని పిలుపిచ్చింది.

శ్రీ తాపీ ధర్మారావుగారి వర్ధంతిని

ఉపయోగించుకుంది. వీరూ పరమగ్రాం థికవాదిగ ఉండి వ్యావహారిక వాదిగా స్థిరపడ్డారు. మార్పుకు ఆహ్వానంపల్కారు. హైద్రాబాద్‌లో ఈ వర్ధంతి సభ వ్యావహారికభాషపై సదస్సుగా జరిగింది అధ్యక్షత వహించిన ఆం.ప్ర.అ.ర.సం. అధ్యక్షవర్గ సభ్యులు డా॥ సి. నారాయణరెడ్డి-గ్రాంథిక భాష....అంటే ప్రాచీన కావ్యాల్లోనూ-గ్రంథాల్లోనూ ఉన్న భాష నేడు మ్యూజియంలో ఉండదగింది. ఈ నాడొస్తున్న పుస్తకాల్లో రాస్తున్నదీ, మనం అంటున్నదీ-వింటున్నదీ వ్యావహారికం-కనుక నిజంగా నేడుగ్రాంథికం నదిని వెనక్కి హిమాలయాల్లోకి మళ్ళీ ప్రవహింప చెయ్యటంలాటి దన్నారు. ఇలాగే శ్రీ నరహరి వ్యావహారిక భాషా ఉద్యమాన్ని చిత్తశుద్ధితో ప్రజా ఉద్యమంగా సమైక్యంగా రూపొందించి నిర్వహించాలన్నారు.

ఆంధ్రప్రదేశ్ అరసం అధ్యక్ష వర్గ సభ్యుడూ, తెలుగు అకాడమీ డిప్యూటీ డైరెక్టరూ, డా॥ బూదరాజు రాధాకృష్ణ గ్రాంథికభాష అన్నిదశల్లోనూ కాదని పాపం పసివాళ్ళకే పరిమితం చెయ్యటం అన్యాయం. ఇది కలరా లాంటిది. దీన్ని తుడిచెయ్యకపోతే మొత్తం విద్యావృక్షమే

ఆమోదించిన తీర్మానమిది

"ప్రాథమిక స్థాయినుండి అన్నిస్థాయిల్లోనూ పాఠ్యపుస్తకాలు వ్యావహారిక భాషలోనే ఉండాలని తీర్మానిస్తోంది. దీనికి తగిన విధంగా ప్రభుత్వం విశ్వవిద్యాలయాలు చర్యలు తీసుకోవాలని ఈ సదస్సు కోరుతోంది."

అంటే ఇదే అని చమత్కరించారు ఈ మధ్య జరిగిన సదస్సులో గ్రాంథిక భాషావాదం పిలక కొద్దిగా తలెత్తింది. దీన్ని అంకురంలోనే తుంచెయ్యాలన్నారు.

దీన్ని బలపరుస్తూ అధికార భాషా సంఘం మాజీ అధ్యక్షులు శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్యగారు వ్యావహారిక భాషా ఉద్యమాన్ని అడ్డుకోవాలని ఎవరు ప్రయత్నించినా తుడిచిపెట్టుకు పోతారన్నారు. శ్రీ కాచినేని రామారావు చర్చలో పాల్గొంటూ గ్రాంథికభాషను తిరిగిపీఠంపై కూర్చోబెట్టాలనుకోవడమంటే గంగా విషపూరితం కాగలదన్నారు. ఆనాటి తెలుగు సదస్సులో తాము ప్రవేశపెట్టిన తీర్మానం ఏపరిస్థితుల్లో ఉపసంహరించుకోటం జరిగిందో వివరిస్తూ ఈ వ్యావహారికభాషా ఉద్యమాన్ని చాలా శక్తివంతంగా నిర్వహించాలని ఉద్రేకంతో ఉపన్యసించారు. చర్చలో శ్రీ శివరామకృష్ణ. ఏటుకూరి ప్రసాద్‌లు పాల్గొన్నారు.

అన్నిస్థాయుల్లోని పాఠ్యపుస్తకాలూ వ్యావహారిక భాషలో రాయించాలన్న తీర్మానాన్ని డా॥ సి. నారాయణరెడ్డి ప్రవేశపెట్టే సభ హర్షధ్వానాల మధ్య ఆమోదించింది.

వార్తాసంగ్రహం

వివాదాస్పద 'కలం' పై విభిన్న అభిప్రాయాలు

తరతరాల మూఢ నమ్మకాల ఊబిలో కూరుకుపోయిన స్త్రీజాతిని జాగృతంచేసి, వారికోసం యముడి ముందైనా నిలబడడానికి సిద్ధపడి, ఆధునిక సాహితీ మైదానంలో కలుపు మొక్కలు పెరికి, కనీసం ఓ పూవు పూయించాలని తాపత్రయపడి, సనాతన బ్రాహ్మణీకపు మూఢాచారాలను కత్తిలాంటి కలంతో చీల్చి చెండాడడానికి "సగం" జీవితం ధారపోసిన మహా రచయిత గుడిపాటి వెంకటచలానికి నగరంలో వివిధ సాహితీ సభల్లో జోహార్లు అర్పించారు.

సిటీ సెంట్రల్ లైబ్రరీలో

హైదరాబాద్ సిటీ సెంట్రల్ లైబ్రరీలో మే 19వ తేదీన చైతన్య స్టడీ సర్కిల్ ఏర్పాటు చేసిన సభలో అఖిల భారత అభ్యుదయ రచయితల సమాఖ్య కార్యదర్శి వర్గ సభ్యులు శ్రీ రాంభట్ల కృష్ణమూర్తి "చలంజీవితం రచనల"పై ప్రసంగించారు.

వ్యావహారిక భాషను ఎంత శక్తివంతంగా వినియోగించుకోవచ్చునో చలం రచనలు రుజువు చేశాయని చలం సాహిత్యమంతా వివాదగ్రస్తమైందని ఆయన అన్నారు.

దుర్భర జీవితాన్ని భరించలేని యువతులు ఐకింగ్‌హాం కాలువలో దూకి ఆత్మహత్యలు చేసుకుంటుండగా చలం వారికి రక్షణ కల్పించేవాడు అనాధ స్త్రీలకు, శిశువులకు రంగనాయకమ్మ ఆస్పత్రిలో చికిత్స చేసేవారు. చిన్నతనంలోనే వితంతువయిన ఆయన వదిన రంగనాయకమ్మకు, తనభార్యకుఆయనచదువు చెప్పించాడు అని శ్రీ రాంభట్ల అన్నారు

స్త్రీలకు స్వేచ్ఛ కావాలన్న అంశాన్ని చలం గుర్తించినప్పటికి, స్త్రీల సమస్యలను శక్తివంతంగా చిత్రించినప్పటికీ ఆయనకు సరియైన తాత్విక చింతన లేకపోవడంవల్ల ఆయన రచనలన్నీ అరాచక వాదానికి దారితీశాయని శ్రీ రాంభట్ల చెప్పారు.

భాషా నిలయంలో

మే 21వ తేదీన శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయంలో వివిధ సాహితీ సంస్థలు ఏర్పాటు చేసిన సభలో కూడా శ్రీ రాంభట్ల ప్రసంగించారు.

బ్రాహ్మణ సమాజ కర్కశత్వాన్ని తల్లిదండ్రులు పిల్లలు పెట్టే చిత్రహింసల్నీ, స్త్రీల సమస్యల్నీ చలం చిన్ననాటినుంచి నిశితంగా పరిశీలించాడు. ఈ సమగ్ర దృష్టివల్లనే ఆయన రచనల్లో తిరుగుబాటు ధోరణి ప్రతిఫలించిందని శ్రీ రాంభట్ల అన్నారు.

ఈ సభకు సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ ఇరివెంటి కృష్ణమూర్తి

అధ్యక్షత వహించారు. చలం రచనలపై విమర్శనాత్మక గ్రంథాన్ని సాహిత్య అకాడమీ ప్రచురిస్తుందని అయన వెల్లడి చేశారు.

వచన రచనలో చలం శైలి అనేకమంది రచయితలకు మార్గదర్శకం అయిందని ప్రముఖ కథా రచయిత శ్రీ డి. వెంకట్రామయ్య చెప్పారు. తాను నమ్మిన విషయాన్ని నిర్భయంగా నిర్మొహమాటంగా చెప్పగలశక్తి చలం ప్రత్యేకత అని ఆయన అన్నారు.

చలం సాహితీ జీవితాన్నిగురించి శ్రీ సురమౌళి. శ్రీ పోతుకూచి సాంబ శివరావు ప్రసంగించారు.

ఉస్మానియా యూనివర్సిటీలో

ఉస్మానియా యూనివర్శిటి "బి" హాస్టల్‌లో మే నెల 6వ తేదీన చలం సంస్మరణ సభకు రాష్ట్ర అ. ర. సం. ప్రధాన కార్యదర్శి శ్రీ ఏటుకూరి ప్రసాద్ అధ్యక్షత వహించారు.

ఆనాటి సామాజిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని చలం సాహిత్యాన్ని అంచనా వేయాలనీ, కేవలం తిట్టడం కాని, పొగడటం కాని సమంజసం కాదని ఆయన చెప్పారు.

శ్రీ డి. వెంకట్రామయ్య మాట్లాడుతూ బాధలే చలాన్ని రచయితగా తయారు చేశాయని చెప్పారు శ్రీవిజయారావ్ కృతజ్ఞతలు తెలిపారు

కడపలో

అభ్యుదయ రచయితల సంఘం కడప శాఖ, మిత్రసాహితీ సమితుల ఆధ్వర్యంలో చలం సంతాప సభ జిల్లా కేంద్ర గ్రంధాలయంలో మే నెల 18న జరిగింది. శ్రీ టి. సాంబశివారెడ్డి అధ్యక్షత వహించారు. అరసం శాఖ అధ్యక్షులు శ్రీ వై. సి. వి. రెడ్డి శ్రీ స్వాతంత్ర్యం కోసం చలం చేసిన సాహితీ సేవను వివరించారు. మిత్ర సాహితీ సమితి పధాన కార్యదర్శి శ్రీ శశిశ్రీ, "కవిగా చలం-ఒక అవగాహన" అన్న పరిశీలనాత్మక వ్యాసం చదివారు. శ్రీ మల్లెల నారాయణ, మిత్ర కళాసమితి రాయదుర్గం కార్యదర్శి శ్రీ ఎన్. బాబ్జాజీన్ మొదలయినవాళ్ళు మాట్లాడారు.

అబ్బూరి జయంతి

భాగ్యనగరంలోని అనేక సాహితీ సాంస్కృతిక సంస్థలు మే 20న కృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయంలో అభ్యుదయ రచయితల సంఘ వ్యవస్థాపకుల్లో ఒకరరచయిన ప్రముఖ కవి, నాటక కర్త' అబ్బూరి రామకృష్ణారావు 84వ జయంతిని జరిపాయి.

ప్రముఖ పత్రికా రచయిత శ్రీ నార్ల వెంకటేశ్వరరావు సభకు అధ్య

క్షత వహిస్తూ అబ్బూరి రచనాశక్తిని వివరించారు వారి రచనా శిల్పాన్నీ. గుణగణాలనూ, నాటక ప్రయోక్తగా వారి శక్తినీ ప్రస్తుతించారు, శ్రీయుతులు కొత్తపల్లి వీరభద్రరావు, బూదరాజు రాధాకృష్ణ. ఇరివెంటి కృష్ణమూర్తి, ఏ. ఆర్. కృష్ణ, ఎం. ఎల్. నరసింహారావు, పోతుకూచి సాంబశివ రావు, కుందుర్తి ప్రభృతులు ప్రసంగించారు. శ్రీ ఏటుకూరి ప్రసాద్ అబ్బూరి కవితల్లో కొన్ని భాగాలను చదివారు. భాషా నిలయం కార్యదర్శి శ్రీ ఎమ్. ఎల్. నరసింహారావు స్వాగత వచనాలు పలికారు. సభ ప్రారంభంలో అబ్బూరి చిత్రానికి శ్రీ నార్ల పూల దండతో నివాళులర్పించారు.

విశాఖలో అరసం సభ

అభ్యుదయ రచయితలు పీడిత ప్రజలకు అండగా నిలచి, వారి ఆశయాలు ఫలించడానికి తమ కలాలను సారించాలని రాష్ట్ర అరసం అధ్యక్షవర్గ సభ్యులు శ్రీ అవంత్స సోమసుందర్ ఇటీవల విశాఖపట్టణంలో జరిగిన సభలో చెప్పారు.

"శతాబ్దాలనుంచి సంస్కృత పండితులు తెలుగు భాషను భ్రష్టు పట్టించారు. 30 ఏళ్ళ కాంగ్రెసు పాలనలో మరింత కలుషితమై పోయిందని" శ్రీ సోమసుందర్ అన్నారు.

సమస్యలున్నంతవరకూ అరసం పోరాడుతూనే ఉంటుందని, అరసం అధ్యక్షులు శ్రీ పురిపండా అప్పలస్వామి అన్నారు.

ప్రజలకు అర్థమయ్యేలా అభ్యుదయ కవిరచన చేయాలి అని ప్రారంభోపన్యాసంలో డాక్టర్ కొర్లపాటి శ్రీరామమూర్తి చెప్పారు.

"ప్రయోజనం ఆశించకుండా ఏనాడూ రచనా సాగలేదు. వైదిక ధర్మంకోసం నన్నయి భారతం రాశాడు కళ కళకోసం కాదు ప్రయోజనం కోసమే అనుకున్నప్పటికీ రచనలో కళాత్మక విలువలు ఉండాలని అరసం అధ్యక్ష వర్గ సభ్యులు శ్రీ చాగంటి సోమయాజులు అన్నారు.

అబ్బూరి, చలం మృతికి సంతాప సూచకంగా రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు.

కవిసమ్మేళనంలో శ్రీయుతులు చందు సుబ్బారావు. శశికాంత్ శాతకర్ణి శ్రీబాబు, విరియాల లక్ష్మీపతి, పెమ్మరాజు గోపాలకృష్ణ, మురళి, వైజయంతి మొదలైనవారు పాల్గొన్నారు.

మాచర్లలో అరసం సభా!

ఈ మధ్య మాచర్లలో శ్రీ కరణం సుబ్బారావుగారి అధ్యక్షతన అరసం ఆరంభ సభ జరిగింది. ప్రణాళికను ఆమోదించింది. శ్రీ టి. రామాంజనేయులు ప్రసగించారు. చివరకు కవి సమ్మేళనం జరిగింది. మొదట్లో అబ్బూరికి సభ సంతాపం ప్రకటించింది.

శ్రీమతి నాయని కృష్ణ కుమారికి ఈ సంవత్సరం గృహలక్ష్మి స్వర్ణ కంకణం బహుమతి ఇస్తున్నారు.

నరసింహావ లోకనం

సమీక్ష

(జీవత్కావ్యం, ఆలాపన యస్. కె. చంద్రసేన్. ప్రతులకు:

రచయిత, 11- ఆంధ్రాబ్యాంకుకాలనీ, హైదరాబాదు-500 086.

(వెల : 2 రూ. లు)

కన్ను తెరిస్తే జననం
కన్ను మూస్తే మరణం

'రెప్పపాటే గదా ఈ ప్రయాణం'- అంటూ వేదాంత సారాన్ని మూడు ముక్కల్లో తేల్చి చెప్పేసాడు, ఈ కవి. అతనికి మానవ జీవితమే వస్తువు. ఒక్కొక్క కవితలో ఒక్కొక్క దృశ్యాన్ని చిత్రీకరించాడు. రచయిత దృక్పధం ఏమిటి ? ఎవరి పక్షాన వుండి సాహిత్యం సృష్టిస్తున్నాడు ? అనేవి అందరూ తరచి ఆలోచిస్తున్న ఈ తరుణంలో-అలాంటి ఏ ప్రశ్నలకు చిక్కకుండా ఈకవి తన ధోరణిలో తాను కవితాసృష్టి చేస్తున్నాడు.

విభిన్న దృక్పధాల మధ్య, ధోరణుల మధ్య మహామహులే నలిగిపోతున్నారు. ఇలాంటి ఇప్పటి ఈ పరిస్థితి కొత్త కవులకు, రచయితలకు అయోమయంలా ఉండడం సహజం. కేవలం నినాదాల వచ్చి వచనాన్ని కవిత్వమంటూ ఒకరు ప్రచారం చేస్తుంటే-కవిత్వమొక గొప్ప విషయమని, అది సామాన్యుల కొరకు కాదని మరి కొందరు శాలువాలు సవరించుకుంటున్నారు. అయితే ఇక్కడ ఈ కవి రెండు ధోరణులలోంచి తప్పించుకొచ్చాడు. మామూలు జీవిత సమస్యల్ని నినాదాలుగా కాకుండా కవిత్వంగా చెప్పాడు. అయితే ఇందులో తీవ్రమైన జీవిత సంఘర్షణలు చిత్రీకరించ బడలేదు.

నరుడి పుట్టుకకు, చావుకు మధ్యగల జీవితాన్ని సింహావలోకనం చేస్తాడు. అందులో అన్నిటికన్నా ముఖ్యంగాబాల్య జీవితాన్ని చాలా నిశితంగా పరిశీలిస్తాడు. "బార్ బార్ ఆతీహై ముఝ్‌కో, మధుర్ యాద్ బచ్‌పన్ తేరీ, గయా లేగయా తూ, జీవన్‌కీ మస్త్ ఖుషీ మేరీ" అని తపించిపోయిన హిందీ కవయిత్రిసుభద్రా కుమారీ చౌహాన్ లాగా-

'అమ్మలాగ చెట్టు కనిపిస్తే చాలు
కొమ్మల చంకల్లో ఎక్కి కూచునే
వాణ్ణి...

పకపక నవ్వుల్లో ఈదులాడే వాణ్ణి- అంటూ బాల్యపు మధుర స్మృతుల్లో పులకించిపోతాడు చంద్రసేన్.

కూచుని కునికి పాట్లు బట్టీ పట్టిన రోజుల్ని, నోట్లోవేలేసుకుని చీక్కుంటూ పెద్ద వాళ్ళ తగవుల్ని చూసిన రోజుల్ని, తిండిలో ఆటా-ఆటలే తిండి అయిన ఆ రోజుల్ని తల్చుకుని తల్చుకుని చిన్న

ప్పటి అనుభవాల్లో దొరికిన తీయని అనుభూతిని అందరికీ పంచుకుటూ పోతాడు.

బాల్యంలో ఆనందభరితమైన జీవితం ఎంతో ముద్దొస్తుంది. కాని బాల్యం ఎగిరి పోయి, తన కాళ్ళమీద తాను నిలవాల్సి వచ్చినప్పుడు-బరువులు బాధ్యతలు మోయాల్సి వచ్చినప్పుడు జీవితం ఎంతో హీనంగా హేయంగా కావడం కవికి ఎంతో బాధకలిగిస్తుంది.

'రెండు కాళ్ళమీద నడవ నేర్చినపుడు
ఆదర్శపు ఒంటి కాలిపై కుంటే

దయ్యాలు పీక్కేనా ?-' అని ఎంతో ఆవేదనతో, జాలితో కసితో, కోపంతో అంటాడు. ఆ తపనను శక్తివంతంగా అక్షరబద్ధం చేస్తాడు. ఇవేకాక, కడుపు కక్కుర్తి, పాల్ట్లు, ధ్వని, చెరువుల మధ్య మొదలైన మినీ కవితల్ని ఎంతో అర్థవంతంగా ఆలాపిస్తాడు. ఒక చోట 'సంకెళ్ళను ఉంచాలని వ్యవస్థా, తెంచాలని యువత-' ప్రయత్నిస్తున్నాయంటూ మొత్తం సమాజ చిత్రణని రెండు మాటల్లో ముగిస్తాడు. 'మా పెద్దనాన్నకు మేడా/మా కేమో పెంకుటిల్లూ/మా చిన్నాన్నకు గుడిసే/ఏం-ఎందుకని ?-' సంఘంలో మూడు తరగతులు ఎందుకు వుండాల్సి వస్తుందో నని వాపోతాడు. ప్రశ్నిస్తాడు. కాని అందుకు ఏ ఏ కారణాలు దోహదం చేస్తున్నాయో వాటి విశ్లేషణకు ఎక్కడా పూనుకోడు.

ఇకపోతే సెక్స్ పట్ల కవికి చీకటి అభిప్రాయం వున్నట్లు తోస్తుంది. 'తల్లి దండ్రులు పరమ పవిత్రంగా/చేసిన చీకటి తప్పును నేను' (పే. 18)-అంటూ మరోచోట- 'జీవితంలో స్త్రీ పురుషులిద్దరూ కలిసి చేసేది-ఎలా చేసినా-చీకటి తప్పు (పే. 88)-అంటాడు. కాని (It is a Biological truth) ఇచ్చితమైన ఒప్పు. 'చీకటి తప్పు'ని దిగజారి పోవడం బలహీనత. లేదా పాత అభిప్రాయాల్లో యింకా పాతుకుపోయి వుండడం. అలాగే మరో చోట శాస్త్రీయ పరిజ్ఞానం లేని అమాయకత బయట పడుతోంది. "చలనం లేకుండా/ఘనం వుంది /ప్రాణం లేకుండా/వృక్ష జాతి వుంది." (పే. 51) అంటాడు కవి. ప్రాణం లేకుండా వృక్షజాతి వుందనడం మరీ హాస్యాస్పదంగా వుంది.

ఎలాంటి గొప్ప కవితయైనా తప్పుడు అభిప్రాయాల్లోంచి గనక మొలుచుకొస్తే పిచ్చి మొక్కై-పిచ్చిపూలు పూస్తుందే తప్ప మంచిమొక్కగా ఎదగదు. అందుకని మంచికవిగా నిలబడగలగాలనుకున్న చంద్రసేన్ గారికి. "చిన్నప్పుడు తప్పటడుగులు/బాగా అలవాటై (తే)/పెద్దయింతర్వాత/అడుగడుగునా-అదే-'అన్ననిజం తెలుసు గనక, తగిన జాగ్రత్తలు తీసుకుంటారని ఆశించొచ్చు.

వసహోరాజు.